www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 13-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 119 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం, తిథి: చవితి ఉ.6.36 తదుపరి పంచమి, తె. 4.23 తదుపరి షష్ఠి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.10.32 తదుపరి రేవతి, వర్జ్యం: రా.9.49-11.19, దుర్ముహూర్తం: ఉ.11.54-12.45, అమృతఘడియలు: ఉ.6.50-8.20, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.38 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇక పార్టీపై ఫోకస్!

నేడు టీడీపీ కేంద్ర కార్యాలయానికి చంద్రబాబు, లోకేశ్

సంస్థాగత నిర్మాణంపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో చర్చలు

మిగిలిన నామినేటెడ్ పదవుల భర్తీపైనా దృష్టి

కార్యకర్తల పేర్లు పంపని ఎమ్మెల్యేలెవరో తనకు తెలియజేయాలని నిర్దేశం

13

మరో 31 నామినేటెడ్ పదవుల భర్తీ

ఓసీలకు 6, బీసీలకు 18, ఎస్సీలకు 4, ఎస్టీకి ఒకటి, మైనార్టీలకు రెండు పదవులు

టీడీపీకి 25, జనసేనకు 3, బీజేపీకి 2

అమరావతి బహుజన జేఏసీకి ఒక పదవి

ఏపీలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు

468 కోట్లతో ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

తిరుపతి ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌లో ప్రాజెక్టు నిర్మాణం


ఏటా 9.6 కోట్ల చిప్‌లు ఉత్పత్తి చేసే సామర్థ్యం

క్రమంగా రూ. 1500 కోట్లకు పెట్టుబడులు

క్యాబినెట్ నిర్ణయంపై సీఎం చంద్రబాబు హర్షం

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సాధ్యమైంది: లోకేశ్

యువతకు ఉపాధి లభిస్తుంది: రాష్ట్ర బీజేపీ



అమరావతి/న్యూఢిల్లీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర క్యాబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దేశంలో నాలుగు చోట్ల రూ. 4,594 కోట్లతో చిప్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు ఓకే చెప్పింది. ఇందులో భాగంగా రూ. 468 కోట్ల పెట్టుబడితో ఏపీలో

మిగతా 14వ పేజీలో...

రైతుల గోడు వినండి

రిటర్నబుల్ ప్లాట్లపై ఇబ్బందుల్లేకుండా చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైతుల విజ్ఞప్తులు పరిశీలించండి

మాస్టర్‌ప్లాన్ ప్రభావితం కాకుండా ఆయా సమస్యలు పరిష్కరించండి

అధికారులకు చంద్రబాబు ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనాలపై స్పందన

రాజధాని నిర్మాణాలపై సమీక్ష

రికార్డు సమయంలో పూర్తికి నిర్దేశం

హరిత ఇంధన కారిడార్‌గా అమరావతి



రాజధాని అమరావతి నిర్మాణ పనులపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, ఉన్నతాధికారులు

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 'రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రాజధాని రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి' ఇటీవల వరుస కథనాలు ప్రచురించింది. వీటిపై సీఎం చంద్రబాబు స్పందించారు. రిటర్నబుల్ ప్లాట్ల విషయంలో రైతుల విజ్ఞప్తులను పరిశీలించాలని, అయితే.. మాస్టర్ ప్లాన్ ప్రభావితం కాకుండా వాటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి నారాయణ.. వారం రోజుల్లోగా ఈ అంశాన్ని ఒక కొలిక్కి తెస్తామని సీఎంకు వివరించారు. గత వైసీపీ హయాంలో రాజధాని పనులు జరగకపోవడంతో నిర్మాణానికి తెచ్చిన ఇనుము, సామగ్రి తుప్పుపట్టిపోయిందని కాంట్రాక్టర్లు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. నిర్మాణం కోసం సేకరించిన

మిగతా 13వ పేజీలో...

విజన్‌తోనే అభివృద్ధి వెలుగులు

విద్యుత్‌లేని ఊరి నుంచి వచ్చా

ఉమ్మడి ఏపీలో సంస్కరణలు తెచ్చా

ప్రభుత్వానికి, నాక్కూడా బలంగా ఉండాలి

నియోజకవర్గాల అభివృద్ధికే ప్రాధాన్యం

యంగ్ ప్రొఫెషనల్స్ భేటీలో చంద్రబాబు

13

యావజ్జీవ ఖైదీ

శ్రీకాంత్ పెరోల్ రద్దు

14

'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రభుత్వం ఉలికిపాటు

మధ్యాహ్నం జీవో జారీ.. సాయంత్రానికి జైలుకు

ఎస్పీలు, జైలు సూపరింటెండెంట్ వద్దన్నా పెరోల్‌కు సిఫారసు చేసిందెవరు?

నిబంధనలను ఉల్లంఘించినవారెవరు?

నిఘా వర్గాల ఆరా.. సర్కారుకు నివేదన



జగన్ మార్క్ ట్రాప్!

ఆ ఉచ్చులో కొందరు టీడీపీ నేతలు

మద్యం స్కామ్‌లో ప్రభుత్వ వ్యూహంపై సోషల్ మీడియాలో అడ్డగోలు దాడి

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ముందస్తు బెయిల్‌కు అడ్డుచెప్పకపోవడంపై అభ్యంతరాలు

లీగల్ టీంపైనే అపవాదులు, అభాండాలు

అప్రూవర్లుగా మారాలంటే అరెస్టవడం లేదా ముందస్తు బెయిల్ రావడమనేది తప్పనిసరి

ఈ అనివార్యతకు అనుగుణంగానే సిట్ అడుగులు

వారు అప్రూవర్లుగా మారితేనే 'లోగుట్టు' బయటికి

అందుకే బెదరగొట్టేందుకు జగన్ కుయుక్తులు

సిట్ తన అరెస్టు దాకా రాకుండా ఎత్తులు

అవేవీ ఫలించకపోవడంతో మారిన వ్యూహం

బెయిల్‌ను వ్యతిరేకించలేదంటూ గగ్గోలు

ప్రభుత్వ వ్యూహం తెలీక గొంతు కలుపుతున్న టీడీపీ నేతలు.. ఈ రచ్చతో జగన్ ప్లాన్ ఫలించే ప్రమాదం!

14

పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను కొందరు టీడీపీ నేతలు గ్రహించలేకపోతున్నారు. మద్యం స్కాం కేసులో పీకల్లోతు కూరుకుపోయిన మాజీ సీఎం జగన్ పన్నిన వ్యూహంలో చిక్కుకుని.. పోలీసులు, ప్రభుత్వ లీగల్ టీంపైనే అభాండాలు వేస్తున్నారు. వైసీపీ హయాంలో మద్యం బ్రాండ్ల ఆర్డర్లు, విక్రయాల్లోను.. తాడేపల్లి ప్యాలెస్‌కు ముడుపుల సొమ్మును తరలించడంలో కీలక భూమిక పోషించిన నాటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ డి.వాసుదేవరెడ్డి, ఉన్నతాధికారి సత్యప్రసాద్‌కు ముందస్తు బెయిల్ వచ్చేందుకు సిట్, ప్రభుత్వ న్యాయవాదులే తోడ్పాటు అందిస్తున్నారని నిందలు మోపుతున్నారు. ఆ ఇద్దరూ అప్రూవర్లుగా మారడంలో ఇమిడి ఉన్న సాంకేతిక అంశాలు తెలియక సోషల్ మీడియాలో జగన్ బాణీలోనే చెత్త పోస్టింగులు పెడుతున్నారు. ప్రభుత్వానికి సరికొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు.

మలినాలతో మందు

నాడు జగన్ ప్రభుత్వంలో నిర్వాకం

శుద్ధిచేయని స్పిరిట్‌తోనే జేబ్రాండ్లు

కాసుల కక్కుర్తితో హడావుడిగా ఉత్పత్తి

68% ఓవర్ ప్రూఫ్ లేకుండానే తయారీ

24 గంటలు నిల్వ కూడా చేయలేదు

డైమిథోక్సినా మిక్ యాసిడ్, పైరోగలాల్, వొల్కెనిన్ లాంటి ప్రమాదకర రసాయనాలు

ఫార్మా స్పిరిట్‌తోనూ చీప్ లిక్కర్ తయారీ!

ఆయింట్‌మెంట్, టించర్‌లో వాడే రసాయనాలూ కలిసినట్టు అనుమానాలు



మద్యం కాదు.. 'విషం' అమ్మారు!



ప్రాణాలు తోడేశారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత జగన్ ప్రభుత్వానికి ముందు కూడా చీప్ లిక్కర్లు అమ్మేవారు. కానీ ఎన్నడూ జే బ్రాండ్ల తరహాలో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపలేదు. కానీ గత ప్రభుత్వంలో తయారు చేసిన నాసిరకం జే బ్రాండ్లు తాగి ఎందరో చనిపోయారు. చాలామంది తీవ్ర అనారోగ్యం బారినపడి మంచాలకు పరిమితమయ్యారు. కాసులకు కక్కుర్తిపడి ప్రమాణాలు

మిగతా 12వ పేజీలో...

పులివెందులకు ఓట్ల స్వాతంత్ర్యం

4 దశాబ్దాల తర్వాత స్వేచ్ఛగా పోలింగ్



ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న యంత్రాంగం

ఓటర్లలో ధైర్యం నింపేలా ముందస్తు చర్యలు

పోలింగ్‌కు ముందే ఎంపీ అవినాశ్ అరెస్టు

ఆసాంతం పర్యవేక్షించిన డీఐజీ, ఎస్పీ

దీంతో చేతులెత్తేసిన వైసీపీ.. ఓటే వేయని పార్టీ అభ్యర్థి

మీది వైసీపీ అయితే.. మాది ఖాకీ.. కాల్చిపారేస్తా

తాగి దూషిస్తున్నవారికి డీఎస్పీ స్ట్రాంగ్ వార్నింగ్

12

జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో 76.44 % పోలింగ్

ఒంటిమిట్టలో 81.53%.. రేపు ఫలితాలు

ఓట్ల చోరీపై సినిమా ఇంకా ఉంది!

'ఒక వ్యక్తికి ఒక ఓటు' అనేది రాజ్యాంగానికి మూలస్తంభం

ఈసీ అమలు చేయడం లేదు

2

అందుకే మేం రాజ్యాంగ రక్షణకు పోరాడుతున్నాం: రాహుల్

'124 ఏళ్ల ఓటరు' ఫొటో టీ-షర్టులు ధరించి ఎంపీల నిరసన

అభిశంసన ప్రక్రియ ప్రారంభం

జస్టిస్ వర్మ తొలగింపు అంశంలో ముగ్గురితో స్పీకర్ కమిటీ

రోడ్లపై తాగుడుకు చెక్!

షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతిస్తూ జీవో

2

అర్ధరాత్రి కుండపోత వాన

కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీ వర్షాలు

మిగిలిన కోస్తా జిల్లాల్లో భారీ వానలు

11

నేడు అల్పపీడనం.. వాయుగుండంగా మారే చాన్స్

నేడు, రేపు భారీ వర్షాలు.. శ్రీశైలానికి భారీగా వరద



గవర్నర్‌ను కలిసిన నలుగురు హైకోర్టు జడ్జీలు

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ బుధవారం ఉదయం 10 గంటలకు వీరితో శాశ్వత న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ఆ ఫొటోల్ని మార్ఫింగ్ చేయమన్నదెవరు?

» రామ్‌గోపాల్‌వర్మను విచారించిన పోలీసులు



ఒంగోలు పోలీసు స్టేషన్‌లోకి విచారణ కోసం వెళ్తున్న రామ్‌గోపాల్

ఒంగోలు క్రైం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసిన కేసులో సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మంగళవారం ఒంగోలులో పోలీసుల విచారణకు హాజరయ్యారు. నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేయడం వెనుక ఎవరు ఉన్నారని విచారణాధికారి గట్టిగా ప్రశ్నించినట్లు తెలిసింది. విచారణలో అడిగిన ప్రశ్నల్లో కొన్నింటికే సమాధానమిచ్చి.. మిగిలిన వాటిపై ఆయన మౌనం వహించారని తెలిసింది. మంగళవారం ఉదయం 11.30 నుంచి ప్రారంభమైన వర్మ విచారణ రాత్రి 11 గంటల సాగింది. విచారణకు ముందే వర్మ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వర్మను ఒంగోలులోని తాలూకా పోలీసు స్టేషన్‌లో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు సుదీర్ఘంగా విచారించారు. సుమారు 50 ప్రశ్నలను వర్మకు సంధించినట్లు సమాచారం.

వివేకా నిందితులకు బెదిరింపులపై విచారణ

» కర్నూలు ఎస్పీ విక్రాంత్ నేతృత్వంలో కమిటీ

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో నిందితులను కడప జైల్లో బెదిరించిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించింది. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో కడప డీఎంహెచ్‌వో కె. నాగరాజు, విజయవాడ జైలు సూపరింటెండెంట్ మహమ్మద్ ఇర్ఫాన్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్‌ను సభ్యులుగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన నిందితుడు షేక్ దస్తగిరి.. కడప జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న సమయంలో వైద్య శిబిరం నిర్వహించేందుకు వచ్చిన డాక్టర్ చైతన్య రెడ్డి బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకోవాలని గత ఏడాది సెప్టెంబరులో వివేకా కుమార్తె నర్రెడ్డి సునీత ప్రభుత్వాన్ని కోరారు.

జగన్ హయాంలో అరాచక పాలన: మాధవ్

తిరుపతి(విద్య), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 'దేశవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమం, నగదు బదిలీ తదితరాలన్నీ కేంద్రప్రభుత్వం ద్వారానే జరుగుతున్నాయి. ఆ అభివృద్ధి అంతా తామే చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వాలు శిలాఫలకాలు వేసుకుంటున్నాయి. ఇదే క్రమంలో గతప్రభుత్వం మూడేళ్లపాటు నిధులను దారిమళ్లించి దుర్వినియోగం చేసింది. తద్వారా రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా పోయింది. అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన చేసి పేదల కడుపు కొట్టారు' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. 'సారథ్యం' పేరిట తిరుపతిలో మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో అవినీతి కార్యక్రమాలు యథేచ్ఛగా సాగిపోయాయన్నారు. ఈ కష్టాలను కూటమి ప్రభుత్వం దాటించిందన్నారు.

ఓట్ల చోరీపై..

సినిమా ఇంకా ఉంది!

» 'ఒక వ్యక్తికి ఒక ఓటు' అనేది రాజ్యాంగానికి మూలస్తంభం

» రాజ్యాంగ రక్షణకు పోరాడుతున్నాం: రాహుల్





ఢిల్లీలో నిరసన ర్యాలీలో రాహుల్, '124 ఏళ్ల ఓటరు' మింతాదేవి ఫొటో ఉన్న టీ షర్టులతో ఎంపీల నిరసన

న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఎన్నికల కమిషన్ (ఈసీ)పై ఓట్ల చోరీ ఆరోపణలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మరింత తీవ్రతరం చేశారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు' అనేది రాజ్యాంగానికి మూల స్తంభమని.. ఈ వ్యవహారంలో ఈసీ తన విధి నిర్వర్తించడం లేదని ధ్వజమెత్తారు. సోమవారం ఈసీ ప్రధాన కార్యాలయానికి పాదయాత్రగా బయల్దేరిన ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా ఇంకా ఉంది (పిక్చర్ అభీ బాకీ హై)' అని హెచ్చరించారు. కేవలం ఒక్క నియోజకవర్గంలోనే ఓట్ల చోరీ జరుగలేదని.. చాలా ఓట్లు ఇలా జరిగిందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో ఓ పద్ధతి ప్రకారం చేశారని.. ఇది ఈసీతో పాటు తమకూ తెలుసని చెప్పారు. 'గతంలో ఇందుకు ఆధారాల్లేవు. ఇప్పుడు సాక్ష్యాలు ఉన్నాయి. ఒక వ్యక్తికి ఒకే ఓటు అనేది రాజ్యాంగ మూల స్తంభం. దానిని అమలుచేయాల్సిన ఈసీ ఆ పనిచేయడం లేదు. అందుచేత మేం రాజ్యాంగ రక్షణకు పూనుకున్నాం. దీనిని కొనసాగిస్తాం' అని స్పష్టంచేశారు. బిహార్ ఓటర్ల జాబితాలో మింతా దేవి అనే మహిళ వయసును 124 ఏళ్లుగా ఈసీ పేర్కొనటమే గాక, ఆమె తొలిసారి ఓటుహక్కు పొందినట్లుగా చెప్పడాన్ని ప్రస్తావించారు. ఇలాంటి తప్పుడు కేసులు అనేకం ఉన్నాయన్నారు. అంతకుముందు.. బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణపై పార్లమెంటులో చర్చించాలంటూ ఇండీ కూటమి ఎంపీలు పార్లమెంటు భవన సముదాయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారంతా మింతాదేవి ఫొటో, పేరు ముద్రించిన టీ షర్టులు ధరించారు. ఈ నిరసనలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీపీపీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రాతో పాటు డెరిక్ ఒబ్రియాన్ (టీఎంసీ), టీఆర్ బాలు (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్‌సీపీ-ఎస్‌పీ), వామపక్షాల ఎంపీలు పాల్గొన్నారు.

కుట్రపన్నడమే బీజేపీ నైజం: అఖిలేశ్

ఎన్నికల అక్రమాలకు కుట్రలు పన్నడమే బీజేపీ చేసే అతిపెద్ద పని అని సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఎన్నికలను ప్రభావితం చేయడానికే బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) చేపట్టారని అన్నారు. ఏడాది కిందట చేపట్టాల్సిన ఈ సవరణ ప్రక్రియను.. ప్రతిపక్షాల ఓట్లను తొలగించడానికి ఉద్దేశపూర్వకంగా ఇప్పుడు చేపట్టారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తోందని ఆర్‌జేడీ నేత, బిహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. ఓటర్ల ప్రత్యేక సవరణను ఆయన మంగళవారం పట్నాలో తప్పుబట్టారు.

లోక్‌సభను రద్దు చేయాలి: అభిషేక్

ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉన్నాయని ఈసీ భావిస్తే.. మొదట ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గం రాజీనామా చేయాలని టీఎంసీ లోక్‌సభాపక్ష నేత అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు. లోక్‌సభను రద్దుచేయాలన్నారు. ఎంపిక చేసిన రాష్ట్రాల్లో కాకుండా దేశవ్యాప్తంగా 'సర్' చేపట్టాలని స్పష్టంచేశారు. బిహార్, బెంగాల్లో ఓటర్ల హక్కులను అణచివేసేందుకే తాజాగా సవరణ చేపట్టారని కోల్‌కతాలో ఆరోపించారు. గుజరాత్, యూపీ, మధ్యప్రదేశ్, తమిళనాడుల్లో ఎందుకు చేపట్టలేదని నిలదీశారు.

రేపు కాగడా ర్యాలీ

'ఓటు చౌర్యం'పై కాంగ్రెస్ పార్టీ ఈ నెల 14న దేశవ్యాప్తంగా 'లోక్ తంత్ర బచావో' పేరుతో కాగడ ర్యాలీలకు పిలుపునిచ్చింది. అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చింది.

ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు విచారణ

» చనిపోయారని ఈసీ పేర్కొన్న ఇద్దరిని కోర్టుకు తెచ్చిన యోగేంద్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 12: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ రూపకల్పనలో అవకతవకలు జరిగినట్లు తేలితే బిహార్ ఓటర్ల జాబితాను పక్కన పెట్టేస్తామని స్పష్టం చేసింది. సెప్టెంబరు 30లోపు తుది జాబితా విడుదల చేయాల్సి ఉంది. అయితే జాబితా తయారీలో అవకతవకలు జరిగినట్లు రుజువైతే దాన్ని ఆమోదించబోమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పలు వ్యాజ్యాలను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ జరిపింది. సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సూచించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు? గతంలో నమోదైన మరణాల సంఖ్య, ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య.. వంటి సమాచారంపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని ఈసీకి తెలిపింది. పిటిషనర్లు, ఈసీ తరపు న్యాయవాదుల వాదనలు విన్న ధర్మాసనం.. పలు వ్యాఖ్యలు చేసింది. 2003 ఓటర్ల జాబితా ప్రకారం బిహార్‌లో ఉన్న 7.9 కోట్ల మంది ఓటర్లలో 6.5 కోట్ల మంది వారు, వారి తల్లిదండ్రుల గుర్తింపు కోసం ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని ఈసీ పేర్కొందని ధర్మాసనం గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం 'విశ్వాస లోటు అంశం'మే తప్ప మరోటి కాదని పేర్కొంది. "7.9 కోట్ల మంది ఓటర్లలో 7.24 కోట్ల మంది ఎస్ఐఆర్‌పై స్పందించారు. ఈ నేపథ్యంలో కోటి మంది ఓటర్లు గల్లంతయ్యారు లేదా తొలగించారన్న సిద్ధాంతానికి తావెక్కడిది?" అని పిటిషనర్, ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున హాజరైన న్యాయవాది కపిల్ సిబాల్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఆధార్ కార్డు, ఓటరు కార్డులు పౌరసత్వానికి సమగ్ర గుర్తింపులు కావన్న ఈసీ నిర్ణయంతో ఏకీభవిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రక్రియలో మరికొన్ని ఇతర పత్రాలు అవసరమని స్పష్టం చేసింది. కాగా, ఓటర్ల జాబితా రూపకల్పనలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరపు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ చెప్పారు. ఇలాంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని, ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు.

ఆ ఇద్దరినీ తీసుకొచ్చిన యోగేంద్ర..!

మరో పిటిషనర్ యోగేంద్ర యాదవ్ స్వయంగా వాదనలు వినిపించారు. ఎస్ఐఆర్‌లో చనిపోయినట్లుగా ప్రకటించిన ఇద్దరిని సుప్రీంకోర్టుకు తీసుకొచ్చారు. ఈసీ తరపు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ స్పందిస్తూ.. దీన్ని ఓ డ్రామాగా అభివర్ణించారు. ఈ అంశంపై స్పందించిన జస్టిస్ బాగ్చి.. "ఇది అనుకోకుండా జరిగిన పొరపాటు అయ్యి ఉంటుంది. దీన్ని సరిచేయవచ్చు. కానీ, మీరు లేవనెత్తిన అంశాలు బాగున్నాయి" అని యాదవ్‌ను ప్రశంసించారు. కాగా, ఓటర్ల జాబితా సవరణలో ఒక్క వ్యక్తిని కూడా చేర్చలేదని, ఇలాంటి ప్రక్రియ (ఎస్ఐఆర్) దేశ చరిత్రలోనే తొలిసారి అని యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. అలాగే 65 లక్షల పేర్లను తొలగించారని, ఈ సంఖ్య కోటి కూడా దాటొచ్చని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి వాదనలు బుధవారం కొనసాగుతాయని ప్రకటించింది.

లోకం తీరు

తెలుగు వర్సిటీలో ఇంద్రజాలం కోర్సులకు నేరుగా ప్రవేశాలు



భారత్‌తో యుద్ధం జరిగితే.. ముఖేశ్ అంబానీ రిఫైనరీపై దాడి

» పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ హెచ్చరికలు

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 12: పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తన అమెరికా పర్యటన సందర్భంగా భారత్‌పై ఎడాపెడా నోరుపారేసుకుంటున్నారు. మొన్నటికి మొన్న అణుబాంబు వేస్తామని, తమ ఉనికికి ప్రమాదం ఏర్పడితే.. తాము మునగడమే కాకుండా.. సగం ప్రపంచాన్ని వెంట తీసుకెళ్తామని ఆయన హెచ్చరించిన విషయం తెలిసిందే..! అమెరికాలోని టంపా, ఫ్లోరిడాల్లో జరిగిన కార్యక్రమాల్లో మునీర్ ఈ వ్యాఖ్యలు చేయగా.. అదే సందర్భంలో ముఖేశ్ అంబానీకి చెందిన జామ్‌నగర్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగారు. భారత్‌తో యుద్ధం జరిగితే.. జామ్‌నగర్ రిఫైనరీపై దాడి చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ముఖేశ్ అంబానీ ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మునీర్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. అణు బ్లాక్‌మెయిల్‌కు భారత్ ఎన్నటికీ లొంగదని, జాతీయ భద్రత కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేసింది. కాగా.. మునీర్ వ్యాఖ్యల తర్వాత.. సింధు సహా.. ఆరు నదులపై పాకిస్థాన్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో మరో యుద్ధం జరిగితే.. పాకిస్థాన్ ఆరు నదుల(సింధు, జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్)ను తిరిగి తీసుకుంటుందని హెచ్చరించారు.

నీళ్లివ్వాలంటూ విజ్ఞప్తులు

ఓ వైపు ఆసిమ్ మునీర్, బిలావల్ భుట్టో భారత్‌పై బెదిరింపు ధోరణిని ప్రదర్శిస్తుంటే.. ఆ దేశ విదేశాంగ శాఖ మాత్రం నీళ్ల కోసం భారత్‌కు విజ్ఞప్తులు చేస్తోంది. సింధు జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించాలని.. చీనాబ్, జీలం, సింధు నదుల జలాల విషయంలో ఆర్బిట్రేషన్ తీర్పును అనుసరించి, నీళ్లివ్వాలని కోరింది. అయితే.. ఈ తీర్పును భారత్ ఎప్పటినుంచో తిరస్కరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే..!

రోడ్లపై తాగుడుకు చెక్..!

షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మద్యపానానికి చెక్ పెట్టే చర్యలు ప్రారంభించింది. మద్యం షాపుల్లో పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతిస్తూ ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. పర్మిట్ రూమ్ అంటే మద్యం షాపు పక్కనే మందు తాగేందుకు అవకాశం కల్పిస్తూ ఒక గది ఏర్పాటు చేస్తారు. అయితే బార్ తరహాలో కుర్చీలు, బల్లలు అందులో ఉండవు. గతేడాది అక్టోబరులో ప్రైవేటు మద్యం షాపుల పాలసీ అమల్లోకి వచ్చినప్పుడు పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వలేదు. దీంతో బహిరంగ మద్యపానం పెరిగింది. రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం అలవాటుగా మారింది. గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు బహిరంగ మద్యపానంపై 2,77,549 కేసులు నమోదయ్యాయి. ఇది తాగేవారితో పాటు సామాన్య ప్రజలకూ ఇబ్బందిగా మారింది. దీంతో ఈ అంశంపై పునఃసమీక్షించిన క్యాబినెట్ సబ్ కమిటీ పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతిచ్చింది. తాజా ఉత్తర్వుల ప్రకారం రెండు విభాగాల్లో పర్మిట్ రూమ్‌లకు లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. రూ.55లక్షల వరకు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (వార్షిక లైసెన్స్ ఫీజు) ఉన్న షాపులు రూ.5లక్షలు, రూ.65 లక్షల నుంచి రూ.85లక్షల వరకు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఉన్న షాపులు రూ.7.5 లక్షలు పర్మిట్ రూమ్‌కు విడిగా లైసెన్స్ ఫీజు చెల్లించాలి. ఇందుకోసం లైసెన్సీలు ఎక్సైజ్ శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. వెయ్యి చదరపు అడుగులు దాటకుండా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకోవచ్చు. అందులో కిచెన్ ఉండకూడదు. కానీ.. సిద్ధంగా ఉంచిన స్నాక్స్ అమ్మవచ్చు. పర్మిట్ రూమ్‌లలో తాగేవారికి విడిగా మద్యం సర్వ్ చేయకూడదు. సీసాలు కొనుక్కుని వచ్చి మాత్రమే అక్కడ తాగాలి. మద్యం షాపుల పనివేళల్లో మాత్రమే పర్మిట్ రూమ్‌లు తెరిచి ఉంచాలి.

ప్రాచీన యుగంలోకి వెళ్లినట్టుంది!

వీధికుక్కలపై సుప్రీంకోర్టు ఆదేశాలను ఉటంకిస్తూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు

» అంత క్రూరత్వం పనికిరాదు: ప్రియాంక

» కనికరం లేదా: సినీ నటుల ముక్తకంఠం

» ఆదేశాలు సవరించండి: సీజేఐకి లేఖలు



న్యూఢిల్లీ, ఆగస్టు 12: ఢిల్లీలోని వీధి కుక్కలను శాశ్వతంగా వేరే ప్రాంతానికి తరలించాలని, వాటికి ప్రత్యేక ఆవాసాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. "సుప్రీంకోర్టు ఆదేశాలు.. సైన్సు, మానవత్వం లేని కొన్ని దశాబ్దాల కిందటి ప్రాచీన యుగంలోకి వెళ్లినట్టున్నాయి. మన దయ, కరుణలను దూరం చేస్తున్నట్టున్నాయి." అని వ్యాఖ్యానించారు. కుక్కలకు టీకాలు వేయడం, స్థానికంగానే ఆవాసాలను ఏర్పాటు చేయడంవంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఇదే విషయంపై ఎంపీ ప్రియాంక గాంధీ స్పందిస్తూ.. కుక్కలు ఎంతో అందమైనవని, వాటి పట్ల క్రూరత్వం ప్రదర్శించాల్సిన అవసరం లేదని, వాటిని నిర్మూలించడం అంటే మూగజీవుల పట్ల భయంకరమైన క్రూరత్వాన్ని ప్రదర్శించడమేనని తెలిపారు. పట్టణాల్లో జంతువుల పట్ల ఇప్పటికే అమానుషంగా ప్రవరిస్తున్నారని, వాటిపట్ల మానవత్వం ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మరణ శాసనం: బాలీవుడ్

సుప్రీంకోర్టు ఆదేశాలపై బాలీవుడ్ నటులు తీవ్రంగా స్పందించారు. స్వేచ్ఛలేదని వ్యాఖ్యానించారు. జాన్వీకపూర్, వరుణ ధవన్‌లు స్పందిస్తూ.. 'కనికరం చూపించలేమా?' అని వ్యాఖ్యానించారు. అలాగే సింగర్ చిన్మయి శ్రీపాద, నిర్మాత సిద్ధార్థ్ ఆనంద్‌లు స్పందిస్తూ.. 'కుక్కలకు ఇది మరణ శాసనం." అని అన్నారు. మరోనటుడు అడవి శేష్ స్పందిస్తూ.. 'భారత మానవీయ, కరుణా సూత్రాలకు ఈ ఆదేశాలు విరుద్ధం.' అని పేర్కొన్నారు. అదేవిధంగా వరుణ్ గ్రోవర్, వీర్‌దాస్ తదితరులు కూడా సుప్రీం ఆదేశాలను తప్పుబట్టారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆదేశాలను పునఃసమీక్షించాలని కోరుతూ.. నటులు అడివి శేష్, జాన్ అబ్రహం సుప్రీకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, ఢిల్లీ సీఎం రేఖాగుప్తాలకు లేఖలు రాశారు. ఢిల్లీ నుంచి వీధికుక్కలను శాశ్వతంగా తరలించాలన్న ఆదేశాల్లో మార్పులు చేయాలని ఆయన కోరారు.

కుక్కలు పోతే కోతులొస్తాయ్: మేనకాగాంధీ

కుక్కలను సామూహికంగా తరలించడాన్ని కేంద్ర మాజీ మంత్రి, జంతు హక్కుల ఉద్యమకారిణి మేనకా గాంధీ తప్పుబట్టారు. 'ఇది అసాధ్యం. రూ.వేల కోట్ల ఖర్చు. పర్యావరణానికి కూడా ముప్పు." అని అన్నారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో 1880లో జరిగిన ఘటనను ఆమె వివరించారు. "ప్యారిస్‌లో కుక్కలు పెరిగిపోయాయని సామూహికంగా చంపేశారు. దీంతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింది. ఎలుకలు పెరిగిపోయాయి. దీనివల్ల ఊహించని పరిణామాలు ఎదురయ్యాయి. ఇప్పుడు ఢిల్లీలో కుక్కలను లేకుండా చేస్తే కోతులు మూగుతాయి. ఇది నా అనుభవం. అప్పుడు ఏం చేస్తారు?." అని ప్రశ్నించారు.

సుప్రీం ఆవరణలో కుక్కలు కనిపించొద్దు

వీధి కుక్కల వ్యవహారంపై సుప్రీంకోర్టు మంగళవారం మరోసారి స్పందించింది. కోర్టు ఆవరణ సహా లిఫ్టుల్లోనూ కుక్కలు కనిపిస్తున్నాయని, ఇక నుంచి అవి ఆవరణలో కనిపించడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. కోర్టుకు వచ్చేవారు తినగా మిగిలిపోయిన పదార్థాలను కుక్కలకు అసలు పెట్టడానికి వీల్లేదని పేర్కొంది. మిగిలిపోయిన పదార్థాలను ధ్వంసం చేయాలని, లేదా ప్యాక్ చేసి గట్టి మూతలు ఉన్న డస్ట్‌బిన్లలో వేయాలని సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

భారత్‌పై సుంకాలు.. రష్యాకు పెద్ద దెబ్బ

» రష్యా ఆర్థిక వ్యవస్థ క్షీణ దశలో ఉంది

» అమెరికా సుంకాలే కారణం: ట్రంప్

» శుక్రవారం పుతిన్‌తో భేటీ



వాషింగ్టన్, ఆగస్టు 12: రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై విధించిన టారిఫ్‌లతో రష్యాకు పెద్ద దెబ్బ తగిలిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం రష్యా ఆర్థిక వ్యవస్థ క్షీణదశలో ఉందని వ్యాఖ్యానించారు. సోమవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆయన వైట్‌హౌజ్‌లో మీడియాతో మాట్లాడారు. "రష్యా ఒక పెద్ద దేశం. ఎంతో పురోగమించే సామర్థ్యం దానికి ఉంది. ఆ దేశం పునర్నిర్మాణంపై దృష్టిసారించుకోవాల్సి ఉంది. ఇప్పుడైతే రష్యా పరిస్థితి ఏమీ బాగోలేదు. అమెరికా ఆంక్షలే దానికి కారణం. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై 50శాతం సుంకాలు విధించాం. అది రష్యాకు పెద్ద దెబ్బ." అని ట్రంప్ పేర్కొన్నారు. శుక్రవారం అలాస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశం కానున్నట్టు తెలిపారు. రష్యాలోనో, మరో దేశంలోనో కలవకుండా.. అమెరికాలో తమ భేటీ జరగనుండటం గౌరవనీయమని పేర్కొన్నారు. తమ భేటీ తర్వాత యూరోపియన్ దేశాల నేతలతో మాట్లాడుతానని.. పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మధ్య చర్చలు జరిగేలా చూస్తానని తెలిపారు.

చైనాపై టారిఫ్‌లు 3 నెలలు వాయిదా

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించి, అందులో 25శాతాన్ని అమల్లోకి తెచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌కన్నా ఎక్కువగా రష్యా చమురు కొంటున్న చైనా విషయంలో మాత్రం మినహాయింపులు పెంచుకుంటూ వెళుతున్నారు. చైనాపై సుంకాలకు ఇచ్చిన మినహాయింపు గడువును మరో మూడు నెలలు అంటే నవంబర్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వాషింగ్టన్‌లో 'నేర అత్యయిక స్థితి'

వాషింగ్టన్, ఆగస్టు 12: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో నేరాలు పెరిగిపోతున్నాయంటూ.. 'నేర అత్యయిక స్థితి'ని ప్రకటిస్తూ ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో వాషింగ్టన్ డీసీలోని ఫెడరల్ భవనాలు, ఆస్తులు, జాతీయ స్మారకాల భద్రత కేంద్రం పరిధిలోకి వస్తుంది. నగర మేయర్, మెట్రోపాలిటన్ పోలీసులను ట్రంప్ తన అదుపాజ్ఞల్లో ఉంచుకునే వెసులుబాటు కలుగుతుంది. అయితే.. ట్రంప్ తన అధికారాలను అటార్నీ జనరల్‌కు దఖలుపరిచారు. అటార్నీ జనరల్ పరిస్థితులను పర్యవేక్షించి, పరిస్థితులపై నివేదికలను అధ్యక్షుడికి అందజేస్తారు.

అలాస్కా... రష్యాలో.. నోరుజారిన ట్రంప్!

అమెరికాలో వాయవ్య ప్రాంతంలో ఉన్న కీలక ప్రాంతం అలాస్కా. శుక్రవారం అక్కడే ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ జరగనుంది. ట్రంప్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. 'పుతిన్‌తో చర్చల కోసం రష్యా వెళుతున్నా..' అంటూ నోరుజారారు. దీనితో అమెరికాలో భాగమైన అలాస్కాను రష్యాగా పేర్కొనడం ఏమిటంటూ ట్రోలింగ్ జరుగుతోంది.

జస్టిస్ వర్మపై అభిశంసన ప్రక్రియ మొదలు

న్యూఢిల్లీ, ఆగస్టు 12 : నివాసంలో భారీగా నగదు బయటపడిన వ్యవహారంలో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు సంబంధించిన ప్రక్రియను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రారంభించారు. ఆయనపై వచ్చిన అభియోగాలపై విచారణ జరపడానికి ముగ్గురు సభ్యులతో ఆయన ఒక కమిటీని నియమించారు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం- 1968లోని సెక్షన్ 3(2) కింద ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మణీంద్రమోహన్ శ్రీవాస్తవ, కర్ణాటక హైకోర్టు న్యాయవాది బీవీ ఆచార్య సభ్యులుగా ఉన్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మను బాధ్యతల నుంచి తప్పించాలంటూ లోక్‌సభ, రాజ్యసభకు చెందిన 146 మంది ఎంపీల నుంచి గత నెల 21వ తేదీన నోటీసులను స్పీకర్ స్వీకరించారు. మంగళవారం దీనిపై కమిటీ ఏర్పాటుకు ఆయన నిర్ణయం తీసుకున్నారు. "కమిటీ వీలైనంత త్వరగా తన నివేదిక ఇస్తుంది. విచారణ కమిటీ రిపోర్టు చేతికి వచ్చేవరకు జస్టిస్ వర్మ తొలగింపునకు సంబంధించిన ప్రతిపాదన పెండింగ్‌లో ఉంటుంది." అని ఓంబిర్లా తెలిపారు.

భద్రాద్రి జిల్లా నాచారంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

» ఎన్టీఆర్ బాటలోనే చంద్రబాబు: నందమూరి రామకృష్ణ



నాచారంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నందమూరి రామకృష్ణ

అశ్వారావుపేట/దమ్మపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం నలుమూలలా తెలుగుజాతి ఖ్యాతి చాటిచెప్పిన ఎన్టీఆర్ కడుపున పుట్టడం తన అదృష్టమని, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎన్నో జన్మల పుణ్యమని ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాచారం గ్రామంలో టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సీఎం నందమూరి తారకరామారావు విగ్రహాన్ని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొన్నారు. ఎన్టీఆర్ యుగ పురుషుడని, ఆయన బాటలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగువారి ఆత్మాభిమానం కోసం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని రామకృష్ణ కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కొనసాగిస్తున్నారన్నారు.

టీటీడీకి రూ.1.10 కోట్ల విరాళం



అదనపు ఈవోకు విరాళం చెక్కులను అందజేస్తున్న దాత

తిరుమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ట్రస్టులకు మంగళవారం రూ.1.10 కోట్లు విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన కాప్షన్ సర్వీసెస్ సంస్థ అధినేత కొడాలి శ్రీకాంత్ విరాళం చెక్కులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఇందులో రూ.కోటి ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు, రూ.10 లక్షలు ఎస్వీ గోసంరక్షణకు వినియోగించాలని దాత కోరారు.

చకచకా 'వాల్' నిర్మాణం

ఇప్పటికి 500 మీటర్లు పూర్తి

- 3 ట్రెంచ్ కట్టర్లు.. గ్రాబర్లతో వేగంగా పనులు
- డిసెంబరుకల్లా డయాఫ్రం వాల్ సిద్ధం
- పోలవరం ఇంజనీరింగ్ అధికారుల విశ్వాసం
- ప్రాజెక్టు పురోగతిపై మంత్రి నిమ్మల టెలికాన్ఫరెన్స్
- నెలాఖరులో పోలవరానికి విదేశీ నిపుణులు
- రిజర్వాయర్లలో నీటి నిల్వలపై రేపు సీఎం సమీక్ష



పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణ పనుల దృశ్యం

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పోలవరం ప్రాజెక్టు ప్రధాన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధానంగా డయాఫ్రం వాల్ నిర్మాణం 500 మీటర్లు పూర్తయిందని జల వనరులమంత్రి నిమ్మల రామానాయుడికి ఈఎన్‌సీ నరసింహమూర్తి తెలియజేశారు. 3 ట్రెంచ్ కట్టర్లు.. గ్రాబర్లతో వేగవంతంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. డిసెంబరు నాటికి వాల్ పనులు పూర్తిచేస్తామన్న ధీమా వ్యక్తం చేశారు. మంత్రి నిమ్మల మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి ఈ సందర్భంగా పోలవరం ఇంజనీరింగ్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తిచేయాలని ముఖ్యమంత్రి లక్ష్యం విధించారని, స్పష్టమైన షెడ్యూల్ విడుదల చేశారని మంత్రి గుర్తుచేశారు. దాని ప్రకారమే నిర్మాణ పనులు చురుగ్గా సాగుతుండడంపై హర్షం వ్యక్తం చేశారు. డయాఫ్రం వాల్ నిడివి 1,396 మీటర్లు కాగా.. ఇప్పటికి సంక్లిష్టమైన ప్రదేశంలో 500 మీటర్ల వరకు పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. వరదల సమయంలోనూ డీవాటరింగ్ చేస్తూ శరవేగంగా పనులు చేపడుతున్నామని అన్నారు. ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణ పనులూ వేగంగా సాగుతున్నాయని చెప్పారు. 2027 డిసెంబరునాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని ఈఎన్‌సీ తెలిపారు. ఈ చారిత్రక ఘట్టం కోసం అహర్నిశలూ శ్రమిద్దామని నిమ్మల అధికారులతో అన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాన్ని చక్కదిద్దామని చెప్పారు. ఇంకోవైపు.. అమెరికా, కెనడాలకు చెందిన నిపుణులు నెలాఖరులో పోలవరానికి రానున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి డయాఫ్రం వాల్, ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణ పనులను పరిశీలిస్తారు. ఆమోది ంచిన డిజైన్ల మేరకు సాగుతున్నాయా.. లేదా.. నాణ్యత ఎలా ఉందో సమీక్షిస్తారు.

4 శాఖల అధికారులతో సీఎం చర్చ

జల వనరుల శాఖతో లింకున్న పంచాయతీరాజ్, మునిసిపాలిటీ, గ్రామీణాభివృద్ధి శాఖలతో గురువారం సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో నీటి నిల్వలు.. రిజర్వాయర్లలో నీటిమట్టాలు తదితర అంశాలపై అధికారులతో చర్చిస్తారు.



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్లాస్టిక్ రహితంగా అమరావతి

» దేశానికే దిక్సూచిగా రాజధాని నగరం మారాలి

» 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం' కార్యక్రమంలో గవర్నర్ నజీర్

గుంటూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అమరావతిని ప్లాస్టిక్ రహిత రాజధాని నగరంగా మార్చడమే మన దీర్ఘకాలిక లక్ష్యం కావాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ తెలిపారు. గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం' అనే కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను అమరావతి ప్రతిబింబిస్తుందని తెలిపారు. పర్యావరణ అనుకూల అభివృద్ధిలో అమరావతి దేశానికే రోల్‌మోడల్ కావాలని ఆకాంక్షించారు. పరిశుభ్రమైన, స్థిరమైన, ప్లాస్టిక్ రహిత అమరావతి సాధించడమే కాదు.. అది మనందరికీ చాలా అవసరమన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని 'ఆంధ్రప్రదేశ్ వాతావరణ కార్యాచరణ, అమరావతి ప్లాస్టిక్ ఫ్రీ సిటీ ప్రచార కార్యక్రమం ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ ప్రచారం సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం కానుందని, ఈ ప్రచారం ప్రజల భాగస్వామ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. భవిష్యత్తు తరాల కోసం ప్రచారానికి యువత నాయకత్వం వహించాలని తాను కోరుకుంటున్నానని గవర్నర్ తెలిపారు.

వైభవం.. రాఘవేంద్రుడి రథోత్సవం



మంత్రాలయం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో ఐదో రోజు అత్యంత ప్రాముఖ్యమైన ఉత్తారాధనలో భాగంగా మంగళవారం మహా రథోత్సవం ఘనంగా సాగింది. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూల బృందావనానికి విశేష పూజలు చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. సర్వాభరణ అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు.

తాను మరణించి.. ముగ్గురిని బతికించాడు!

» అవయవాలను దానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులు



ముద్దన వెంకటరావు

నాగుపాలెం (పర్చూరు), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం విషాదం నింపినా.. చనిపోతూ మరో ముగ్గురికి ప్రాణదానం చేశాడో వ్యక్తి. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నాగులపాలేనికి చెందిన ముద్దన వెంకటరావు (62) ఈ నెల 9న చిలకలూరిపేట నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా తిమ్మరాజుపాలెం సమీపంలో గేదె అడ్డురావడంతో ప్రమాదానికి గురయ్యారు. గుంటూరులోని ఓ కార్పొరేట్ వైద్యశాలలో శస్త్రచికిత్స చేసినా సహకరించక బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్య నిపుణులు కుటుంబ సభ్యులకు తెలిపారు. రోడ్డు ప్రమాదం తమ కుటుంబంలో విషాదం నింపినా మృతుని ద్వారా మేలు చేకూరాలని వారు భావించారు. వెంకటరావు అవయవాలను దానం చేస్తామని వైద్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వైద్య బృందం బెంగళూరు నుంచి మంగళవారం గుంటూరు వైద్యశాలకు వచ్చి వెంకటరావు కళ్లు, కిడ్నీ, లివర్ సేకరించింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

'తిరుపతి' దాడి నిందితులపై కఠిన చర్యలు

» ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్



బాధితుడు పవన్‌కుమార్‌తో మాట్లాడుతున్న జవహర్

తిరుపతి (వైద్యం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో దళిత యువకుడు పవన్‌కుమార్‌పై 25 మందికిపైగా దాడికి పాల్పడ్డారు. ఇప్పటికే 16 మందిని గుర్తించి కేసులు నమోదు చేశారు. మిగిలిన వారినీ పట్టుకుంటారు. ఈ దాడికి పాల్పడిన, సహకరించిన, మద్దతుగా నిలిచిన అందరిపైనా అట్రాసిటీ చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి' అని ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కె.ఎస్.జవహర్ అన్నారు. తిరుపతిలో వైసీపీ నేతల దాడిలో గాయపడి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌కుమార్‌ను మంగళవారం ఆయన పరామర్శించారు. ప్రభుత్వం తరఫున అండగా నిలుస్తామని, అట్రాసిటీ చట్ట ప్రకారం రాయితీలను అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పవన్‌కుమార్‌కు అట్రాసిటీ చట్ట ప్రకారం త్వరితగతిన న్యాయం చేసేందుకు అవసరమైన ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు.

15 నుంచి ఫాస్టాగ్ ఉంటేనే తిరుమలకు

తిరుమల, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తిరుమలకు ప్రయాణించే వాహనాలకు ఇక నుంచి ఫాస్టాగ్ తప్పనిసరి. ఆగస్టు 15 వేకువ జాము 3 గంటల నుంచి దీనిని అమలు చేస్తారు. ఫాస్టాగ్ లేని వాహనాలను అలిపిరి టోల్‌గేట్‌లో ఆపేస్తారు. ఫాస్టాగ్ లేకుండా వచ్చిన వాహనదారులు ఇబ్బంది పడకుండా ఇక్కడి పొల్యూషన్ కౌంటర్ వద్ద ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో ఫాస్టాగ్ జారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

దొంగ ఓట్లు, దొంగ నోట్లతో మోదీ పాలన

» సీపీఐ రామకృష్ణ

అనంతపురం విద్య, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో దొంగ ఓట్లు, దొంగ నోట్ల ప్రభుత్వాన్ని మోదీ నడిపిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. అనంతపురంలో ఆ పార్టీ 25వ జిల్లా మహాసభలు మంగళవారం ప్రారంభం కాగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. మోదీ 11 ఏళ్ల పాలనలో పేద ప్రజలు ఎవరూ బాగుపడలేదని, పెట్టుబడిదారులు మాత్రమే మరింత అభివృద్ధి చెందుతున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌ను కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకుందని రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అభివృద్ధి ముసుగులో పెద్దఎత్తున అప్పులు చేస్తున్నారని అన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో మూడురోజులు పాటు ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామని రామకృష్ణ వెల్లడించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదివరకు బెనజీర్ భుట్టో ముద్దుల కొడుకు కూడా మనని యుద్ధం పేరిట బెదిరిస్తున్నాడు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసినందుకు పాకిస్థాన్ నుంచి రణనినాదాలు బాగానే వినిపిస్తున్నాయి. ఒప్పందాన్ని నిలిపివేసి 20కోట్లమంది పాకిస్తానీయులకు దక్కాల్సిన నీటిని అడ్డుకోవడం కనుక జరిగితే, భారత్‌ను యుద్ధంలో ఓడించి, ఆరునదులనూ స్వాధీనం చేసుకోవడం వినా తమకు మరోమార్గం లేదని బిలావల్ బెదిరిస్తున్నారు. యుద్ధం వస్తేగిస్తే పాక్ తలవంచదనీ, ప్రతీ పౌరుడూ పోరాడతాడని ఆయన దేశభక్తియుత వ్యాఖ్యలు చాలా చేసుకున్నాడు. సింధుజలాల గురించీ, యుద్ధం గురించీ సింధ్ ప్రావిన్సులో, ఏదో సభలో, ఏదో సందర్భంలో ఈ రాజకీయనాయకుడు ఏమి మాట్లాడినా, ఎంతకాలు దువ్వినా మనకు పోయేదేమీ లేదు. ఆ వ్యర్థప్రలాపనలకు అంత విలువేమీ ఉండదు. కానీ, దీనికి ముందురోజు, ఇంతకుమించిన ఉన్మాదంతో ఊగిపోతూ, ఏకంగా అణుయుద్ధం హెచ్చరికలే చేస్తూ భారత్‌ను పాక్ సైన్యాధ్యక్షుడు ఆసిమ్ మునీర్ బెదిరించడం తేలికగా తీసిపారేయగలిగేది కాదు. మునీర్ ఏం మాట్లాడారన్న కంటే, ఆయన ఎక్కడ నిలబడి ఆ మాటలన్నాడన్నది ముఖ్యం. ఒక కాలమిస్టు వ్యాఖ్యానించినట్టుగా ట్రంప్ కాంపౌండ్‌లో నుంచి ఆయన మొరిగాడు. యజమాని పక్కన ఉన్నప్పుడు పెంపుడుజీవులకు ఎక్కడ లేని ధైర్యమూ వస్తుంది. విశ్వాస ప్రదర్శన వీరంగాల స్థాయిలో సాగుతుంది.

అన్నం పెట్టినవాడు, ఎర్రతివాచీ పరిచి ఆతిథ్యమిచ్చినవాడు పక్కనే ఉన్నాడన్న ధైర్యం కాబోలు, మునీర్ ఏకంగా అణ్వాయుధ ప్రయోగం గురించి మాట్లాడాడు. ఆనకట్టలతో సింధుజలాలను అడ్డితే వాటిని పేల్చేస్తాం, కూల్చేస్తామన్న హెచ్చరికలతో ఆయన సరిపెట్టలేదు. తమ ఉనికికి ప్రమాదం వాటిల్లిన పక్షంలో కేవలం భారత్‌నే కాక, సగం ప్రపంచాన్ని తమతో తీసుకుపోతామని కూడా ఆయన బెదిరించాడు.


‘రణ’గొణ ధ్వనులు

ఫ్లోరిడాలో ఆయన చేసిన ప్రసంగం మొత్తం పాకిస్తానీ సైనికమీడియా విభాగం నుంచి వెలుగుచూడలేదు కానీ, ఆయన ఈ ప్రసంగంలో భారతదేశాన్ని ఆర్థికంగానూ, అణ్వాయుధాలతోనూ ధ్వంసం చేస్తామని గట్టిగానే బెదిరించాడు. భారతదేశం ఎదగకుండా పాకిస్థాన్ ఏమి చేయగలదో, ఎలా అడ్డుపడగలదో, గతంలో ఏం జరిగిందో కూడా ఆయన పరోక్షంగా చెప్పాడు.

ఆపరేషన్ సిందూర్ తరువాత ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి లభించిన ఆసిమ్‌మునీర్ తన వీరత్వాన్ని ప్రదర్శించడానికీ, ఆ ఉన్నత స్థానాన్ని పదిలపరుచుకోవడానికీ ఈ విధంగా మాట్లాడటం అవసరమని అనుకోవచ్చు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం బలహీనమైనది కావడం, తన దయాదాక్షిణ్యాలమీద ఆధారపడివుండటం కూడా మునీర్ అహంకారానికి కారణం. పాకిస్థాన్‌లో పౌరప్రభుత్వాల మీద సైన్యం పెత్తనం అనాదిగా ఉన్నదే కానీ, ప్రజామోదం విస్తృతంగా ఉన్న ఇమ్రాన్‌ఖాన్‌ను జైల్లోకి నెట్టి, ఆయన పదవిలోకి రాకుండా అడ్డుపడి, కాళ్ళబేరానికి వచ్చిన షరీఫ్ సోదరులను గద్దెనెక్కించిన సైన్యానికి ఈ మారు తిరుగేలేదు. కశ్మీర్‌ను పాక్ ప్రాణాన్ని నిలబెట్టే కంఠసిరగా అభివర్ణించిన వారంలోనే పహల్గాం దాడి జరిగింది. పాక్ సైన్యానికీ, ఉగ్రవాదులకు మధ్య ఉన్న అనుబంధం తెలిసిందే కనుక, ఆ సందేశంతోనే ఆదేశాలు వెళ్ళాయని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇప్పుడు ఫ్లోరిడా సభలో కూడా మునీర్ మళ్ళీ కశ్మీర్ ఊసును అదేరీతిలో ప్రస్తావించినందున విశ్లేషకులు దీనిని మరింత ప్రమాదకరమైన హెచ్చరికగా చూస్తున్నారు. పాక్ ఉడుత ఊపులకూ, అణు బెదిరింపులకూ భారతదేశం బెదరదని ఆపరేషన్ సిందూర్ స్పష్టంచేసింది. ఇప్పుడు కూడా మునీర్ అణు హెచ్చరికలకు జడిసేది లేదనీ, దేశభద్రతలో తగ్గేది లేదని చెబుతూనే, స్వయంగా పాక్ సైన్యాధ్యక్షుడు చేసిన ఈ వ్యాఖ్యలను బట్టి అత్యంత ప్రమాదకరమైన అణ్వస్త్రాలు ఒక ధూర్తరాజ్యం చేతిలో ఉన్న విషయాన్ని మిగతా ప్రపంచం ఇప్పటికైనా గుర్తించాలని కోరింది. రెండోసారి అమెరికాలో కాలూనగానే, భారతదేశాన్ని అణ్వాయుధాలతో నాశనం చేస్తానని పాక్ సైన్యాధ్యక్షుడు అక్కడ నిల్చొని మరీ బెదిరించగలిగాడు. మోదీ–ట్రంప్ మధ్య చెడిన స్నేహం, పాక్–అమెరికా మధ్య పెరిగిన సాన్నిహిత్యం, ట్రంప్ కుటుంబంతో వాణిజ్యం మునీర్‌కు శక్తినిచ్చాయి. ట్రంప్ ప్రేమలు ఎంతోకాలం కొనసాగవన్నది అటుంచితే, నోబెల్ శాంతికోసం అర్రులు చాస్తున్న ఆయన మునీర్‌కు ముకుతాడు వేస్తే బాగుంటుంది.

ఉచితంగా సర్వైకల్ కేన్సర్ టీకాలు వేయండి

సర్వైకల్ కేన్సర్ (గర్భాశయ ముఖద్వార కేన్సర్) అన్నది ఇప్పుడు దేశంలో ఆడవాళ్లకు ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా పరిణమించింది. ఈ కేన్సర్ సోకిన వాళ్లలో మరణాల సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ స్త్రీలు రోగం బాగా ముదిరిన తర్వాత మాత్రమే ఆసుపత్రులకు వెడుతున్నారు. ప్రతి లక్ష మంది మహిళల్లో 13 మందికి పైగా గర్భాశయ ముఖద్వార కేన్సర్‌కు గురవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో దాదాపు సగం మందికి పైగా మరణిస్తున్నారు. ఇది ఆందోళనకరమైన పరిస్థితే. మగవాళ్లకు కూడా ఇది సోకుతుంది కానీ అత్యధికంగా ఆడవాళ్లే దీనికి గురవుతారు. ఈ సర్వైకల్ కేన్సర్ నుంచి కాపాడే వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమ వైరస్) వ్యాక్సిన్‌ను తొమ్మిదేళ్ల బాలబాలికల నుంచి 45 ఏళ్ల స్త్రీల దాకా వేసుకోవచ్చు. కానీ మన దేశంలో ఈ వ్యాక్సిన్ ఉందనే విషయమే చాలా మంది స్త్రీలకు తెలియదు. దేశంలో 14 ఏళ్ల లోపు బాలలు 30 శాతం ఉన్నారు. వీరిని సర్వైకల్ కేన్సర్ బారిన పడకుండా కాపాడుకోవడం దేశ భవిష్యత్తుకు అవసరం. నగర, పట్టణ ప్రాంతాల్లోని చదువుకున్నవారు తప్ప హెచ్‌పీవీ



వ్యాక్సిన్‌ను వేసుకోవడం లేదు. ఇది ఆందోళన కలిగించే అంశం. రూ.14 వందలు ఖర్చుపెట్టి ఈ టీకాను పేద కుటుంబాలు వేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ప్రభుత్వమే ఈ బాధ్యత తీసుకోవడం మేలు. ప్రభుత్వం వ్యాక్సిన్ తయారీదారులతో ఒప్పందం చేసుకుంటే సగం ధరకన్నా తక్కువకే వ్యాక్సిన్ లభించే అవకాశం ఉంది. బాలలకు నిర్బంధంగా, ఉచితంగా ఈ వ్యాక్సిన్ వేసేలా ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రభుత్వానికి ఇది భారం అనుకుంటే, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో ఈ పనిని చేపట్టవచ్చు. తమిళనాడు ప్రభుత్వంతోనూ, కేన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ శాంతగారితోనూ కలిసి తను కొన్ని ప్రాంతాల్లో బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించానని సామాజిక సేవకురాలు, ఎంపీ సుధామూర్తి పార్లమెంటులోనే తెలిపారు. వీరిని మార్గదర్శకులుగా తీసుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలూ ఒక బృహత్ కార్యక్రమంలా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను చేపట్టాలని తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

– డాక్టర్ వసుంధర చీపురుపల్లి
ఎండీ గైనిక్, లాపరో అండ్ రొబోటిక్ సర్జన్
డాక్టర్ కేజే రావు, సామాజిక కార్యకర్త

నైతిక రాజకీయాలు ఎండమావులేనా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

‘ప్రతిపక్షాలకు ప్రజాస్వామిక సంస్థలంటే విశ్వాసం లేదు. పార్లమెంటు సమావేశాలు కొనసాగించడం వారికి ఇష్టం లేదు. పార్లమెంటు ముఖ్యమైన సమయాన్ని ప్రతి రోజూ వృథా చేయడాన్ని మేము ఇక అనుమతించబోం.. ముఖ్యమైన బిల్లులను ఆమోదించి తీరుతాం..’ అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. సోమ, మంగళవారాల్లో పార్లమెంటు పెద్దగా చర్చ లేకుండా దాదాపు పది బిల్లులను ఆమోదించింది. జూలై 21న ప్రారంభమైన పార్లమెంటు సమావేశాలు ప్రతిపక్షాల నిరసన ధ్వనుల మధ్య ఒకటి రెండు రోజులు తప్ప పెద్దగా సాగలేదు.

ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చ జరిపించడం ఏ ప్రభుత్వానికీ ఇష్టం ఉండదు. గతంలో కూడా బోఫోర్స్ నుంచి 2జీ వరకు అనేక కుంభకోణాలపై ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించాయి. రోజుల తరబడి పార్లమెంటు సమావేశాలకు అంతరాయం కలిగించాయి. ‘ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించనప్పుడు పార్లమెంటుకు అంతరాయం కలిగించడం ప్రతిపక్షాల చట్టబద్ధమైన హక్కు’ అని యూపీఏ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్న అరుణ్ జైట్లీ అన్నారు. ‘పార్లమెంటును సాగనివ్వకపోవడం కూడా ప్రజాస్వామ్యంలో భాగమే’ అని లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సుష్మా స్వరాజ్ కూడా చెప్పారు.

పార్లమెంటు సమావేశాలు ఒకప్పుడు ఎంతో ఆసక్తి కలిగించేవి. అటల్ బిహారీ వాజపేయి, ఇంద్రజిత్ గుప్తా, చంద్రశేఖర్, సోమనాథ్ ఛటర్జీ లాంటి వారు మాట్లాడుతుంటే మీడియా గ్యాలరీలతో పాటు అతిథుల గ్యాలరీలు కూడా కిక్కిరిసిపోయేవి. కానీ ఇప్పుడు గ్యాలరీలేకాదు సభలు కూడా వెలవెలబోతున్నాయి. ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై తప్ప ఏ అంశంపైనా చర్చ జరగలేదు. ఈ చర్చలో కూడా ప్రతిపక్ష నేతలు ఆవేశంతో ప్రశ్నలు వేసినప్పటికీ అన్నీ ఒకే మాదిరిగా ఉన్నాయి. ఆ ప్రశ్నలకు కూడా సరైన సమాధానాలు రాలేదు. భారత సైనిక దళాలు వీరోచితంగా నిర్వహించిన ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత పార్లమెంటులో ప్రభుత్వం ఏ జవాబు చెబుతుందా అని ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా ఎదురు చూశారు. కానీ రెండు రోజుల సుదీర్ఘ చర్చ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘ ప్రసంగం తర్వాత కూడా అనేక ప్రశ్నలకు జవాబులు లభించకుండా మిగిలిపోయాయి. ముఖ్యంగా పహల్గామ్ సంఘటనకు దారి తీసిన భద్రతా వైఫల్యం నుంచి ఆపరేషన్ ఉన్నట్లుండి 88 గంటల్లో ముగిసిన తీరు, భారత్ పాక్‌కు బుద్ధి చెప్పే పరిస్థితుల్లో ఉన్నప్పటికీ కాల్పుల విరమణకు అంగీకరించడం, పాక్ పట్ల అమెరికా స్నేహంగా వ్యవహరించడం, సంఘటనకు కారకులైన ఉగ్రవాదుల ఆచూకీ, విదేశాంగ విధానం గురించి ప్రజల్లోను, ప్రతిపక్షాల్లోనూ ఉన్న ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు రాలేదు. అధికార పార్టీ నేతలు ఇచ్చిన ప్రసంగాల్లో పహల్గామ్ కంటే నెహ్రూ, ఇందిరాగాంధీ పేర్లే అనేకసార్లు దొర్లాయి. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో చాలా పొరపాట్లు జరిగి ఉండవచ్చు కానీ వాటినే చర్విత చర్వణం చేయడం వల్ల సాధించేదేముంటుంది?

పహల్గామ్ సంఘటన సరే, బిహార్‌లో ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ గురించి ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నప్పటికీ దానిపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఎస్ఐఆర్‌పై గందరగోళం జరుగుతున్న సమయంలోనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటకలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా బోగస్ ఓట్ల పోలింగ్ జరిగిందని ఆయన సాక్ష్యాధారాలతో బయటపెట్టారు. దేశంలో ఎన్నికల కమిషన్ బీజేపీని గెలిపించేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఓట్ల చోరీ జరుగుతోందనే అభిప్రాయాన్ని ఆయన ప్రజల్లో బలంగా ఏర్పరిచేందుకు ప్రయత్నించారు. ఎస్ఐఆర్ పైనే కాదు, ఓట్ల చోరీపై కూడా ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చను డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలను తిప్పిగొట్టగలమన్న విశ్వాసం ఉంటే ఏ ఒక్క అంశంపైనైనా చర్చకు అంగీకరించి ప్రభుత్వం వారి ఆరోపణలు తప్పని చెప్పేందుకు ఆస్కారం ఉన్నది.

నిజానికి ఓట్లను తొలగించడం, బోగస్ ఓటర్లను చేర్చడం అనేది ఎన్నికల వ్యవస్థకు చెదలు పట్టేలా చేస్తోంది. ‘నా నియోజకవర్గంలో కూడా 3.5 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మా బంధువుల ఓట్లు కూడా లేకుండా పోయాయి’ అని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి సైతం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా తన కొడంగల్ నియోజకవర్గంలో 15వేల ఓట్లు గల్లంతైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. వీటిపై ప్రభుత్వం పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తే కాదనేవారెవరు ఉన్నారు? అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలో కూడా కెన్యా, మొజాంబిక్ లాంటి దేశాల్లో లాగా అక్రమాలు చేసి ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారనే అభిప్రాయం ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడడం మంచిదా?

పార్లమెంటును సాగనివ్వకపోవడం వల్ల ప్రతిపక్షాలకు ప్రయోజనం లభిస్తుందా? చాలాసార్లు లభించకపోవచ్చు. కానీ ప్రభుత్వం కీలకమైన ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు నిరాకరిస్తున్నదని ప్రజలు భావిస్తే ప్రతిపక్షాల ప్రశ్నలకు కూడా ఆమోదయోగ్యత లభిస్తుంది. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలు ప్రజల్లో కూడా కలిగితే పార్లమెంటును వాయిదా వేసినా ప్రభుత్వం ప్రజా కోర్టులో జవాబుచెప్పలేని పరిస్థితిలో పడుతుంది. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినప్పుడు పార్లమెంటులో ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలను జైలులో నిర్బంధించారు. కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. గతంలో బోఫోర్స్ విషయంలోను, 2జీ కుంభకోణం విషయంలోనూ పార్లమెంటులో ప్రభుత్వం జవాబులు చెప్పకుండా తప్పించుకుని ఉండవచ్చు. కానీ ప్రజలు జవాబుదారీ ప్రభుత్వాన్ని ఆశించినందువల్ల నరేంద్రమోదీ ప్రభుత్వానికి పట్టం కట్టారు.

ప్రస్తుతం దేశంలో ఆ పరిస్థితి ఏర్పడుతోందా? అని చెప్పడం కష్టం. ప్రభుత్వం కానీ వ్యవస్థలు కానీ జవాబులు చెప్పలేని పరిస్థితిలో పడుతోందని మాత్రం అనిపిస్తోంది.



> నిజానికి ఓట్లను తొలగించడం, బోగస్ ఓటర్లను చేర్చడం అనేది ఎన్నికల వ్యవస్థకు చెదలు పట్టేలా చేస్తోంది. తమ నియోజకవర్గాలలోను ఓట్లు గల్లంతయ్యాయని కేంద్రమంత్రి నితిన్ గడ్కరి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం అన్నారు. ఈ అవకతవకలపై పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణల విషయమై విపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే ఎవరు కాదంటారు? అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలోనూ కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో లాగా అక్రమాలు చేసి ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారనే అభిప్రాయం ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడడం మంచిదా?

నిజానికి పార్లమెంటు కంటే బయట జరుగుతున్న పరిణామాలు చాలా ఆసక్తి కలిగిస్తాయి. ప్రతిరోజూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలు, ఎన్నికల కమిషన్‌కు ఊరేగింపుగా వెళ్ళి అనేకమంది అరెస్టు కావడం వంటి సంఘటనలు ఒక ఎత్తు అయితే రాహుల్ నివాసంలో జరిగిన విందుకు మొత్తం ప్రతిపక్ష పార్టీల అగ్రనేతలు అందరూ హాజరు కావడం మరొక ఎత్తు. దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ సంఘటితం కావడమే కాదు, రాహుల్ వారి నేతగా ఆవిర్భవించడం భారత రాజకీయాల్లో జరిగిన కీలక పరిణామం. ఇటీవలి కాలం వరకూ రాహుల్ నాయకత్వంపై అనేక ప్రశ్నలు తలెత్తాయి. ఇప్పుడు ఆ ప్రశ్నలు చెరిగిపోతున్నాయి. అయితే అంత మాత్రాన రాహుల్ మోదీకి ప్రత్యామ్నాయ నేతగా మారారా అన్నది ఇప్పుడే చెప్పడం కష్టం. సార్వత్రిక ఎన్నికలు ఇప్పట్లో లేవు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే బిహార్ ఎన్నికల్లో సంఘటితంగా పోరాడినప్పటికీ అధికారంలోకి రాగలరా అన్న విషయం కూడా ఇప్పుడే చెప్పలేం. అక్కడ ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ, చిరాగ్ పాశ్వాన్ లోక్‌జనశక్తికి వస్తున్న ప్రతిస్పందన ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు లేకపోలేదు. బిహార్ మాత్రమే కాదు వచ్చే ఏడాది జరిగే తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమబెంగాల్ ఎన్నికలు ప్రతిపక్షాల సత్తాకు ఒక అగ్నిపరీక్ష. రాహుల్, ఆయన మిత్రపక్షాలు సంఘటితంగా సార్వత్రిక ఎన్నికల వరకూ నిలదొక్కుకునేందుకు ఎంతో పోరాడాల్సిన అవసరం ఉన్నది. ఈ లోపు ఆయన లేవనెత్తుతున్న ఎన్నికల అక్రమాలపై ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా తన వైపునకు తిప్పుకోగలరా అన్నది వేచి చూడాలి.

రాహుల్, ఆయన మిత్రపక్షాలు చేయాల్సింది దీర్ఘకాలిక పోరాటమైనా అది నరేంద్రమోదీ పైనే. అయితే నరేంద్రమోదీ కేవలం రాహుల్ సేనను మాత్రమే కాదు. ఇంటా, బయటా, ఇతరత్రా కూడా ఎన్నో రకాలుగా పోరాడాల్సి ఉన్నది. పార్లమెంటులో ప్రశ్నల్ని తప్పించుకున్నప్పటికీ ఆయన పార్లమెంటు బయట కూడా అనేక శక్తుల్ని ఎదుర్కోవాల్సి ఉన్నది. ఇప్పటి వరకూ ఆయన ‘వన్ మాన్ ఆర్మీ’ లాగా పోరాడారు. ఏ ఎన్నికైనా మోదీ పేరుతోనే గెలువగలమనే ధైర్యాన్ని పార్టీ నేతలకు ఇచ్చారు. కానీ గత లోక్‌సభ ఎన్నికల తర్వాత ఆ అభిప్రాయం క్రమంగా సడలిపోతోంది. ఈ ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామన్న వ్యక్తి 240 సీట్లకు పరిమితమయ్యారు. మిత్రపక్షాలపై ఆధారపడి ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో గెలిచినప్పటికీ ఆ విజయాలకు పూర్తి ఘనత తనదేనన్న నమ్మకం ఆయన కలిగించలేకపోయారు. రాష్ట్రీయ స్వయం సేవక్ బీజేపీ గెలిచేందుకు గట్టి ప్రయత్నాలు చేయడం ఒక ఎత్తు అయితే ఈ గెలుపుపై అనుమానాలు రేకెత్తించడంలో ప్రతిపక్షాలు సఫలీకృతం కావడం మరొక ఎత్తు. పహల్గామ్ సంఘటన, ఆ తదనంతర పరిణామాలు, విదేశాంగ విధానంపై జరుగుతున్న చర్చలు, ట్రంప్ స్థిమితం లేనట్లుగా పాల్పడుతున్న చర్యలు ఎందుకో జాతీయ స్థాయిలో పరిస్థితి అంత సవ్యంగా లేనట్లు అభిప్రాయం కలిగిస్తోంది. 2014లో అఖండమైన విజయం సాధించి వారణాసిలో గంగాహారతిలో పాల్గొన్న మోదీకి ఇప్పటి మోదీకి మధ్య ఏదో తేడా కనిపిస్తోంది.

భారత రాజకీయాల్లో నైతికత అనేది ప్రధానం. భారతీయ ధర్మాన్ని, సంస్కృతిని పాటించేవారు ఈ నైతికతకు, సత్యశీలతకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. రాజకీయాల్లో గమ్యం మాత్రమే కాదు దారి కూడా సవ్యంగా ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

బోధనకు ప్రాధాన్యమిచ్చే విధానాలపై దృష్టి పెట్టాలి

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థ నిరంతరం మార్పులకు లోనవుతున్నది. గడచిన కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టింది. అయితే, వీటి అమలులో విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకోకుండా తీసుకునే కొన్ని నిర్ణయాలు, ముఖ్యంగా బోధనేతర కార్యక్రమాలు విద్యార్థులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పాఠ్య బోధన కంటే జాతీయ పఠనోద్యమం, మన బడి, నాడు–నేడు, జాతీయ పథకాల అమలు, ఒకేషనల్ శిక్షణలు, అభ్యాస పరీక్షలు, పరిశీలనా పత్రాలు, ఎంపికల పరీక్షల నిర్వహణ, సర్వేలు, పర్యవేక్షణ మాడ్యూళ్లు, ప్రగతి నివేదికలు, పబ్లిక్ రివ్యూ మీటింగ్‌లు వంటి కార్యక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఉపాధ్యాయులు తరగతులు చెప్పడానికి బదులుగా ఈ కార్యక్రమాల నిర్వహణకే సమయం కేటాయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థుల పాఠ్యబోధన తీవ్రంగా దెబ్బతింటోంది. పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలంటే గణనీయంగా సమయం అవసరం. కానీ



తరచూ జరిగే బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది.

ఇక ప్రైవేటు పాఠశాలల విషయానికొస్తే, అక్కడ బోధనే ప్రధాన లక్ష్యంగా శిక్షణ పద్ధతులు అమలవుతున్నాయి. అక్కడ ప్రభుత్వ కార్యక్రమాలు ఉండవు, కనుక విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఫలితంగా విద్యా ప్రామాణికత, ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటున్నది. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలో వెనుకబడుతున్నారు. ఇక్కడే ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతోంది. విద్యను నైతికంగా అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందా? లేకపోతే విద్యార్థులు చదువుపై మక్కువ కోల్పోవడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అస్తిత్వం క్రమంగా తగ్గిపోవడానికే ఈ పరిస్థితులు దారితీస్తున్నాయా? ప్రజా వ్యవస్థలో సమాన విద్యావకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వమే ఇలా భిన్న దృక్పథాన్ని అనుసరించడం అభ్యంతరకరం.

అధికారులు ప్రైవేటు పాఠశాలలను తరచూ తనిఖీలు చేస్తూ ‘బోధన తప్ప ఇతర కార్యక్రమాలు ఉండకూడదు’ అనే నియమం అమలు చేస్తుంటారు. మరి ప్రభుత్వ పాఠశాలలకు దీనిని ఎందుకు వర్తింపజేయరు? ఉపాధ్యాయుల సమయాన్ని శిక్షణలకూ, సమావేశాలకూ వినియోగించకుండా, బోధనకు అనుమతిస్తే విద్యార్థులకు మెరుగైన మౌలిక విద్య అందుతుంది. బోధనేతర కార్యక్రమాలు మోయలేని భారమై ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తోంది. సమర్థవంతమైన విద్యను అందించాలనుకుంటే, బోధనకు ప్రాధాన్యతనిచ్చే విధానాలపై ప్రభుత్వం దృష్టిసారించాలి. లేకపోతే ‘బడి బడిలా ఉండదు – చదువు చదువులా ఉండదు’ అన్న వాక్యం వాస్తవమైపోతుంది.

– తరిగోపుల నారాయణస్వామి

‘ప్రతిజ్ఞ’ పలకటమే కాదు, పాటిద్దాం!

మనం చిన్నప్పుడు స్కూల్లో రోజూ ‘భారత దేశం నా మాతృభూమి’ అని ఎలుగెత్తి ‘ప్రతిజ్ఞ’ చేస్తామే.. దాని రచయిత తెలుగువాడైన పైడిమర్రి వెంకటసుబ్బారావు అన్న సంగతి దాని రచన జరిగిన ఏభై ఏళ్ళ తర్వాత వెలుగులోకి వచ్చింది. ఆంధ్రజ్యోతిలోనే తొలిసారి 2011లో ‘ప్రతిజ్ఞ పద శిల్పి పైడిమర్రి’ పేరుతో ఓ వ్యాసం వచ్చింది. ఈ వ్యాసాన్ని పైడిమర్రి కుటుంబ సభ్యులు అందించిన వివరాల ఆధారంగా ఎలికట్టె శంకరరావు రాశారు. అనంతరం ఆయన జీవిత చరిత్రను యమ్. రామ్‌ప్రదీప్ రాశారు. హిందీలో ఆర్. రఘునందన్ రాశారు.

స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం వచ్చిన గీతాలలో ‘ప్రతిజ్ఞ’కి అత్యంత ప్రాముఖ్యత ఉంది. నల్గొండ జిల్లాలోని అన్నేపర్తి గ్రామానికి చెందిన పైడిమర్రి వెంకట సుబ్బారావు 1962లో ప్రతిజ్ఞ రాసారు. ఆ సంవత్సరం చైనా – భారతదేశాల మధ్య యుద్ధం సందర్భంగా పౌరులలో దేశభక్తిని పెంచడానికి ఆయన ఈ ‘ప్రతిజ్ఞ’ రాసారు. 1965 జనవరి 26న భారత ప్రభుత్వం దానిని జాతీయ ప్రతిజ్ఞగా ఆమోదించింది. దేశభక్తి గీతాలకు, ఈ ప్రతిజ్ఞకు తేడా ఉంది. దేశభక్తి గీతాలని రాగయుక్తంగా ఆలపిస్తాం. ప్రతిజ్ఞను ఎలుగెత్తి చదువుతాం. ప్రతిజ్ఞ అంటే ఒక హామీ. కానీ ఈ ప్రతిజ్ఞ చదివిన మనలో ఎంతమంది దాన్ని పాటిస్తున్నాం! పైడిమర్రి ఆశించినట్లు కులమతాలకు అతీతంగా దేశాన్నీ, దేశ ప్రజలనీ సోదరసమానంగా ప్రేమిస్తున్నామా? ప్రతిజ్ఞని పలకటమే గాక, ఆ పదాలని పాటించినప్పుడే మన దేశం ఇతర దేశాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

– యమ్. రామ్‌ప్రదీప్
(నేడు పైడిమర్రి వర్ధంతి)

ఇది ట్రంప్‌కు ఎదురు నిలబడాల్సిన సందర్భం!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం పట్ల అనుసరిస్తున్న రూళ్లకర్ర విధానం, పిడివాదం, మొండి వైఖరి పాలకుల విషయంలో ఏమోగానీ దేశ ప్రజలందరిలో తీవ్రమైన ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతావనిని ఇంతగా అవమానించిన నేత బహుశా ట్రంప్ తప్ప ప్రపంచంలో మరొకరు కనపడరు.

ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోవడం ఇష్టం లేక కావొచ్చు లేదా మరేదైనా కారణం కావొచ్చు– ట్రంప్ భారత్ పట్ల తన వ్యతిరేకతను బహిర్గతం చేస్తూ వస్తున్నారు. భారతీయులకు ఉద్యోగాలలో ప్రాధాన్యం ఇవ్వరాదని ఒకసారి, అసలు ఉద్యోగాలే ఇవ్వరాదని మరోసారి అమెరికన్ కంపెనీలను ట్రంప్ హెచ్చరించడం అందర్నీ విస్మయపర్చింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు యూదుల తర్వాత భారతీయులే దన్నుగా నిలుస్తున్నారని గణాంకాలు తెలియజెపుతున్నాయి. గత అర్ధశతాబ్ధిపైగా, ముఖ్యంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక భారతీయులు పెద్దసంఖ్యలో అమెరికాకు వెళ్లి అక్కడ నివాసం ఉంటున్నారు. అందులో చాలా మంది అమెరికా పౌరసత్వం లభించాక అక్కడి చట్టసభలకు ఎన్నికవుతూ అమెరికా ప్రజల గౌరవాభిమానాలు పొందుతున్నారు. అమెరికా సమాజంలో అంతగా మమేకం అయిన భారతీయుల పట్ల, భారతదేశం పట్ల ట్రంప్ చూపుతున్న వ్యతిరేకతకు ఎలాంటి హేతుబద్ధత గోచరించదు. కేవలం తొలి నుంచి రష్యాతో భారత్ స్నేహం సాగించడం ఒక్కటే కారణంగా కనిపిస్తోంది.

దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ – ఆయన ఆధ్వర్యంలో విదేశాంగశాఖ మంత్రిగా పనిచేసిన కృష్ణమీనన్ ఇరువురూ కమ్యూనిస్టులకు స్నేహితులని, వారిద్దరూ భారతదేశంలోను, అంతర్జాతీయంగా కొన్ని దేశాలలోను కమ్యూనిజం నిలదొక్కుకొనేందుకు సహకరించారనే పేరు ఉండేది. అందులో నిజం లేకపోలేదు. అగ్రరాజ్యాల కూటములలో ఎటూ చేరకుండా తటస్థ (అలీన) విధానం తమదని నెహ్రూ పదేపదే చెప్పేవారు. కానీ దేశ అవసరాల రీత్యా రష్యా నుంచి అనేక విధాలుగా సహకారం పొందడం వల్ల భారత్ పరోక్షంగా రష్యా కూటమి దేశంగానే పేరుపొందింది. అమెరికా, యూరప్ దేశాలతో వాణిజ్య, దౌత్య సంబంధాలు కొనసాగించినప్పటికీ అవి పరిమితంగానే సాగాయి. అందువల్ల ఏనాడూ అమెరికా భారత్‌ను మిత్రదేశంగా పరిగణించలేదు. పైగా, కశ్మీర్ సమస్యను కశ్మీర్ ప్రజల అభీష్టం మేరకు పరిష్కరించుకోవాలంటూ పాకిస్థాన్ వాదాన్ని అమెరికా వినిపిస్తూ వచ్చింది. ఉగ్రవాదానికి ఊతమిచ్చే పాకిస్థాన్ దుశ్చర్యలను ఏనాడూ అమెరికా నిర్ద్వంద్వంగా ఖండించలేదు. ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చింది పాకిస్థానేనని తెలిసినా అమెరికా మౌనంగా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

కాగా, సోవియెట్ యూనియన్ పతనంతో అనివార్యంగా భారత్ అమెరికా వైపు జరిగింది. అదే సమయంలో దేశ ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలో మొదలైన ఆర్థిక సంస్కరణలు నూతన ఆర్థిక విధానానికి దారితీశాయి. స్వేచ్ఛా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల అనుసంధానం పేరుతో అమెరికా విధానాలను గుడ్డిగా అనుసరించడం అప్పుడే ప్రారంభం అయ్యింది. ఆ క్రమంలోనే పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణ, సబ్సిడీలలో కోత, ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం వంటి షరతులకు తలొగ్గి ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వంటి అమెరికా కనుసన్నలలో నడిచే ద్రవ్య సంస్థల నుంచి భారీగా రుణాలను స్వీకరించడం మొదలైంది. చివరకు అమెరికా జపించే ‘ఏ సేవ కూడా ఉచితంగా ఇవ్వరాదు’ అనే మంత్రం భారత్‌లో మొదలైంది. ఒక్క మాటలో చెప్పాలంటే భారత్ 1990వ దశకం నుంచి అమెరికా వెంట నడిచింది. అయితే 1998లో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు పోఖ్రాన్–2 అణు పరీక్షలు నిర్వహించినపుడు దేశంపై అమెరికా ఆర్థికపరమైన ఆంక్షలు విధించింది. అమెరికా మిత్రదేశాలు కూడా కొన్ని భారత్‌పై ఆంక్షలు విధించాయి. కానీ నాటి ప్రధాని వాజపేయి అందుకు ముందుగానే సిద్ధపడ్డారు. “భారత్‌ను అణ్వాయుధ దేశంగా చేయడానికి కొన్ని త్యాగాలు చేయక తప్పదు. శత్రువుల నుంచి మమ్మల్ని మేం రక్షించుకోవడానికి ఇది అవసరం. అందువల్ల ఎవరి ఆంక్షలను లెక్కచేయం” అని స్పష్టంగా భారత్ వైఖరి తెలియజెప్పారు. వాజపేయి అనుసరించిన దృఢ వైఖరి కారణంగా అమెరికా అనతికాలంలోనే తను విధించిన ఆర్థిక ఆంక్షల్ని ఎత్తివేసి దౌత్య, వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకొంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆప్తమిత్రుడనే ప్రచారం ఎంతోకాలంగా ఉంది. కానీ, “తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే” అనే ఓ ముతక సామెత మాదిరిగా ట్రంప్ వ్యవహార శైలి కొనసాగుతున్నది. భారత్ ఓ విఫల ఆర్థిక వ్యవస్థ అని ట్రంప్ నోరుపారేసుకున్నా ఆయన వ్యాఖ్యలను నేరుగా ఏ భారతీయ రాజకీయవేత్త ఖండించకపోవడం ఆశ్చర్యమే. పైగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రధాన ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అయితే ‘ట్రంప్ చెప్పింది నిజమే కదా!’ అన్నారు. ట్రంప్ ప్రకటనను రాజకీయాలకు అతీతంగా ఖండించే ఉదారత ప్రతిపక్షాలకు లోపించడం దురదృష్టకరం.

ఈ విషయాన్ని పక్కన పెడితే.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతిగా అమెరికా భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధించడం అసమంజసమే కాదు, బ్లాక్‌మెయిలింగ్ కూడా! ఇందుకు బదులుగా భారత్ కూడా ప్రతీకార సుంకాలు విధించాలంటూ కొందరు ప్రతిపాదన చేస్తున్నారు. దానివల్ల భారత్‌కు జరిగే ఆర్థిక నష్టం భర్తీ అవుతుందన్నది వారి అభిప్రాయం. నిజానికి, ఈ అంశాన్ని కేవలం ఆర్థిక కోణం నుంచి మాత్రమే చూడటం సరికాదు. ఇది దేశ సార్వభౌమత్వానికి, దేశ స్వతంత్ర స్వేచ్ఛా వాణిజ్యపు ప్రయోజనాలకు సంబంధించిన అంశం. ఇందులో తలదూర్చే సాహసం చేయడం ట్రంప్ తలపొగరు తప్ప మరొకటి కాదు.

> దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమెరికాతో కయ్యానికి కాలు దువ్వరాదని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అది నిజమే కావొచ్చు. కానీ, దేశాన్ని అవమానిస్తుంటే, దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకొంటుంటే, భారత్ మౌనంగా ఉండిపోవాలా? కేవలం ప్రతీకార సుంకాలను విధించి ఊరుకోవాలా? దేశ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని, అంతర్జాతీయ వాణిజ్య దౌత్య వ్యవహారాలతో స్వతంత్ర విధానాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదే.



దేశ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమెరికాతో కయ్యానికి కాలు దువ్వరాదని మోదీ ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అది నిజమే కావొచ్చు. కానీ, దేశాన్ని అవమానిస్తుంటే, దేశ ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకొంటుంటే, భారత్ మౌనంగా ఉండిపోవాలా? కేవలం ప్రతీకార సుంకాలను విధించి ఊరుకోవాలా? ట్రంప్ చేస్తున్న విమర్శలకు ఆయన పేరు ఎత్తకుండా అన్యాపదేశంగా సమాధానాలు ఇస్తే గాయపడిన భారతీయుల మనోభావాలకు సాంత్వన చేకూరుతుందా? అంతే కాదు, అదానీ ప్రయోజనాలను పరిరక్షించడం కోసమే ట్రంప్‌ను పల్లెత్తుమాట అనడం లేదనే అప్రతిష్ఠను మోదీ మూటకట్టుకోవాల్సి వస్తోంది.

అగ్రరాజ్యాల పిడివాదం, దురంహకారాల వల్ల ప్రపంచం డీ–గ్లోబలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇదొక అనివార్య పరిణామంగా మారవచ్చు. పూర్తిగా సాధ్యం కాకున్నా ఏ దేశానికి ఆ దేశం ఇతరులపై ఆధారపడటం తగ్గించి స్వదేశీ ఉత్పత్తులు, స్వదేశీ పరిజ్ఞానంపై దృష్టిపెట్టొచ్చు. ప్రధాని నరేంద్ర మోదీ సైతం ప్రస్తుతం అదే చెబుతున్నారు. ఆ దిశగా దేశం పయనిస్తే మంచిదే. కానీ, అప్పటివరకూ దేశ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని, అంతర్జాతీయ వాణిజ్య దౌత్య వ్యవహారాలతో స్వతంత్ర విధానాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానిదే. అమెరికాతో భవిష్యత్ సంబంధ బాంధవ్యాల అంశంలో ఎన్డీఏ ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పక్షాల సలహాలు, సూచనలు స్వీకరించాలి. ఓ స్పష్టమైన విధానాన్ని అనుసరించాలి. ముఖ్యంగా ట్రంప్ బెదిరింపులకు, ఒత్తిళ్లకు ఎట్టి పరిస్థితుల్లో కూడా లొంగబోమని, ఆర్థిక దాస్యానికి సిద్ధంగా లేమన్న హెచ్చరిక నేరుగానే అంతర్జాతీయ సమాజానికి తెలియజెప్పాలి.

■ సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు


నగరంలో మంగళవారం రాత్రి కురుస్తున్న భారీ వర్షం

జిల్లాలో భారీ వర్షం

ఏకొండూరు, గంపలగూడెం, మైలవరం, జీ కొండూరు మండలాల్లో కుండపోత



జలమయమైన రోడ్లు

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్: 9154970454

బుడమేరు పరివాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ హెచ్చరికలు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో అర్ధరాత్రి వరకు కురుస్తూనే ఉన్న వర్షం
- నగరం జలదిగ్బంధం.. రోడ్లపై అడుగు ఎత్తున ప్రవహించిన నీరు
- చెరువులను తలపించిన జిల్లాలోని పంట పొలాలు
- మరో మూడు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టరేట్, కార్పొరేషన్‌లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు వర్షం పడుతూనే ఉంది. విజయవాడ నగరం, శివారు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో దాదాపుగా అన్ని మండలాల్లో భారీ వర్షం పడింది. బుడమేరు వరదకు దారితీసే విధంగా ఏకొండూరు, గంపలగూడెం మండలాల పరిధిలో భారీ వర్షం కురిసింది. దీంతో బుడమేరు పరివాహక ప్రాంతాల ప్రజలను కార్పొరేషన్ అధికారులు అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు మరో మూడు రోజులు పాటు ఉండే అవకాశం ఉండటంతో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రాత్రి 10 గంటల నుంచి కురుస్తున్న వర్షంతో భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు బ్యారేజీకి ఐదు లక్షల క్యూసెక్కుల వరకు వరద మిగతా 6లో..


వర్షంలో ద్విచక్ర వాహనదారుడి అవస్థలు

పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఎన్టీఆర్-పీఎంఏవైపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఏడాది ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యం రెండు లక్షలుగా నిర్దేశించుకున్న అధికారులు ఇప్పటి వరకు 70 వేల దరఖాస్తులు వస్తే ఒక్కదానికీ అనుమతి ఇవ్వలేదు. పనులు మొదలు పెట్టలేక ఆరు నెలలుగా లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గృహ నిర్మాణశాఖ ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

తాత్సారం!

ఎన్టీఆర్-పీఎంఏవైపై నీలినీడలు

2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యం 2 లక్షల ఇళ్లు

- ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వచ్చిన దరఖాస్తులు 70 వేలు
- ఆరు నెలలైనా మంజూరు కాని జాబితాలు
- పనులు మొదలు పెట్టలేని దైన్యస్థితిలో లబ్ధిదారులు
- 2014-19 నాటి గృహ లబ్ధిదారులకు తప్పని అవస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గుడ్లవల్లేరు): ఎన్టీఆర్ - పీఎంఏవై(నందమూరి తారక రామారావు- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన) ఇళ్లకు మోక్షం కలగటం లేదు. ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటంలో అంతులేని తాత్సారం జరుగుతోంది. దీంతో ఇళ్లు కట్టుకోలేక ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్-పీఎంఏవై గ్రామీణ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవటానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలకు రెండు లక్షల గృహాల వరకు లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటి వరకు 70 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆరు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి మంజూరు రాకపోవడంతో ఈ ఇళ్ల నిర్మాణాల విషయంలో గందరగోళం తలెత్తుతోంది. పీఎంఏవై ఇళ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సాయం రూ.1.80 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనారిటీలకు రూ.50 వేలు అదనంగా సహాయం చేయాలని నిర్ణయించింది. అంటే మొత్తంగా రూ.2.30 లక్షలు అవుతోంది. అదే ఎస్టీలకు రూ.75 వేలు ఆర్థిక సహాయం అదనంగా చేయాలని ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈ లెక్కన మొత్తం రూ.2.55 లక్షల సహాయం లబ్ధిదారులకు వస్తుంది. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ప్రభుత్వం మంజూరు చేయకపోవటంతో దరఖాస్తుదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటోంది. అనుమతి వస్తే ఇళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టుకోవచ్చని ఎంతోమంది లబ్ధిదారులు భావిస్తున్నారు.


వీరులపాడు మండలంలో నిర్మాణం మొదలు పెట్టి నిలుపుదల చేసిన పీఎంఏవై ఇల్లు

దశల వారీగా ఫొటోల అప్‌లోడ్‌తో సమస్య

ఇళ్లకు దశల వారీగా అంటే ఇళ్ల గ్రౌండింగ్ పనుల నుంచి పిల్లర్లు, గోడలు, స్లాబ్, పూర్తి చేసే వరకు వివిధ దశల్లో నిర్మాణ స్థాయిని తెలిపేలా ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జియో ట్యాగింగ్ లేకుండా ఇలా దశల వారీగా చేపట్టే పనులను ఫొటోలు తీయటం సాధ్యం కాదు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటే మొదటికే మోసం వచ్చే పరిస్థితి ఏర్పడుతుందన్న ఉద్దేశ్యంతో మంజూరు వచ్చి, జియో ట్యాగింగ్ చేసే వరకు ఇళ్లు కట్టుకోవద్దని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇళ్ల పనులు మొదలు పెట్టిన వారంతా ఎక్కడికక్కడ పనులు నిలుపుదల చేశారు. గతంలో కూడా ఈ విధానం అమల్లో ఉన్నా.. హౌసింగ్ అధికారులు ఆయా స్టేజ్‌లలో ఫొటోలు తీసుకునేవారు. మంజూరు ఆర్డర్ వచ్చిన తర్వాత నిర్దీత క్రమంలో దశల వారీగా వాటిని అప్‌లోడ్ చేసి బిల్లులు పెట్టేవారు. ప్రస్తుతం ఈ విధానం మిగతా 6లో..

గతంలో దరఖాస్తు చేసిన వెంటనే పనులు

పీఎంఏవై ఇళ్ల కోసం గతంలో ప్రజలు దరఖాస్తులు చేసిన తర్వాత హౌసింగ్ శాఖ పరిధిలో వారి అర్హతలను నిర్ణయించి అర్హులైన వారిని ఆన్‌లైన్ చేసేవారు. దీని ప్రకారం వారికి మంజూరు వచ్చినా.. రాకపోయినా.. ముందు ఇళ్ల పనులు మొదలు పెట్టుకోమని చెప్పేవారు. దీంతో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించేవారు. తర్వాత మంజూరు వచ్చినపుడు ఆ ఇళ్ల నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో హౌసింగ్ అధికారులు పరిశీలించి దానికి తగినట్టుగా బిల్లులు విడుదల చేసేవారు.

నేడు జియో ట్యాగింగ్ చేస్తేనే పనులు

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిబంధనలు మార్చింది. లబ్ధిదారులందరినీ ఖచ్చితంగా జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. జియో ట్యాగింగ్ చేయాలంటే ప్రభుత్వం మంజూరు ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతి రాకుండా జియో ట్యాగింగ్ చేయటం సాధ్యం కాదు. దీంతో ఇళ్ల పనులు ప్రారంభించమని అర్హులైన లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు చెప్పట్లేదు.

డ్రెయినేజీలోని వ్యర్థాలను పరిశీలిస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్


పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

కొరడా!

కొండపల్లి పారిశ్రామికవాడలో అధికారుల విస్తృత తనిఖీలు

- అనుమతులు లేని రెండు కంపెనీల ఉత్పత్తి నిలుపుదల
- నిబంధనలు పాటించని ఓ పరిశ్రమకు నోటీసులు జారీ
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి పారిశ్రామికవాడ (ఐడీఏ)లోని పలు కంపెనీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ఫార్మా కంపెనీల్లోని వ్యర్థాలను తొమ్మండ్రు, గుర్రాల వాగుల్లోకి యథేచ్ఛగా విడుదల చేయడంపై 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'వాగుల్లో కెమికల్స్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఈఈ శ్రీనివాస్ స్పందించారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి పలు కంపెనీలను పరిశీలించారు. ఏయే కంపెనీలు వ్యర్థాలను నేరుగా డ్రెయినేజీలోకి వదులుతున్నాయో, మిగతా 6లో..

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద!


ఎగువ నుంచి పులిచింతలకు 2.50 లక్షల క్యూసెక్కుల రాక

- పులిచింతల నుంచి కృష్ణానదికి భారీగా రానున్న వరద
- అప్రమత్తమైన అధికారులు.. గేట్లు ఎత్తేందుకు సిద్ధం

విజయవాడ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి మళ్లీ భారీ వరద రానుంది. దీనిపై ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. బ్యారేజీ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. ఎగువన నాగార్జున సాగర్ నుంచి, హైదరాబాద్‌లోని మూసీ నది నుంచి పులిచింతల ప్రాజెక్టుకు బుధవారం 2.50 లక్షల క్యూసెక్కుల నీరు మిగతా 6లో..

మేనత్తపై కత్తితో దాడి

- డబ్బుల విషయమై వివాదం
- గొంతుకోసి పరారైన మేనల్లుడు


తీవ్రంగా గాయపడిన మరియమ్మ

పెనుగంచిప్రోలు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డబ్బుల విషయమై ఏర్పడిన గొడవలో మేనత్తపై కత్తితో దాడి చేసి మేనల్లుడు పరారైన ఘటన మండలంలోని వెంగకాయకునుపాలి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్.ఐ.ఎం. ఎస్.కె.అర్జున తెలిపిన వివరాల ప్రకారం... యాదాల మరియమ్మకు, ఆమె మేనల్లుడు ముల్లగిరి నరేంద్ర మధ్య డబ్బుల విషయమై వివాదం తలెత్తింది. విచక్షణ కోల్పోయిన నరేంద్ర మిగతా 6లో..


ఎరుబోతు రమణారావు


బాలకోటయ్య


విధేయతకు పట్టం!

టీడీపీపై విశ్వాసంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు

ఎన్టీఆర్ జిల్లాను వరించిన నాలుగు కార్పొరేషన్ పదవులు

- రాష్ట్ర నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎరుబోతు రమణారావు
- రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా పోతిన బాలకోటయ్య
- రాష్ట్ర నగరాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మరుపిళ్ల తిరుమలరావు
- రాష్ట్ర నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నాగుల్ మీరా


మరుపిళ్ల తిరుమలరావు


నాగుల్ మీరా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విధేయత, సీనియారిటీ కలబోతే ప్రామాణికంగా ఎన్టీఆర్ జిల్లాలో నలుగురికి కార్పొరేషన్ చైర్మన్లుగా తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం అవకాశం కల్పించింది. పార్టీ జెండాను అంటిపెట్టుకుంటూ విజయంలో తమ వంతు పాత్ర పోషించిన వారికి సముచిత గుర్తింపును ఇచ్చింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి సీనియర్ లీడర్ ఎరుబోతు రమణారావును ఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా, అమరావతి ఉద్యమంలో బహుజన జేఏసీ తరపున తన వంతు పాత్ర పోషించిన దళిత సామాజిక వర్గానికి చెందిన పోతిన బాలకోటయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా, విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు నాగుల్ మీరాను ఏపీ నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా, మరుపిళ్ల తిరుమలేశ్వరరావును ఏపీ నగరాల మిగతా 6లో..

అమరావతి ఉద్యమంలో బాలకోటయ్య క్రియాశీలక పాత్ర

అమరావతి పోరాటంలో నేను సైతం అంటూ బహుజన జేఏసీ తరపున పోరాటం చేసిన పోతిన బాలకోటయ్య సేవలను పార్టీ అధిష్ఠానం గుర్తించింది. నందిగామ నియోజకవర్గం కంచికచర్లకు చెందిన బాలకోటయ్య అమరావతి ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. అమరావతి రాజధాని రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో పోరాటం జరిపారు. ఆయనను రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డుకు చైర్మన్‌గా ఎంపిక చేసి తగిన గుర్తింపు ఇచ్చింది.

నగరంలో నగరాలకు ప్రాధాన్యత

నగరంలోని పశ్చిమ నియోజకవర్గం పరిధిలో నగరాల సామాజికవర్గ ప్రజలు గణనీయంగా ఉన్నారు. నగరాల సామాజిక వర్గానికి చెందిన స్థానిక సీనియర్ నేత మరుపిళ్ల తిరుమలరావును ఏపీ నగరాల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవికి టీడీపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. నగరంలో నగరాలకు ప్రాధాన్యత ఇచ్చింది. తిరుమలరావు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు కొరగంజి శేఖర్‌బాబు రెండో అల్లుడే తిరుమలరావు.

డీఎస్సీలో సత్తాచాటారు

ఫలితాలు విడుదల చేసిన ప్రభుత్వం

నగరానికి చెందిన కె.వి.దుర్గాభవానికి స్టేట్ ర్యాంకు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 1,208 పోస్టులు
- పరీక్షలు రాసిన 67,470 మంది అభ్యర్థులు

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి విడుదల చేసిన డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జిల్లా అభ్యర్థులు సత్తాచాటారు. నగరానికి చెందిన కె.వి.దుర్గాభవానికి స్టేట్ ర్యాంకు సాధించారు. అభ్యర్థుల స్కోరు కార్డులు వారి లాగిన్‌లోకి వచ్చాయి. అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులతో పాటు మార్కుల పరంగా తమకు కచ్చితంగా ఉద్యోగం వస్తుందన్న నమ్మకంతో ఉన్న అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మిగతా 6లో..

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్న ఆనందం



ఐదేళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నా. ఈ ఏడాది విడుదల చేయడం.. 94.39 మార్కులతో స్టేట్ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉంది. 2022లో రైల్వేలో గ్రూపు-డీ పోస్టు వచ్చింది. అదే సమయంలో టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న ఇష్టంతో అందులో చేరలేదు. డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇస్తారనుకుంటే ఇవ్వలేదు. సమయం వృథా అయినా మంచి ర్యాంకు సాధించా. నాది మధ్యతరగతి కుటుంబం. నాన్న దుర్గారావు తాపీమేస్త్రి, అమ్మ ఇంటివద్దే ఉంటుంది. వారి సహకారంతోనే మంచి ర్యాంకు సాధించా. పోస్టులు కూడా తొందరగా భర్తీ చేస్తారని భావిస్తున్నా.

- కె.వి.దుర్గాభవాని, కృష్ణలంక

కర్రకు గిరాకీ! 6

- టన్ను రూ.6వేలు పలుకుతున్న సుబాబుల్
- గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల నిలువుదోపిడీ
- ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో గిట్టుబాటు ధర

ఆర్టీసీలో కండక్టర్ల కొరత! 6

వికసిత్ భారత్‌కు మానవ వనరులే కీలకం 8

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు 8



పాయకాపురం రైతుబజార్.. ఈవో కిరణ్ రాసిన రాజీనామా లేఖ

రైతుబజార్లలో రాజీనామాల ప్రకంపనలు!

- పటమట, పాయకాపురం ఈవోల రాజీనామా
- వ్యక్తిగత కారణాలే అంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

విజయవాడలో రెండు రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సీఈవో కె.మాధవీలతకు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజాబాబుకు అందజేశారు. ఈనెల 7న జరిగిన ఈ పరిణామం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూర్పు నియోజకవర్గంలో పటమట రైతుబజార్ ఈవో రమేష్, సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురంలోని మోడల్ రైతుబజార్ ఈవో పి.ఉదయ్‌కిరణ్ మూర్తి ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఇప్పుడిది మార్కెటింగ్ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నామని వారు లేఖల్లో పేర్కొన్నా.. దీని వెనుక వేరే కారణాలు ఉన్నాయని తెలుస్తోంది.

రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

ఎస్టేట్ ఆఫీసర్లు కిరణ్, రమేష్ రాజీనామా చేసిన విషయం బయటకు వచ్చిన తర్వాత పలువురు ఆరా తీయగా.. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్టు చెప్పుకొచ్చారు. అసలు కారణాలు ఇప్పట్లో చెప్పలేమని వారు కొంతమందితో అన్నట్టు తెలిసింది. పాయకాపురం మోడల్ రైతుబజార్ ఈవో కిరణ్‌ను బదిలీచేసి కొత్త ఈవోను నియమించాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు రైతుబజార్ల సీఈవోకు లేఖ రాసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఉల్లి, పచ్చిమిర్చి హోల్‌సేల్ వ్యాపారం చేసే ఇద్దరు నేతలు రైత్వారీ దుకాణం రెన్యూవల్‌కు ఇక్కడ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. రైతుబజార్‌కు సెక్యూరిటీగార్డుగా ఇటీవల ఓ వ్యక్తిని కిరణ్ నియమించారు. ఈ పోస్టుకు మరోవ్యక్తిని ఓ ప్రజాప్రతినిధి సిఫార్సు చేయగా కిరణ్ పరిగణనలోకి తీసుకోలేదని తెలిసింది. ఇది ఆయనకు ఒకింత ఆగ్రహాన్ని కలిగించినట్టు సమాచారం. కొద్దినెలల క్రితం ఇక్కడి రైతుబజార్‌లో పాల ఉత్పత్తుల స్టాల్, కవర్ల స్టాల్ ఏర్పాటుపై బొండా ఉమామహేశ్వరరావు అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇది కాకుండా కూటమిలో ఉన్న మూడు పార్టీల నేతలు తమ అనుచరులకు మేలు చేయడానికి రైతుబజార్‌లో కొత్త దుకాణాలను కేటాయించాలని ఒత్తిడి చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక కిరణ్ రాజీనామా చేసినట్టు ప్రచారం జరుగుతోంది. రైతుబజార్ల సీఈవో కె.మాధవీలత మరోసారి పునరాలోచన చేసుకోవాలని సూచించినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కొరడా!

(5వ పేజీ తరువాయి)

ఏయే కంపెనీల వ్యర్థాలు డ్రెయినేజీల ద్వారా తొమ్మండ్రు, గుర్రాల వాగుల్లో కలుస్తున్నాయో పరిశీలించారు. ఫార్మా, కెమికల్, టైర్ రీబూటింగ్, మడ్డాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలలో శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ వి.వి ఫుడ్స్‌కు అనుమతి ఉన్నా నీటిని డ్రెయినేజీలో వదులుతున్నందున నోటీసులు ఇస్తామన్నారు. భావన పాలిమర్స్, గాయత్రి ప్లాస్టిక్స్ కంపెనీలకు అనుమతులు లేకుండా నడుపుతున్నందున కంపెనీలలో ఉత్పత్తిని నిలిపివేస్తున్నామన్నారు. మాన్ డెకార్స్ కంపెనీల వారు నేరుగా వ్యర్థాలను డ్రెయినేజీల్లో వదిలేస్తున్నారని వారికి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. హెచ్.పీ.సీ.ఎల్ గ్యాస్ కంపెనీలో సిలెండర్స్ శుద్ధి చేసిన నీరు నేరుగా తొమ్మండ్రు వాగులో కలుస్తున్నందున దానికి అడ్డుకట్ట వేయిస్తున్నామన్నారు. ఒకరిని ఐడీఏలో ఉంచి కంపెనీలపై పర్యవేక్షణ చేయిస్తున్నామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి వ్యర్థాలను డ్రెయినేజీలో వదిలే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

డీఎస్సీలో సత్తాచాటారు

(5వ పేజీ తరువాయి)

మొత్తం 1,208 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా, 67,470 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. జిల్లా పరిషత్, ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలలన్నింటిలో కలిపి స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ) 663, సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ) 545 పోస్టులున్నాయి. వీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ఐదు ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయబోతున్నట్టు జిల్లా నోడల్ ఆఫీసర్ తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన పలువురు అభ్యర్థులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

నిరంతర సాధనతో విజయం



\- వై.నాగసాయి వైదేహి, గుణదల

2019లో డీఈడీ, 2022లో బీఈడీ పూర్తిచేశా. డీఎస్సీలో 91.31 మార్కులతో మంచి ర్యాంకు సాధించా. ఎస్‌జీటీ పేపర్-1, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ, టీజీటీ-రెసిడెన్సియల్ పోస్టులకు అర్హత సాధించా. ఈ మూడింటిలో ఏది మంచిదనిపిస్తే అటువైపు మొగ్గుచూపుతా. ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నా. నిరంతర సాధనతోనే విజయం సాధించా. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది.

పట్టుదలతో సాధించా



\- పి.శ్రీవల్లి, పెద్దఅవుటపల్లి

డీఎస్సీ కోసం ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నా. 2018లో నోటిఫికేషన్ ఇచ్చినా ఉద్యోగం పొందలేకపోయా. ఈ సారి ఎలాగైనా సాధించాలనే పట్టుదలతో సాధన చేశా. 83.9 మార్కులు రావడం ఆనందంగా ఉంది. 2023లో కొంతకాలం సాఫ్ట్‌వేర్‌లో ట్రైనింగ్ తీసుకుని ఉద్యోగం చేశా. నాన్న బాలస్వామి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి, తల్లి రమాదేవి గృహిణి. వారి తోడ్పాటుతోనే మెరుగైన ఫలితాలు సాధించా.

జిల్లాలో భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నగరంలో ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65లపై బెంజిసర్కిల్, రామవరప్పాడు, ఎన్టీఆర్ సర్కిల్ ప్రాంతం వరకు మోకాలి లోతున నీరు నిలిచాయి. రామవరప్పాడు ఊరు బయట నుంచి ఎనికేపాడు వరకు ఎన్‌హెచ్ - 16 మీద రెండు వైపులా భారీగా నీరు నిలిచిపోయింది. వన్‌టౌన్, విద్యాధరపురం, చిట్టినగర్, లోబ్రిడ్జి, భవానీపురం, కృష్ణలంక, రాణిగారితోట, సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మొగల్రాజపురం కొండ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో సిద్ధార్థనగర్, జమ్మిచెట్టు సెంటర్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డు మీద భారీగా వర్షం నీరు ప్రవహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా వర్షం ధాటిగా కురుస్తోంది. పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. 9154970454కు ఫోన్ చేయటం ద్వారా ఎలాంటి సహాయం అయినా కోరవచ్చు. వరద సమాచారం తెలుసుకోవచ్చు. మరోవైపు కార్పొరేషన్ యంత్రాంగం కూడా అలెర్ట్ అయింది. హైదరాబాద్‌లో భారీగా కురుస్తున్న వర్షాలు, వరద వైరా, మున్నేరుల ద్వారా భారీగా కృష్ణానదిలోకి వస్తోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు ఫ్లడ్ అలెర్ట్‌లను జారీ చేయాలని నిర్ణయించింది. కార్పొరేషన్‌లో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు ఆదేశించారు.

కర్రకు గిరాకీ!

- టన్ను రూ 6వేలు పలుకుతున్న సుబాబుల్
- గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల నిలువుదోపిడీ
- ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో గిట్టుబాటు ధర

జిల్లాలో సుబాబుల్ కర్ర రికార్డుస్థాయిలో ధర పలుకుతోంది. పేపరు కంపెనీల డిమాండ్‌కు తగినంతగా కర్ర సరఫరా లేనందున ధర బాగా పెరిగింది. ఖర్చులతో సంబంధం లేకుండా టన్నుకు నికరంగా రైతు చేతికి రూ.6వేలు అందుతున్నాయి. మెట్ట ప్రాంతంలో వాణిజ్య పంటలతో నష్టపోతున్న రైతులు, కర్రకు మంచి ధర లభిస్తుండటంతో ప్రత్యామ్నాయంగా సుబాబుల్ తోటల వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఈ ఏడాది సుబాబుల్ తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.





సుబాబుల్ కర్ర నరుకుతున్న కూలీలు, ట్రాక్టరుకు లోడింగ్

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ పాలనలో సుబాబుల్ రైతులు నిలువు దోపిడీకి గురయ్యారు. మద్దతు ధరలో కనీసం నామమాత్రపు ధర కూడా రైతులకు అందలేదు. పదేళ్ల క్రితం నాటి టీడీపీ ప్రభుత్వం సుబాబుల్ కర్రకు టన్ను రూ.4,400 మద్దతు ధర నిర్ణయించింది. కర్ర నరుకుడు, రవాణా, ఇతరత్రా ఖర్చులు కలిపి టన్నుకు రూ. వెయ్యి వరకు ఖర్చులు పోను చేతికి నికరంగా రూ. 3,400 తగ్గకుండా అందాయి. అలాంటిది వైసీపీ ప్రభుత్వ హయాంలో టన్నుకు రూ.1,500 కూడా గగనమైంది. ఐదేళ్లపాటు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పేపరు కంపెనీలు, రైతులను పీల్చి పిప్పి చేశాయి. 2019 ఎన్నికలకు ముందు రూ. 5వేలకు తగ్గకుండా ధర ఇస్తామని వాగ్దానాలు చేసిన వైసీపీ నేతలు, అధికారంలోకి రాగానే కనీసం పట్టించుకోక, గిట్టుబాటు ధర ఇప్పించటంలో పూర్తిగా విఫలమయ్యారు. గిట్టుబాటు ధర కోసం రైతుల ఆందోళన అరణ్యరోదనగా మారింది. తీవ్రంగా నష్టపోయిన పలువురు రైతులు తోటలను తొలగించారు.

2014 నుంచి ధరలో వ్యత్యాసం..

2014 ఎన్నికల ముందు నుంచి సుబాబుల్ ధరలో కదలిక వచ్చింది. క్రమేణా ధర పుంజుకుంది. గత ఆగస్టులో రైతుల చేతికి నికరంగా రూ. 6వేలు అందాయి. తర్వాత ధర కొద్దిగా దిగజారింది. ఒక దశలో రూ. 5 వేలు మాత్రమే దక్కాయి. తిరిగి మార్కెట్లో ధర పెరుగుతోంది. పేపరు కంపెనీల అవసరాల (డిమాండ్)కు తగినంతగా ముడిపదార్థమైన సుబాబుల్ కర్ర దొరకటం (సరఫరా)లేదని రైతు నేతలు చెపుతున్నారు. ఒకవైపు తోటల విస్తీర్ణం తగ్గటం, మరోవైపు వర్షాకాలం కావటం వల్ల తోటలు నరకటానికి వీలుపడటం లేదు. ప్రస్తుతం కర్ర సరఫరా బాగా తగ్గింది. గుత్తాధిపత్యంతో ధర విషయంలో పెత్తనం చెలాయించిన కంపెనీలు కర్ర కోసం పోటీపడుతూ ధర పెంచుతున్నాయి. రైతు చేతికి నికరంగా రూ. 6వేలు అందడం సుబాబుల్ చరిత్రలో ఓ రికార్డు. కూటమి ప్రభుత్వంలో అత్యధిక ధర లభిస్తుండటంతో రైతులు సంతోషంతో ఉన్నారు. ఈ ధర ఇంకా పెరగవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు

ఈ ప్రాంతం నుంచి సుబాబుల్ కర్ర ఎస్‌పీఎం (సిర్పూర్ కాగజ్ నగర్), జేకే పేపర్ మిల్స్ (బలార్షా), ఏపీపీఎం (రాజమండ్రి), ఐటీసీ (భద్రాచలం) తదితర పేపరు మిల్లులకు సరఫరా అవుతుంది. వ్యవసాయ మార్కెట్ కమిటీల పర్యవేక్షణ లేనందున దాదాపుగా పేపరు కంపెనీలన్నీ దళారుల ద్వారా కర్ర కొనుగోలు చేస్తుండటం విశేషం. కొందరు దళారులు ఎకరాల వంతున తోటలను కాంట్రాక్టుకు తీసుకుంటున్నారు. ఇంకొందరు తోటల్లో కర్ర నరుకుడు, రవాణా ఖర్చులతో సంబంధం లేకుండా టన్ను రూ. 6వేల వంతున రైతుకు ఇస్తున్నారు.

పెరిగిన తోటల విస్తీర్ణం

ఈ ఏడాది సుబాబుల్ తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో సుబాబుల్ తోటలు ఉన్నాయి. గతంలో లక్ష ఎకరాల్లో తోటలు ఉంటే.. గిట్టుబాటు ధర లభించక అధికశాతం రైతులు తోటలను తొలగించటంతో విస్తీర్ణం 50 వేల ఎకరాలకు తగ్గింది. ఒకవైపు వాణిజ్య పంటలు, అపరాల వల్ల నష్టపోతుండటం, మరోవైపు కర్రకు రికార్డుస్థాయిలో ధర లభిస్తుండటంతో రైతులు సుబాబుల్ తోటల సాగుకు మొగ్గుచూపుతున్నారు. మరల తోటల విస్తీర్ణ లక్ష ఎకరాలకు చేరుతుందని చెపుతున్నారు. అయితే ఎకరం తోటలో 25 నుంచి 35 టన్నుల లోపు కర్ర దిగుబడి వస్తుంది. మూడు నుంచి నాలుగేళ్లలోపు తోట నరుకుడుకు వస్తుంది. ఏడాది నుంచి తోటల విస్తీర్ణం పెరుగుతున్నందున రెండేళ్ల తర్వాత కర్ర పుష్కలంగా లభ్యం కానున్నది.

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్

- తల్లి మృతి.. కుమారుడికి స్వల్పగాయాలు



తల్లి మృతదేహం వద్ద విషాద వదనంతో..

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మరి కాసేపట్లో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపేద్దామనుకున్న ఆ కుటుంబాన్ని మృత్యువు బూడిద ట్యాంకర్ రూపంలో వెంటాడింది. ద్విచక్రవాహనంపై వెళుతున్న తల్లీకొడును వెనుక నుంచి ట్యాంకర్ వేగంగా ఢీకొనడంతో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారుడికి స్వల్పగాయాలయ్యాయి. ఈ విషాదకర ఘటన ఇబ్రహీంపట్నంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొండపల్లికి చెందిన పరగటి విజయమ్మ కుమారుడితో కలిసి విజయవాడ వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. వీరి వాహనం వేడి నీళ్ల కాలువ వంతెనపైకి చేరుకుటుండగా వెనుక నుంచి బూడిద ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న విజయమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. హెల్మెట్ ధరించి ఉన్న ప్రవీణ్ గాయాలతో బయటపడ్డాడు. ట్యాంకర్ ఆగకుండా వెళ్లడాన్ని గుర్తించిన కొందరు రింగ్‌లో ఉన్న ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణరావుకు సమాచారం ఇవ్వడంతో వారు ట్యాంకర్‌ను ఛేజ్ చేసి నిమ్రా కళాశాల వద్ద పట్టుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా రైతును ఆదుకోండి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- దశలవారీ ఆందోళనకు తీర్మానం



సమావేశంలో ప్రసంగిస్తున్న బలరామ్

గవర్నర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రైతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేస్తున్న పన్నులు, ఆక్వా రైతుపై ప్రభావం అంశంపై ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఎంజీరోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆక్వా రైతును ఆదుకునేలా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దశలవారీ ఆందోళనలు చేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి సంఘం రాష్ట్రఅధ్యక్షుడు వి.కృష్ణయ్య అధ్యక్షత వహించారు. పూర్వ అధ్యక్షుడు బి.బలరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 8 జిల్లాల్లో 4 లక్షల ఎకరాలకు పైగా భూముల్లో రొయ్యలసాగు జరుగుతోందన్నారు. భారత్ నుంచి ఇతర దేశాలకు 7.16 లక్షల టన్నుల ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని, ఇలాంటి స్థితిలో ట్రంప్ ఆక్వా ఎగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడంతో దీని ప్రభావం ఏపీపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందన్నారు. సంఘ అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ, ట్రంప్ ప్రకటనతో రొయ్యల ధరలు పడిపోయాయని, అమెరికా సుంకాలతో ఇతర దేశాలకు ఎగుమతి చేసే రొయ్యలు, కౌంట్ ధర తగ్గించి కంపెనీలు కొంటున్నాయని తెలిపారు. రైతు సంఘం నేత వై.కేశవరావు మాట్లాడుతూ, భారత్‌పైనే అమెరికా అత్యధిక సుంకాలు వేసిందని, పక్కనే ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంకలపై 20శాతం, పాకిస్తాన్ ఎగుమతులపై 19శాతం, మనతో పోటీగా రొయ్యల ఎగుమతి చేసే ఈక్విడార్‌కు 13.78శాతం సుంకాలు విధించి భారత్‌పై అక్కసు వెళ్లగక్కిందన్నారు. రైతుపై సుంకాల ప్రభావం పడకుండా ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఐద్వా ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ, ఆక్వా రంగంలో మహిళల పాత్ర గణనీయమైనదని, ఈ రంగం సంక్షోభంలో పడితే రైతాంగంతో పాటు మహిళలు కూడా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు తీర్మానం ప్రవేశపెడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎంపెడా కౌంటర్ గ్యారెంటీ ఇచ్చి ఆక్వా ఉత్పత్తులను ప్రస్తుత ధర కంటే తక్కువ లేకుండా మొత్తం కొనుగోలు చేస్తామని భరోసా ఇవ్వాలని, కేంద్ర ఎక్స్‌పోర్టర్స్ ధర తగ్గించి కొనుగోలు చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిమాండ్ల సాధన కోసం వ్యవసాయశాఖ మంత్రికి, ముఖ్యమంత్రికి వెంటనే వినతిపత్రాలు ఇవ్వాలని, ఆక్వాసాగు ఉన్న అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, బహిరంగ సభలు నిర్వహించి నిరసనలు తెలియజేయాలని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ఆక్వాటెక్ ఎడిటర్ కోనా జోసఫ్, ఆక్వారంగ నిపుణులు షేక్ ఆలీ హుస్సేన్, ఆక్వా రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్ ఆర్.సూర్యనారాయణరాజు, రైతు నేతలు రావి వెంకట్రావు, ఎం. శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, మోరు రామరాజు తదితరులు ప్రసంగించారు.

మేనత్తపై కత్తితో దాడి

(5వ పేజీ తరువాయి)

కూరగాయలు కోసే కత్తితో మరియమ్మపై దాడి చేసి గొంతు కోశాడు. అనంతరం అక్కడి నుంచి పరారైయ్యాడు. తీవ్రంగా గాయపడిన మరియమ్మను స్థానికులు నందిగామ ప్రభుత్వస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం, విజయవాడ ప్రభుత్వసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మరియమ్మ ఆరోగ్యం నిలకడగా ఉంది. కాగా, ముల్లగిరి నరేంద్ర గతంలో కన్న తండ్రిపైనే దాడి చేసి జైలుకు వెళ్లాడు. నందిగామ ఏసీపీ తిలక్ ఆదేశాలతో జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి నరేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విధేయతకు పట్టం!

(5వ పేజీ తరువాయి)

సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా నియమించింది.

పార్టీ బలోపేతానికి ఎరుబోతు రమణారావు కృషి

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) ఫ్లోర్ లీడర్‌గా పనిచేసిన ఎరుబోతు రమణారావు నగరంలో పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. ప్రజల సమస్యలే అజెండాగా కౌన్సిల్‌లో పోరాటాలు జరిపారు. పార్టీకి విధేయుడిగా ఉన్నారు. నాగవంశ కులానికి చెందిన రమణారావును ఏపీ నాగవంశ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపిక చేసి తగిన గుర్తింపును ఇచ్చింది.

రెండోసారి వరించిన అదృష్టం

పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కె.నాగుల్ మీరాకు రెండోసారి నామినేటెడ్ పదవి వరించింది. ఏపీ నూర్‌బాషా దూదేకుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా అధిష్టానం నాగుల్ మీరాను ఎంపిక చేసింది. నాగుల్ మీరా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. పశ్చిమ నియోజకవర్గంలో సీనియర్ నాయకుడిగా ఉన్నారు. వివాదాలకు దూరంగా ఉంటారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ పార్టీకి సేవలందిస్తున్నారు.

తాత్సారం!

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టనీయటం లేదు.

2019-24 ఓకే.. మరి 2014 - 19 మాటేమిటి?

గత టీడీపీ ప్రభుత్వంలో 2014 - 19 కాలంలో పీఎంఏవై గ్రామీణ ఇళ్లకు అనుమతి ఇచ్చింది. అప్పట్లో చేపట్టిన వేల సంఖ్యలో ఇళ్లకు ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదు. కొన్ని నిర్మాణాలు ఇప్పటికీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వీటిని పూర్తి చేయటానికి సహాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 - 2024 మధ్య చేపట్టిన పీఎంఏవై ఇళ్లకు సంబంధించి అసంపూర్తిగా ఉన్న వాటికి అదనంగా రూ.50 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 2014 - 19 నాటి ఇళ్ల కూడా అదనపు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

బ్యారేజీకి మళ్లీ వరద!

(5వ పేజీ తరువాయి)

చేరుతుందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఖమ్మం, వరంగల్ ప్రాంతాల నుంచి వైరా, కట్టలేరు, మునేరు వాగుల ద్వారా వరద నీరు నేరుగా కృష్ణానదిలో చేరనుంది. క్రమక్రమంగా వరద ఉధృతి మూడు లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని వెల్లడిస్తున్నారు. పులిచింతల నుంచి వరద నీరు బుధవారం సాయంత్రానికి ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని, ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి, గురువారం ఉదయం మూడు లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కృష్ణా రివర్ కన్సర్వేటివ్ ఈఈ రావెళ్ల రవికిరణ్ మంగళవారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 10.30 గంటలకు 70,738 క్యూసెక్కులను, మధ్యాహ్నం రెండు గంటలకు 1.08 లక్షల క్యూసెక్కులను, రాత్రి తొమ్మిది గంటలకు 1.44 లక్షల క్యూసెక్కులను బ్యారేజీ నుంచి విడుదల చేశారు. మంగళవారం ఉదయానికి వరద ప్రవాహం తగ్గడంతో ఏడు గంటలకు 94 వేల క్యూసెక్కులను మాత్రమే సముద్రంలోకి పంపారు. అయితే హైదరాబాద్‌లో పడుతున్న భారీ వర్షాల కారణంగా మూసీ నది వరద నీరు దాచేపల్లి వద్ద మంగళవారం రాత్రి కృష్ణానదిలో కలిసి, ఈ వరద అక్కడ నుంచి పులిచింతల ప్రాజెక్ట్‌కు చేరుతుందని అధికారులు చెబుతున్నారు. మరో వైపు మునేరు వాగు నుంచి వరద నీరు కృష్ణానదిలో చేరుతుంది. నది ఎగువ ప్రాంతంలో ఈ నెల 13, 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వరద ప్రకాశం బ్యారేజీని తాకే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

యంత్రాంగం అప్రమత్తం

కృష్ణాకు వరద రానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాగాన్ని, నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విపత్తుల నిర్వహణ శాఖ హెచ్చరికలతో మంగళవారం రాత్రి ఆయన పలు శాఖల ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్, పోలీస్, రెవెన్యూ, వీఎంసీ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక విధులను కేటాయించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతున్న తరుణంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆర్టీసీలో కండక్టర్ల కొరత!

మహిళలకు ఉచితం ఎఫెక్ట్

- ఓడీల రద్దుపై అధికారుల వివక్ష



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆర్టీసీకి కండక్టర్ల కొరత ఏర్పడింది. మహిళల ఉచిత బస్సు పథకం అమలుకు తగిన సంఖ్యలో కండక్టర్లు లేరు. దీంతో ఓడీలలో ఉన్న కొంతమంది కండక్టర్లను రప్పించాలని, అవసరమైతే డ్రైవర్లను కూడా కండక్టర్లుగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. పూర్తిస్థాయిలో ఓడీలు చేస్తున్న కండక్టర్లందరినీ అన్ని శాఖలు, అన్ని విభాగాల నుంచి తిరిగి వెనక్కు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కానీ కొన్ని విభాగాలలో పనిచేసే వారినే కండక్టర్లుగా ఉపయోగించుకోవాలనుకోవటం విమర్శలు దారి తీస్తోంది.

మరో రెండు రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రారంభం కానున్న 'మహిళలకు ఉచిత ప్రయాణం' పథకాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థలో కొనసాగుతున్న అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ (ఓడీ) డ్యూటీలను రద్దు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తోంది. వాస్తవ విధులకు భిన్నంగా వివిధ శాఖలు, విభాగాలలో పనిచేస్తున్న వారంతా ఓడీ కేటగిరీలోకి వస్తారు. ప్రస్తుతం కండక్టర్ల కొరత నేపథ్యంలో దీనిని అధిగమించేందుకు కొన్ని విభాగాలలో ఓడీ విధానంలో పనిచేస్తున్న వారిని కండక్టర్లుగా ఉపయోగించుకోవాలని భావిస్తోంది. డ్రైవర్లుగా ఉన్న వారిని కూడా కండక్టర్లుగా పంపాలని భావిస్తోంది.

- గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీలో పనిచేసే వారిని టీఆర్అండ్‌బీ పరిధిలోకి కొంతమందిని ఓడీ విధానంలో పనిచేసేందుకు పంపించారు. ఆర్టీసీ హౌస్‌లో ఐటీ, పీఎఫ్, పర్సనల్ డిపార్ట్‌మెంట్, సీఈడీ, అక్కౌంట్స్ తదితర విభాగాలలో ఓడీ విధానంలో 70 మంది పైగా పనిచేస్తున్నారు. ఆయా శాఖలు, విభాగాలలో పనులు చేయటానికి అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని తీసుకుంటే సరిపోతుంది. ఆయా శాఖలు, విభాగాలకు పంపిన వారంతా అక్కడ డేటా ఎంట్రీ ఉద్యోగాలే చేస్తున్నారు. లక్షలాది రూపాయలు జీతాలు ఇచ్చి కండక్టర్లను ఈ విధులకు తీసుకునేకంటే .. రూ. 15 - 20 వేలు ఇచ్చి అవుట్‌సోర్సింగ్ విధానంలో తీసుకోవటానికి అవకాశం ఉంది. హెడ్డాఫీసుల్లో పనిచేసే వారిని తొలగిస్తే పనులు ఆగిపోతాయన్న వాదనలను అధికారులు తీసుకువస్తున్నారు. ఉన్నతాధికారులకు కూడా అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తున్నారు. గతంలో సురేంద్రబాబు ఎండీగా ఉన్న సమయంలో ఇలాంటి ఓడీలన్నింటినీ రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని ఆదేశాలు ఇచ్చారు. ఇది అమలు జరిగేలోగా ఆయన బదిలీతో ప్రక్రియ ఆగిపోయింది. ఆర్టీసీ హౌస్, ఎన్టీఆర్ జిల్లా రీజియన్, పీఎన్‌బీఎస్‌లలో కూడా కొంతమంది అధికారులు తమకు కావాల్సిన వారి కోసం అనధికారికంగా ఓడీలలో కొనసాగిస్తున్నారు. అనధికారిక ఓడీలను రద్దు చేయాల్సిన అవసరం ఉంది.
- రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించటంతో ఆర్టీసీకి కండక్టర్ల కొరత ఏర్పడింది. చాలా కాలంగా ఆర్టీసీ సర్వీసులను అధికారులు తగ్గిస్తూ వస్తున్నారు. దీంతో కండక్టర్ల సమస్య పెద్దగా కనిపించలేదు. మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ప్రయాణాలు పెరగటమే కాకుండా సర్వీసులను పెంచాల్సి వస్తోంది. దీంతో ఇప్పుడు కండక్టర్ల సమస్య కనిపిస్తోంది. ఈ సమస్యను పరిష్కరించుకోవటానికి ఎంచుకున్న విధానం పక్షపాతంతో ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

లయోలాలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

భారతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ ఫాదర్ ఎస్.ఇమ్మాన్యుయేల్, మాట్లాడుతూ డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ ప్రతిపాదించిన గ్రంథాలయ సూత్రాలను విద్యార్థులకు వివరించారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.గీతారాణి మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఫాదర్ బి.జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ.మహేష్, గ్రంథ పాలకులు స్వాతి కిరణ్, చైతన్యదాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



యాంటీ ర్యాగింగ్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుకొండల రావు, తదితరులు



మాట్లాడుతున్న ఏసీపీ దామోదర్‌రావు

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

సిద్ధార్థ మెడికల్ కాలేజీలో జరిగిన యాంటీ ర్యాగింగ్ డే కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏడుకొండల రావు

మాచవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏ.ఏడుకొండల రావు హెచ్చరించారు. కాలేజీలోని మంగళవారం జాతీయ యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్ దాని పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులకు న్యాయపరమైన, విద్యా సంబంధిత శిక్షలు ఎలా ఉంటాయో తెలుసుకుని ప్రవర్తించాలన్నారు. ఫ్రెషర్స్‌తో స్నేహపూర్వకంగా ఎలా వ్యవహరించాలో సూచనలిచ్చారు. కాలేజీలో ర్యాగింగ్ పాల్పడితే తరగతుల నుంచి సస్పెన్షన్ చేయడంతో పాటు స్కాలర్‌షిప్‌లు/ఫెలోషిప్‌లు నిలిపివేసే విధంగా విద్యాచట్టాల్లో శిక్షలు ఉన్నాయని ఆయన తెలిపారు.

ర్యాగింగ్ చేసినట్టు క్రిమినల్ రికార్డుల్లో నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ రాకుండా నష్టపోతారని పేర్కొన్నారు. ఆత్మహత్యను ప్రేరేపించేలా ర్యాగింగ్ చేసినట్టు రుజువైతే ఐపీసీ 306 కింద పదేళ్ల జైలు పడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సత్యకిశోర్, గోవింద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో...

భారతీనగర్: తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడినా, బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ దామోదర్‌రావు హెచ్చరించారు. మంగళవారం ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాల, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ట్ స్కూల్‌లో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అటకెక్కిన అంబులెన్స్

- 18ఏళ్లగా నిరుపయోగం
- కార్మికులకు అందని వైద్య సేవలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



తుప్పల్లో నిరుపయోగంగా పడి ఉన్న అంబులెన్స్

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: ఏపీఐఐసీ వాడల్లో పనిచేసే కార్మికులకు వైద్య సేవలు అందించే కార్మిక రక్ష వాహనం మొబైల్ అంబులెన్స్ గత 18ఏళ్లగా నిరుపయోగంగా ఉంది. ఆటోనగర్‌లోని ఐలా కార్యాలయం వద్ద, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కార్యాలయం వెనుక భాగంలో తుప్పల్లో ఈ అంబులెన్స్ దర్శనమిస్తోంది. కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు సుమారు రెండు దశాబ్దాల క్రితం ఒక దాత ముందుకు వచ్చి వీపీ రామారావు స్మారక ఏపీఐఐసీ కార్మికరక్ష వాహనం పేర మొబైల్ అంబులెన్స్‌ను సమకూర్చారు. దీని ద్వారా విజయవాడలోని జవహర్ ఆటోనగర్‌తోపాటు రాష్ట్రంలోని ఏపీఐఐసీ వాడల్లో పనిచేసే కార్మికులకు వైద్యసేవలు అందించేందుకు ఇది దోహదం చేస్తుంది. అనుకోకుండా కార్మిక వాడల్లో అగ్నిప్రమాదాలు జరిగితే కార్మికులకు ప్రాథమిక చికిత్స కూడా ఈఅంబులెన్స్ ద్వారా అందించేవారు.. అయితే అధికారులను నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో సేవలు ప్రారంభమైన రెండేళ్లకే ఇది మూలనపడింది. తరువాత వచ్చిన ఏపీఐఐసీ అధికారులు గానీ, ఐలా పాలకవర్గం, అధికారులుగాని పట్టించుకోక పోవడంతో నేటికీ మొబైల్ అంబులెన్స్ మూలనే ఉంది. నిరుపయోగంగా ఉన్న మొబైల్ అంబులెన్స్ మరమ్మతులు చేయించడంగానీ, లేదా మరో అంబుల్సెను కొనుగోలుచేసి మొబైల్ వైద్యసేవలు అందించాలని కార్మికవాడలోని వర్కర్‌లు కోరుతున్నారు. దీనిపై ఏపీఐఐసీ ఉన్నతాధికారులు గానీ లేదా ప్రతినిధులుగాని దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆటోనగర్‌లోని కార్మికులు కోరుతున్నారు.

కొత్త అంబులెన్స్ కొనుగోలు చేయాలి

ఐలా కార్యాలయం వద్ద తుప్పల్లో నిరుపయోగంగా పడి ఉన్న ఏపీఐఐసీ కార్మిక రక్ష వాహనానికి మరమ్మతులు చేయించడం గానీ లేదా కొత్త అంబులెన్స్‌ను కొనుగోలు చేయడం గాని అధికారులు చేయాలి. అంబులెన్స్ ఉంటే ఆటోనగర్‌లోని కార్మికులకు వైద్య సేవలు అందుతాయి. ప్రమాదం సంభవిస్తే ప్రాథమిక వైద్యసేవలకు అంబులెన్స్ అవసరం. ఈదిశగా ఏపీఐఐసీ అధికారులు కృషిచేయాలి.

\- రాజనాల వెంకటరమణారావు, అధ్యక్షుడు, ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్

అంబులెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దాతలు ఇచ్చిన అంబులెన్స్‌ను సక్రమంగా వినియోగించుకోవాలి. దాని ఆలనా, పాలనా కరవై మూలనవేయడం బాధాకరం. ఉన్నతాధికారులు దృష్టి సారించి అంబులెన్స్‌కు మరమ్మతులు చేయించి, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి కార్మికులకు సేవలు అందించాలి.

\- అబ్దుల్ కలాం, అధ్యక్షుడు, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్, జవహర్ ఆటోనగర్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఈగల్ టీం అధికారులు, కళాశాల అధ్యాపకులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

యువతకు ఈగల్ టీం సీఐ ఎం.రవీంద్ర హితవు

లబ్బీపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసైతే జీవితంలో ఎప్పటికి కోలుకోలేరని ఈగల్ టీం సీఐ ఎం.రవీంద్ర తెలిపారు. నలంద కళాశాలలో మంగళవారం నలంద కళాశాల, ఈగల్ టీం సంయుక్త ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌రహిత సమాజాన్ని స్థాపించడంలో యువత ప్రధాన పాత్ర వహించాలని అన్నారు. నో డ్రగ్స్ నో టెన్షన్స్ ఇదే మీ సక్సెస్ మంత్రం అని, మీరు దూరంగా ఉండడమే కాకుండా మీతోటి వారిని, చుట్టుపక్కల వారిని కూడా డ్రగ్స్ కు దూరంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని విద్యార్థుకు సూచించారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ఈగల్ టీమ్ ఎస్ఐ ఎం. వీరాంజనేయులు, డి.నాగార్జునలు ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ, వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా సాగుతున్న సుపరిపాలనలో తొలి అడుగు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

భారతీనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ఐదు వారాలుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి కాలనీలోని ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు. ఇందుకు కారణం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలేనన్నారు. రానున్న నాలుగేళ్లలో కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని తెలిపారు.

19 ఏళ్ల వరకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి

కలెక్టర్ జి.లక్ష్మీశ



ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ జి.లక్ష్మీశ

బెంజిసర్కిల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పిల్లలు, కిశోర బాలల్లో రక్తహీనత, పోషకాల లోపాలకు నులి పురుగులు కారణమవుతాయని, ఆల్బెండజోల్ మాత్రను తీసుకోవడం వల్ల ఆదిలోనే వాటిని నిర్మూలించవచ్చని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం పటమటలంకలోని కొమ్మాసీతారామయ్య జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నారులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నులిపురుగుల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. చదువుపైనా, సమగ్ర వికాసంపైన ప్రతికూల ప్రభావం చూపుతుందని వెల్లడించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వచ్చే వరకు అందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఆర్‌కేఎస్‌కే, ఐఈసీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ నిర్మలా, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని, పీడియాట్రిషన్ డాక్టర్ రవితేజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవి, హెచ్ పద్మలత తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో సంకట హర గణేశుడికి అర్చన



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సంకటహర చతుర్థితిథి సందర్భంగా మంగళవారం గణపతికి విశేష అర్చన నిర్వహించారు. గణపతికి అభిషేకం, అర్చన, హోమాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రతినెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమంలో ఈవో వి.కె. శీనానాయక్ ప్రత్యేకంగా పాల్గొని పూజలు చేశారు.

ఎస్ఆర్ఆర్ కాలేజీలో హర్ ఘర్ తిరంగా

- కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడికి సన్మానం



స్వాతంత్ర్య సమరయోధుడు శంకరరావును సన్మానిస్తున్న యువజన సర్వీసుల శాఖ సభ్యులు

మాచవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ అండ్ సీనియర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడు భోగిపర్తి శంకరరావును సన్మానించారు. యువజన సర్వీసులు శాఖ సీఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఉమ్మడి కృష్ణా జిల్లాలో స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని గాంధీవాదిగా పేరుతెచ్చుకున్న గొప్పవ్యక్తిని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎన్టీఆర్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యపోరాటాలు చేద్దాం

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ వేదిక

గవర్నర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధమని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ వేదిక చైర్మన్ మధుబాబు, అసోసియేట్ చైర్మన్ బగ్గా జగదీష్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.హరీష్ అన్నారు. ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా ఉద్యోగులు వేర్వేరు మార్గాల్లో సమస్యలపై పోరాడినా ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. పదోన్నతులు, బేసిక్ పే, సీనియారిటీ లిస్ట్ లాంటి కీలక అంశాలపై సమష్టిగా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రావాల్సిన బకాయిలు ఇంకా చెల్లించలేదన్నారు. స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు ఇవ్వలేదని, మల్టిపుల్ ప్రాసెస్ వర్క్ తగ్గించాలని డిమాండ్ చేశారు. పీ-4 సర్వే విషయమై ఉద్యోగులపై అనవసర ఒత్తిడి తెస్తున్నారన్నారు. లక్ష్యాలను పూర్తిచేయని వారికి మెమోలు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొదట వినతిపత్రాల ద్వారా తమ సమస్యలు ప్రభుత్వ దృష్టికి తేస్తామని, స్పందించని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామన్నారు. సమావేశంలో వేదిక ట్రెజరర్ జి.సురేంద్ర, పబ్లిసిటీ సెక్రటరీ పులిబండ్ల నరసింహారావు పాల్గొన్నారు.



విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా

రైల్వేస్టేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. విజయవాడ రైల్వేస్టేషన్ క్లాక్ టవర్ వద్ద నుంచి డీఆర్ఎం మోహిత్ సోనాకియా పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. స్టేషన్ రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా ర్యాలీ సత్యనారాయణపురంలోని ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ జాతీయ కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు సమష్టి భాగస్వామ్యం అవసరమన్నారు. ర్యాలీలో విజయవాడ డివిజన్‌లోని వివిధ విభాగాలకు చెందిన 500 మంది రైల్వే ఉద్యోగులు, స్కౌట్స్, గైడ్స్, జాక్ అండ్ జిల్ స్కూల్ కేంద్రీయ విద్యాలయం నుంచి వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమ్మ తల్లి ప్రతిష్ఠ మహోత్సవం



ఆర్థిక సాయం అందిస్తున్న గద్దె క్రాంతి

కృష్ణలంక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ డివిజన్‌లోని భ్రమరాంబపురంలో అన్నమ్మ తల్లి 28వ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని గద్దె క్రాంతి ఆలయ కమిటీకి అందజేశారు. అన్నదానం నిర్వహించిన కమిటీ సభ్యులను గద్దె క్రాంతి అభినందించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు విజ్జి సన్యాసిరావు, పెద్ది అన్నారావు, పెద్ది పెద్ద అన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



బార్ మాజీ అధ్యక్షుడు గురునాథంకు సత్కారం

విజయవాడ లీగల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) :నల్లకోటు ధరించి నేటికి 50 వసంతాలు నిండాయని, ఈ న్యాయవాద వృత్తిలో పరిపూర్ణమైన సంతృప్తిని పొందానని బార్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వి.గురునాథం తెలిపారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వృత్తిని చేపట్టి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బెజవాడ బార్ న్యాయవాదులు గురునాథంను మంగళవారం సత్కరించారు. బార్ అధ్యక్షుడు ఏకే భాషా మాట్లాడుతూ గురునాథం తమ లాంటి న్యాయవాదులకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, పిళ్లా శ్రీనివాసరావు, పడవల ఏడుకొండలు, వేముల శ్రీనివాసరావు, కండెల వరప్రసాద్, ముద్దాడ సత్యనారాయణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

వన్‌టౌన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించటంపై సీఎం చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం పశ్చిమలో ఎంపీ కేశినేని చిన్ని క్యాంపు కార్యాలయంలో పాలాభిషేకం నిర్వహించారు. చేనేత కార్మికుల హ్యాండ్‌లూమ్‌కు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయటం హర్షణీయమన్నారు. నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు సుకాసి సరిత, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సోలంకి రాజు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా, ఈగల సాంబ, బడుగు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌కు మానవ వనరులే కీలకం



వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

బెంజిసర్కిల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వికసిత భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి అద్భుత మేథో సంపత్తితో పాటు విలువైన మానవ వనరులే కీలకమని కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. మేరీస్ స్టెల్లా కళాశాల సమావేశ హాలులో మంగళవారం జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యం లో హ్యూమన్ క్యాపిటల్ ఫర్ వికసిత్ భారత్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ , భావిభారత పౌరులైన చిన్నారుల సమగ్రాభివృద్ధికి సరైన ప్రణాళికలతో సమిష్టి కృషి అవసరమన్నారు. వికసిత భారత్ లక్ష్యాలను చేరుకునేందుకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. 2047 నాటికి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టాలనే గొప్ప లక్ష్యంతో రూపొందిన వికసిత్ భారత్ దార్శనికత లక్ష్యాలను సాధించేందుకు అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి అవసరమన్నారు. జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

కలెక్టరేట్ : స్వాతంత్ర్య దిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దిన వేడుకల తుది ఏర్పాట్లను మంగళవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో కలెక్టర్ లక్ష్మీశ, నగర పోలీసు కమిషనర్ ఎస్వీ. రాజశేఖరబాబుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు నగరపాలక సంస్థ, సాధారణ పరిపాలన శాఖ, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీసు, ఫైర్ శాఖలతో సమన్వయం చేసుకొని ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి వేడుకలకు ప్రణాళికాబద్ధంగా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు కేటాయించిన విధులను తు.చ తప్పకుండా పాటించాలన్నారు. సామాన్య ప్రజలకు, వీఐపీలు, వీవీఐపీలకు ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు ఉండాలన్నారు. వాహనాలకు కేటాయించిన పార్కింగ్ ప్రదేశాన్ని మరోసారి పరిశీలించి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో ఆర్డీవో కె.చైతన్య, అదనపు సీపీ కె.జి.వి.సరిత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తామంటూ కలెక్టర్‌కు ప్రమాణపత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

పీ-4లో భాగస్వాములవుతాం

● గాయత్రీ వొడాటెక్, కృష్ణా ఇంజనీరింగ్ వర్క్స్, డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ సంసిద్ధత

కలెక్టరేట్ : సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా ప్రారంభించిన పీ-4 విధానంలో తాము భాగస్వాములమవుతామని గాయత్రీ వొడాటెక్, కృష్ణా ఇంజనీరింగ్ వర్క్స్, డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశను మంగళవారం కలిసి తమ ఆసక్తిని తెలియజేశారు. గాయత్రీ వొడా టెక్ నిర్వాహకులు జి.వరప్రసాద్, తాను భవానీపురం ప్రాంతం హెచ్‌బీ కాలనీలోని 113 బంగారు కుటుంబాలకు మార్గదర్శిగా వ్యవహరిస్తానని వివరించారు. కృష్ణా ఇంజనీరింగ్ వర్క్స్ యజమాని బి.రాజశేఖర్ ఎనికేపాడులో 149 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చారు. డెవీ న్యూ లైఫ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అమిత్ జిందాల్ 37 కుటుంబాలను దత్తత తీసుకొని చేయూతనిస్తానని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే 4,669 మంది మార్గదర్శులు 37,780 కుటుంబాలను దత్తత తీసుకొన్నట్లు వివరించారు. పేదలు ఎప్పటికీ పేదలుగానే ఉండిపోకుండా వారూ అన్ని విధాలా ఎదిగి మనతో పాటు నడిస్తే ఆ ఆనందాన్ని వెలకట్టలేమన్నారు. పీ-4 లో మేము సైతం అంటూ స్వచ్ఛందంగా ముందుకొచ్చిన గాయత్రీ వొడాటెక్, కృష్ణా ఇంజినీరింగ్ వర్క్స్, డెవీ న్యూ లైఫ్ యజమాన్యాలకు కలెక్టర్ లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీతోనే బీసీలకు మేలు

గన్నవరం ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక లేమితో ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ హామీలను అమలుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గీత కార్మికులకు మద్యం షాపులు, బార్లలో 10 శాతం కేటాయించడంపై మంగళవారం టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మో హన్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 340 షాపులను గీత కార్మికులకు కేటాయించడం హర్షణీయమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. గీత కార్మికులకు కేటాయించిన షాపులను సద్వినియోగం చేసుకోవాలని, ఇతరులకు విక్రయించవద్దని సూచన చేశారు. టీడీపీ మండల కార్యదర్శి బోడపాటి రవికుమార్, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు, కొండేటి కొండలరావు, పలగాని రాజబాబు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయ్యాల రాజేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, మేడేపల్లి రమ, కొలుసు రవీంద్ర కుమార్, గొడ్డళ్ళ చిన్న రామారావు, మోర్ల నాగబాబు పాల్గొన్నారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆగిరిపల్లి వైపు జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను మంగళవారం రాత్రి అధికారులతో కలసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పరిశీలించారు. పనులు మ రింత వేగవంతం చేయాలని ఆదేశించారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



రికవరీ చేసిన ఫోన్లను యజమానులకు అందజేస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు

సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

600 ఫోన్ల రికవరీ : సీపీ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు అధైర్య పడకుండా అందుబాటులోని సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఐఐఆర్) సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు. ఇటీవల కాలంలో చోరీకి గురైన రూ.70 లక్షలు విలువ చేసే 600 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి, కమాండ్ కంట్రోల్ రూం వద్ద వాటి య జమానులకు మంగళవారం అందజేశారు. మొబైల్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా, సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసి, సంబంధిత పత్రాలను సైబర్ పోలీసులకు అందజేయాలని సీపీ రాజశేఖరబాబు ప్రజలకు సూచించారు. సదరు వివరాలను సైబర్ పోలీసులు టీఎస్‌పీ (టెలికాం సర్వీస్ ప్రొవైడర్)కు అందజేస్తారన్నా రు. ఐఎంఈఐ నెంబర్ బ్లాక్ చేసిన తరువాత ఆ ఫోన్‌ను వాడుతున్న వ్యక్తి నుంచి రికవరీ చేయ డం జరగుతుందన్నారు. తాజాగా రికవరీ చేసిన 600 ఫోన్‌లలో ఏపీలోని వ్యక్తు ల నుంచి 504, ఒడిస్సా నుంచి 20, కర్ణాటక నుంచి 18, మహారాష్ట్ర నుంచి 16, రాజస్థాన్ నుంచి 13, ఉత్తరప్రదేశ్ నుంచి 12, బీహార్ నుంచి 10, పశ్చిమబెంగాల్ నుంచి ఏడు ఉన్నాయని వెల్లడించారు. డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావ, సైబర్ క్రైం ఏసీపీ బి.రాజశేఖర్ పాల్గొన్నారు.



యూరియా కోసం నార్తువల్లూరు పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు



మొవ్వ సొసైటీ వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

అన్నదాతల ఆగ్రహావేశాలు

● పీఏసీఎస్‌లకు అరకొరగా యూరియా ● మొవ్వ, నార్తు వల్లూరు పీఏసీఎస్‌ల వద్ద రైతుల ఆందోళన

కూచిపూడి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులకు ఆగచాట్లు తప్పటం లేదు. ఎరువుల దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. సబ్సిడీ రేటుకు దొరుకుతుందని సొసైటీలకు వెళ్తే అరకొరగా అందజేస్తున్నారని, కొన్ని సొసైటీల ద్వారానే విక్రయాలు జరిపి అది కూడా సంఘ పరిధిలోని రైతులకు మాత్రమే అమ్మకా లు చేస్తుంటే మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మొవ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి యూరియా దిగుమతి అయిందని తెలియటంతో మంగళవారం రైతులు బారులు తీరారు. యూరియా అరకొరగా అందించటంపై రైతు లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నానో యూరియా కొంటేనే యూరియా అందిస్తామని సొసైటీల్లో సైతం మెలిక పెట్టడం ఎంత వరకు పద్ధతి అని రైతులు వాపోతున్నారు. నానో యూరియా లీటరు రూ.250లు, కూలీల ఖర్చు రూ.400లు కలపి రూ.650 అవ్వటం రైతులకు భారం కాదా? అని ప్రశ్నించారు. యూరియాతోపాటు డీఏపీ కూడా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. మొవ్వపాలెం సొసైటీకి 15 రోజుల నుంచి యూరియా అందుబాటులో లేకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రెండో కోటాగా వేయాల్సి ఉండగా, నేటి వరకు ఒక్క కోట కూడా వేయలేదని గూడపాడు గ్రామానికి చెందిన రైతులు అధికారుల ఎదుట వాపోయారు. మొవ్వ సొసైటీకి వచ్చిన యూరియాను సొసైటీ పరిధిలోని రైతులకు మాత్రమే అందించాలని రైతులు ఏడీఏ శ్యామల దృష్టికి తీసుకొచ్చారు. ఎరువుల దుకాణదారులు బ్లాక్ మార్కెట్‌లో బస్తా రూ.450లకు విక్రయాలు జరుపుతున్నట్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకె ళ్లారు. **తోట్లవల్లూరు** : నార్తువల్లూరు పీఏసీఎస్ వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఉదయం 6 గంటలకు ఆధార్ కార్డులు చేతపట్టుకుని యూరియా కోసం రైతులు పీఏసీఎస్ వద్ద బారులు తీరారు. అదే సమయంలో 20 టన్నుల యూరియా లోడుతో లారీ వచ్చింది. యూరియా వచ్చిందని తెలియటంతో రైతులు భారీగా చేరుకున్నారు. యూరియా గోడౌన్‌లోకి దింపిన తరువాత సిబ్బంది విక్రయాలు చేపట్టటంతో రైతులు ఒక్కసారిగా దూసుకు వచ్చారు. దాంతో సిబ్బంది పోలీసులను రప్పించారు. ఐదుగురు పోలీసులు వచ్చినా రైతుల తాకిడి పెరిగిపోవటంతో యూరియా ఇవ్వటం సాధ్యపడదని సిబ్బంది చేతులెత్తేశారు. సిబ్బంది గోడౌన్ తలుపు మూసేయడంతో రైతులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. తిండి, నీళ్లు కూడా లేకుండా నిలబడితే 11 గంటలకు మూసేసి రేపు రమ్మంటే ఎలా అని, కూలి పనులు మానుకుని వచ్చామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావాలి : రత్నాకర్

గాంధీనగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటానికి సిద్ధంగా ఉండాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.రత్నాకర్ మాలలకు పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. వర్గీకరణ పేరుతో దేశవ్యాప్తంగా దళితుల ఐక్యత దెబ్బ తీసే రాజకీయ కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మాలలపై సీఎం చంద్రబాబు పగ తీర్చుకుంటున్నారని, మాజీ సీఎం మాలలకు జరుగుతున్న అన్యాయంపై స్పం దించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజికవర్గాన్ని అణచివేస్తున్నారని, దీనిపై మాల ప్రజాప్రతినిధులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వీరు రాజకీయ పార్టీలకు మాత్రమే విశ్వాసం చూపిస్తున్నారని, జాతి పట్ల విశ్వాసంగా లేరని మండిపడ్డారు. రిజర్వేషన్ ద్వారా లబ్ధి పొం దిన మాల ఉద్యోగులు, మాల ప్రజాప్రతినిధులు మద్దతు తెలపాలని రత్నాకర్ కోరారు.



పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

● సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు

బస్‌స్టేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఈనెల 15వ తేదీన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న నేపథ్యంలో విజయవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో బందోబస్తు ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో జరగనున్న ఈ కార్యక్రమంపై అధికారులు, సిబ్బందికి ఆయన తగు సూచనలు చేశారు. భద్రతా పరంగా ఏ చిన్నపాటి లోపం కూడా లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు పార్కింగ్ ప్రదేశాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. డీసీపీ ఎస్.వి.డి ప్రసాద్, సౌత్ ఏసీపీ పవన్ కుమార్, ఇతర ఏసీపీలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



డీఎస్సీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జంపాన సుధాకర్

ప్రతిభ కోచింగ్ సెంటర్ అభ్యర్థుల సత్తా

● స్టేట్ ర్యాంకుతో పాటు 300 మందికి ఉద్యోగాలు

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలోని ప్రతిభ కోచింగ్ సెంటర్ అభ్యర్థులు డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభను చాటారు. కోచింగ్ సెంటర్ అభ్యర్థి స్టేట్ ర్యాంకు సాధించడంతో పాటు 300 మందికి పైగా అభ్యర్థులు ఉద్యోగాలు పొందుతారని కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జంపాన సుధాకర్ తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన అభ్యర్థులకు అత్యధిక మార్కులు రావడం సంతోషంగా ఉందన్నారు. శిక్షణ విషయంలో రాజీ పడలేదని, అభ్యర్థులకు ఏ అధ్యాపకుడు నచ్చకపోయినట్టు సమాచారం అందించినా వారిని వెంటనే మార్చే వారమన్నారు. అందువల్లే ఎక్కువ మంది అభ్యర్థులు తమ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకోవడంతో పాటు వారి మన్ననలు పొందగలుగుతున్నామన్నారు. కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులందరూ మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ జట్టు

మైలవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన కొల్లేరు గ్రూప్ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. కొల్లేరు గ్రూపు నుంచి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. లీగ్ పద్ధతిలో నిర్వహించిన పోటీల్లో కృష్ణా, ఏలూరు, గోదావరి జట్లపై ఎన్టీఆర్ జిల్లా జట్టు విజయం సాధిం చి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఎల్బీఆర్‌సీఈ కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ జట్ల కోచ్‌లు పి.రవికుమార్, ఎమ్.సాయికిరణ్, బుజ్జి, కృష్ణా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సురేష్, ఏలూరు జిల్లా కార్యదర్శి జి.పవన్ పాల్గొన్నారు. కొల్లేరు గ్రూప్ విజేతలుగా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా జట్టు ఈనెల 16, 17 తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని కోచ్‌లు తెలిపారు.

వినాయక చవితి నాటికి సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్

విజయవాడ (బస్‌స్టేషన్), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నాటికి ఆర్టీసీ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఆందోళనలు ఉధృతం చేస్తామని ఎంప్లాయీస్ యూనియన్ తెలిపింది. ఐదేళ్ల క్రితం ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయినప్పటికీ సమస్యలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయని యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు అలానే నిలిచిపోయాయని 2022 నుంచి రిటైర్ అయి చనిపోయిన వారికి లీవ్ ఎన్‌క్యాష్ డబ్బులు ఇంతవరకు రాలేదని, 2024 డిసెంబరు నుంచి ఇప్పటి వరకు గ్రాట్యుటీ డబ్బులు పడలేదని వెల్లడించారు. 11వ పీఆర్‌సీకి చెందిన 24 నెలల బకాయిలు, డీఏ బకాయిలతో పాటు నాలుగు కొత్త డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐదేళ్లుగా పదోన్నతులు పెండింగ్‌లో ఉంచారన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 4, 5 తేదీల్లో ధర్నాలు నిర్వహించినట్టు తెలిపారు. విజయవాడలో విలువైన గవర్నర్‌పేట 1, 2 డిపోలకు చెందిన రూ.400 కోట్ల విలువ చేసే స్థలాలను లులూ మాల్‌కు కేటాయిస్తూ జారీ చేసిన 137 జీవోను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27 తరువాత రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

గన్నవరం విమానాశ్రయంలో నృత్య ప్రదర్శన

గన్నవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. నటరాజ్ డ్యాన్స్ స్కూల్ చిన్నారులు స్వాతం త్ర్య ఫలాలు అందరికి అందాలంటూ ప్రదర్శన చేశారు. చిన్నారుల ప్రదర్శన ప్రయాణికులను ఆకట్టుకుంది. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ విమానాశ్రయంలో చక్కటి సాంస్కృతిక ప్రదర్శన చేయటం అభినందనీయమన్నారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. నటరాజ్ డ్యాన్స్ స్కూల్ మాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి



మాట్లాడుతున్న నటి అనుపమా పరమేశ్వరన్

ఎంతో కష్టపడి నటించా

● నటి అనుపమా పరమేశ్వరన్
● బెజవాడలో పరదా యూనిట్ సందడి

సత్యనారాయణపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరంలో పరదా చిత్రం యూనిట్ మంగళవారం సందడి చేసింది. ప్రమోషన్‌లో భాగంగా సత్యనారాయణపురంలోని అలేఖ్యా బాంకెట్ హాల్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశా రు. హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ, తాను చాలా కష్టపడి చేశానంటూ కంటతడి పెట్టుకుంది. లేడీ ఓరియంటెడ్ పాత్రలో మొదటిసారిగా నటించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ చిత్రాన్ని థియేటర్లకు వచ్చి చూడాలని కోరారు. పరదా కథ వినగానే చాలా ఎమోషనల్ అయ్యానని, నటించేటప్పుడూ అంతే ఎమోషనల్ అయ్యానని తెలిపారు. ప్రతి హీరోయిన్ ఇలాంటి క్యారెక్టర్ కావాలని కోరుకుంటుందన్నారు. దర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల మాట్లాడుతూ పరదా చిత్రం ట్రైలర్‌కి ఇప్పటికే విశేష స్పందన లభించిందన్నారు. పరదా చిత్రానికి రామ్‌చరణ్ ట్రైలర్ లాంచ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి మనిషికి మాస్క్ ఉంటుందని, దాన్ని తొలగిస్తే మనిషి జీవితం ఎలా ఉంటుందో, ఈ చిత్రం అలా ఉంటుందని వివరించారు. ముగ్గురు హీరోయిన్లతో ఈ చిత్రం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కథ రాసుకున్నప్పుడే అనుపమ పరమేశ్వరన్ మా త్రమే ఈ క్యారెక్టర్ కి న్యాయం చేయగలరని నమ్మినట్లు చెప్పారు. ఈ చిత్రం లో రాజేంద్రప్రసాద్, గౌతమ్ మీనన్ ముఖ్యపాత్రలు పోషించారని వివరించారు.

నందిగామ మున్సిపల్ కమిషనర్‌పై వైసీపీ నాయకుల దాడి

● ఖాళీ పేపర్లపై సంతకాలు
● పోలీసులకు ఫిర్యాదు

నందిగామ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకులు తనపై దాడికి దిగారని నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మెయిన్ బజారులోని వైఎస్సార్ విగ్రహాన్ని కౌన్సిల్ ఆమోదంతో తొలగించడం జరిగిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో సోమవారం 17 మంది వైసీపీ నాయకులు తన చాంబర్‌లోకి చొచ్చుకొచ్చారని తెలిపారు. వైఎస్ విగ్రహాన్ని తొలగిస్తావా? నీ అంతు చూస్తామం టూ బెదిరించి, తనతో ఖాళీ పేపర్‌పై సంతకాలు చేయించుకున్నారని, తన సిబ్బందిని దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాకుబ్ ఆలీ, షేక్ మస్తాన్, పాములపాటి కిరణ్, ఆవుల విజయ్, కొరుసు కొండ, షేక్ సుభాని, తెలగా సత్యనారాయణ, షేక్ మున్నా, బెజవాడ రాజశేఖర్, బెజవాడ కార్తీక్, ముvvల శ్రీను, అనుమోలు పార్థ, నల్లమల్లి మురళి, షేక్ బాజీ, బొలినేని శ్రీనివాస్ తదితరులు తనతో సంతకాలు చేయించుకున్న ఖాళీ పేపర్‌ను తనకు ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వై.వి.ఎల్.నాయుడు తెలిపారు.

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి రద్దు

● దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ(ఎస్‌జీఎఫ్‌ఓఎస్) పదవిని రద్దు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే రెండేళ్లకు(2025-26, 2026-27) అండర్-14, 17 విభాగాల్లో ఆర్గనైజింగ్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్/పీఈటీలు) ఈ నెల 20 లోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీలుగా పనిచేసిన, ప్రస్తు తం చేస్తున్న స్కూలు అసిస్టెంటు, పీఈటీలు, జూనియర్ లెక్చరర్లు(పీఈటీ విభాగం) కూడా కొత్త నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో తెలిపారు. అభ్యర్థులకు కచ్చితంగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని, అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ పోస్టుకు ఎంపికైన అభ్యర్థికి వెంటనే పాత పోస్టు రద్దవుతుందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో సం బంధిత అధికారి నుంచి క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొన్న వారు అనర్హులని ఆయన తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆసక్తి ఉంటే పూర్తి వివరాలు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి అనుమతితో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి సమర్పించాలన్నారు.

నాగుల్‌మీరా, మరుపిళ్ల, రమణారావులకు అభినందనలు

● ఎమ్మెల్యే సుజనాచౌదరి

విద్యాధరపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లకు చైర్మన్‌లుగా నియమితులైన వారు తమ పదవులను బాధ్యతగా భావించాలని విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి మంగళవారం ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా, ఏపీ నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మరుపిళ్ల తిరుమలేశ్వరరావు, ఏపీ నాగవంశం సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ యర్రబోతు రమణారావులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

ఫ్యాషన్

రక్షణనిచ్చే రెయిన్ కోట్స్

రెయిన్ కోట్లు వానకు తడవకుండా రక్షణ కల్పించడమే కాదు, సౌకర్యవంతంగా, ఆకట్టుకునేలా ఉండాలి. కాబట్టే నేడు రెయిన్‌కోట్లలో పలు రకాల పోకడలు పుట్టుకొచ్చాయి. వాటి గురించి తెలుసుకుందాం!











వేర్వేరు రకాల రెయిన్‌కోట్స్ వేర్వేరు స్థాయుల్లో వానల నుంచి రక్షణ కల్పిస్తాయి. అవేంటంటే...

- **పాంచోస్:** ఇవి వదులుగా ఉంటాయి. ధరించడం కూడా తేలికే! పైనుంచి మోకాళ్ల వరకూ పొడవుండే ఈ రెయిన్‌కోట్స్‌కు హుడీ కూడా ఉంటుంది. భారీ వర్షంలో తల తడవకుండా ఉండడానికి ఈ ఏర్పాటు ఎంతో బాగా ఉపయోగపడుతుంది
- **రెయిన్ జాకెట్:** ఇవి పొట్టిగా, నడుము లేదా పిరుదుల వరకూ ఉంటాయి. తేలికగా ఉండే ఈ రెయిన్ జాకెట్స్ ధరించడం కూడా సులువే! వీటిని అందుకుని, చటుక్కున వేసేసుకోవచ్చు
- **వాటర్‌ప్రూఫ్ రెయిన్‌కోట్స్:** ఇవి నీటిని ఫ్యాబ్రిక్ గుండా లోపలకు చొరబడనివ్వవు. కుండపోత వర్షాల కోసం రూపొందిన ఈ రెయిన్‌కోట్స్, ఎక్కువసేపు కురిసే వానల నుంచి రక్షణనిస్తాయి
- **వాటర్ రెసిస్టెంట్ రెయిన్‌కోట్స్:** ఇవి తేలికపాటి వర్షాలు, తక్కువ సమయం పాటు కురిసే వానల నుంచి రక్షణ కల్పిస్తాయి. వాన కురిసే సమయం పెరిగితే, ఇవి తేమను పీల్చుకోవడం మొదలుపెడతాయి
- **వాటర్ రిపెల్లెంట్ రెయిన్‌కోట్స్:** వీటికి ప్రత్యేకమైన కోటింగ్ ఉంటుంది. దాని వల్ల నీరు రెయిన్‌కోట్ మీద నిలవదు. వీటి మీద డిడబ్ల్యుఆర్ (డ్యూరబుల్ వాటర్ రిపెల్లెంట్) అనే అక్షరాలు ముద్రించి ఉంటాయి. వాటిని వెతికి కొనుక్కోవాలి.
- **బ్రీతబుల్ రెయిన్‌కోట్స్:** ఈ రెయిన్‌కోట్స్ వాన నీటిని అడ్డుకోవడంతో పాటు, లోపలి నుంచి వేడి, తేమలు బయటకువెళ్లేలా చేస్తాయి. ఇవి రెయిన్‌కోట్ లోపల వేడి పెరగకుండా, చమట పట్టకుండా నియంత్రిస్తాయి.

దోమకాటు నుంచి పిల్లలకు రక్షణ ఇలా...

వానాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. వీటివల్ల పిల్లలకు చర్మ సంబంధిత అలెర్జీలు, రకరకాల వ్యాధులు వస్తూ ఉంటాయి. అలాకాకుండా చిన్నారులను దోమలబారి నుంచి ఎలా కాపాడాలో తెలుసుకుందాం...



- చిన్న పిల్లలకు పొడవు చేతులు ఉన్న షర్టులు, ప్యాంట్లు వేయాలి. ముదురు రంగులు దోమలను ఆకర్షిస్తాయి. కాబట్టి పిల్లలకు లేత రంగుల బట్టలు వేయాలి. చేతులకు, పాదాలకు నిర్దేశిత సాక్స్‌లు వేయడం మంచిది.
- మస్కిటో రిపెల్లెంట్ బ్యాడ్జెస్, పెండెంట్స్ ప్యాచెస్‌లను పిల్లలు వేసుకున్న డ్రెస్‌లకు జతచేయాలి. వీటిలో ఉండే యూకలిప్టస్, నిమ్మ, వేప, సిట్రోనెల్లా నూనెలు గాఢమైన వాసనలను వెదజల్లుతాయి. దీంతో దోమలు.. పిల్లల నుంచి దూరంగా వెళ్లిపోతాయి. ఈ నూనెలు సహజసిద్ధమైనవి. వీటి వల్ల పిల్లలకు ఎటువంటి అపాయమూ ఉండదు.
- దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు, తలుపులకు మ్యాగ్నెటిక్ మస్కిటో స్క్రీన్‌లు లేదంటే మెష్‌లను ఏర్పాటు చేయాలి.
- పిల్లలు నిద్రిస్తున్నప్పుడు వాళ్లపై నెట్ గొడుగులు ఉంచాలి. మంచానికి దోమతెరను కట్టినా ప్రయోజనం ఉంటుంది.
- గదుల్లో, బాల్కనీల్లో సిట్రోనెల్లా, లావెండర్, బంతి పూల మొక్కల కుండీలు ఏర్పాటు చేస్తే దోమలు వెంటనే బయటికి వెళ్లిపోతాయి.

కూరలో కారం ఎక్కువైందా?

ఒక్కోసారి కూరలో కారం ఎక్కువ అవుతూ ఉంటుంది. అలాంటి సందర్భాల్లో చిన్న చిట్కాలు పాటించి కూరను సరిచేయవచ్చు.



- కూర ఉన్న గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు వేడిచేయాలి. ఇందులో ఒక చెంచా శనగపిండి, కొన్ని నీళ్ల చుక్కలు చల్లి కలిపితే కారం తగ్గుతుంది. చివరలో ఉప్పు సరిచూసుకోవాలి.
- కూరలో ఒక చెంచా వెనిగర్ లేదంటే నిమ్మరసం కలిపితే కారం తగ్గుతుంది. కొద్దిగా చింతపండు గుజ్జు కలిపినాకూడా మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఒక ఆలుగడ్డను ఉడికించి తొక్క తీసి వేళ్లతో చిదిమి కూరలో వేసి కలిపితే కారం తగ్గుతుంది. చిటికెడు ఉప్పు చల్లితే కమ్మని రుచి వస్తుంది.
- సన్నగా తరిగిన కేరట్ ముక్కలు లేదంటే కొన్ని పచ్చి బఠాణీలు వేసి కొన్ని నీళ్లు చల్లి అయిదు నిమిషాలు కూరని ఉడికిస్తే కారం తగ్గుతుంది.
- స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక చెంచా నూనె వేసి వేడిచేయాలి. రెండు టమాటాలను సన్నగా తరిగి అందులో వేసి కలపాలి. చిటికెడు ఉప్పు చల్లి మగ్గనివ్వాలి. తరవాత చల్లార్చి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని కూరలో కలిపితే కారం తగ్గి చక్కని రుచి వస్తుంది.
- కొత్తిమీర, చుక్కకూర లేదంటే పాలకూర ఆకులను సన్నగా తరిగి కూరలో కలిపి స్టవ్ మీద పెట్టి అయిదు నిమిషాలు మగ్గిస్తే కారం తగ్గుతుంది.
- కొబ్బరి పాలు, వెన్న, పాల మీగడ, పెరుగు, పచ్చి కొబ్బరి తురుం, పుట్నాలపప్పు పొడి, బ్రెడ్ ముక్కలు, పన్నీరు ముక్కలు లాంటివి వేసి కలిపినా ప్రయోజనం ఉంటుంది.

విజేత

విజయం ఆమెకు దాసోహమయింది

సాధించాలన్న తపన... పట్టుదలగా ప్రయత్నించే తత్వం... ఇవే ఆమెను శిఖరం వైపు అడుగులు వేయించాయి. మానసిక వైకల్యాన్ని అధిగమించి... జాతీయ స్థాయి 'బోసీ బాల్' పోటీల్లో విజేతగా నిలిపాయి. ఎస్ తన్మయ్ శ్రీదేవి... విభిన్నమైన క్రీడలో విశేషంగా రాణిస్తున్న ఈ సెకండ్ ఇంటర్ విద్యార్థిని జర్నీ 'నవ్య' పాఠకుల కోసం...

పశ్చిమగోదావరి జిల్లా... పెంటపాడు పోస్ట్ బేసిక్ పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది ఎస్ తన్మయ్ శ్రీదేవి. బాల్యం నుంచే మానసిక సమస్యతో ఇబ్బంది పడుతోంది. ఎవరితో ఎక్కువగా మాట్లాడటానికి ఇష్టపడదు. బాగా నచ్చితేనే మాట కలుపుతుంది. కానీ ఒక పనిని ఇష్టపడితే అది పూర్తయ్యే వరకు వదిలిపెట్టదు. ఆ పట్టుదలే ఆమెను నేడు నలుగురిలో గొప్పగా నిలిపింది. ఆటలో అత్యుత్తమంగా రాణించేందుకు దోహదపడింది.

అమ్మ, అమ్మమ్మ అండతో...

తన్మయ్ పరిస్థితిని అర్థం చేసుకున్న తల్లి సుగుణ.. చిన్నప్పటి నుంచీ అన్నింటా బిడ్డను వెన్నంటి ఉంటున్నారు. తాత, అమ్మమ్మలు కూడా అండగా నిలిచారు. తమ చిన్నారి అందరి పిల్లల్లా చదువుకోవాలని, ఆటపాటల్లో రాణించాలని కోరుకున్నారు. తద్వారా తన్మయ్ మానసిక పరిస్థితిలో కొంతైనా మార్పు వస్తుందని భావించారు. అందుకే తన్మయ్‌ను క్రమం తప్పకుండా బడికి పంపించారు. తనకు కావల్సినవన్నీ సమకూర్చుతున్నారు. "మా అమ్మాయి పుట్టినప్పుడు తనకు మానసిక సమస్య ఉందని మాకు తెలియదు. కొంచెం ఎదిగిన తరువాత తన ప్రవర్తన భిన్నంగా అనిపించింది. వైద్యులను సంప్రదిస్తే... తన్మయ్‌కి మానసిక సమస్య ఉందని చెప్పారు. అయినా నేను నిరుత్సాహపడలేదు. అందరు పిల్లల్లానే మా అమ్మాయి కూడా రోజు బడికి వెళ్లి బాగా చదువుకోవాలని కోరుకున్నాను. మా అమ్మానాన్నలు కూడా నాకు అండగా నిలిచారు. మొదట్లో తన్మయ్ స్కూల్‌కు వెళ్లేందుకు ఇష్టపడేది కాదు. ఎలాగో నచ్చజెప్పి పంపించేవాళ్లం. నిదానంగా తను బడికి అలవాటు పడింది" అంటూ తన్మయ్ తల్లి సుగుణ నాటి రోజులు గుర్తు చేసుకున్నారు.

కోచ్ సహకారంతో...

చదువుతో పాటు తన్మయ్‌ను ఏదైనా ఆటలో పెడితే బాగుంటుందని ఆమె తల్లి భావించారు. కోచ్ సాయి స్వరూపను కలిశారు. ఆమె బోసీ బాల్‌లో శిక్షణ ఇస్తారు. కానీ తొలుత తన్మయ్ ఆటలపై ఆసక్తి చూపలేదు. "తన్మయ్‌ని ఈ ఆటలోకి దింపడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఆడటానికి మొదట్లో తను అస్సలు ఇష్టపడలేదు. ఎన్నో ప్రయత్నాల తరువాత చివరకు తనను ఒప్పించాను. వైకల్యం ఉన్నవారిలో ఒక ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దాన్ని వెలికి తీసి సాన పెడితే... వారూ మెరికల్లా తయారవుతారు. నేను చేసింది అదే. ఎప్పుడైతే తన్మయ్ సాధన ప్రారంభించిందో... అప్పటి నుంచీ వెనక్కి తగ్గలేదు. ఎంతో క్రమశిక్షణతో నేర్చుకుంది. ఆమెలో నైపుణ్యం గమనించి... మండల స్థాయి పోటీలకు పంపించాం. అక్కడ రాణించడంతో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లింది. విజయాలు సాధించింది. మానసిక పరిపక్వత లేని ఒక అమ్మాయి అసాధారణ ప్రతిభతో ఆకట్టుకుంటోంది. నిజంగా ఇది గొప్ప విషయం"... అంటారు కోచ్ సాయిస్వరూప.



చాలా ఆనందంగా ఉంది...

నాకు చిన్నప్పటి నుంచీ స్కూల్‌కు వెళ్లడం ఇష్టం ఉండేది కాదు. మా అమ్మ, అమ్మమ్మ, తాతయ్య నన్ను బలవంతంగా బడికి పంపించేవారు. స్కూల్‌లోనే నేను ఈ ఆట నేర్చుకున్నాను. మా కోచ్ నన్ను బాగా చూసుకునేవారు. ఎంత విసిగించినా నన్ను ఒక్క మాట కూడా అనేవారు కాదు. నేను కూడా బాగా కష్టపడి సాధన చేశాను. అందుకే ఇప్పుడు ఇంతటి విజయాన్ని సాధించగలిగాను.

- తన్మయ్ శ్రీదేవి



తన్మయ్‌కి శిక్షణ ఇస్తున్న కోచ్ సాయిస్వరూప



జాతీయ స్థాయిలో...

అంతటితో తన్మయ్ ప్రయాణం ఆగిపోలేదు. రాష్ట్ర స్థాయిలో సత్తా చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అందరి సహకారంతో మరింత ఉత్సాహంగా సాధన చేసింది. అనంతరం ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్‌లోని 'అటల్ బిహారీ వాజ్‌పేయి యూనివర్సిటీ'లో జరిగిన జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. మొత్తం 22 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు ఇందులో పోటీపడ్డారు. వారందరినీ దాటి విజేతగా అవతరించి, స్వర్ణ పతకం సాధించింది తన్మయ్.

"నా కూతురు గెలుపు చూసి ఎంతో ఉద్వేగానికి లోనయ్యాను. మాటలు రావడంలేదు. ఈ విజయం అస్సలు ఊహించలేదు. ఒక తల్లిగా ఇంతకు మించిన సంతోషం నాకు ఏముంటుంది! మా అమ్మాయికి ఎల్లవేళలా మద్దతుగా నిలిచిన మా అమ్మానాన్నల రుణం తీర్చుకోలేనిది. అంతర్జాతీయ వేదికపై నా కూతుర్ని చూడాలన్నది నా కోరిక. త్వరలోనే అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను" అంటూ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు సుగుణ.

ఏమిటీ 'బోసీ బాల్'..?

'బోసీ బాల్ అనేది ఒక ఇటాలియన్ క్రీడ. దీన్ని ఎవరైనా ఆడచ్చు. 'స్పెషల్ ఒలింపిక్స్' ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం దీన్ని నిర్వహిస్తుంది. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపి, సామాజికంగా ఎదిగేలా ప్రోత్సహిస్తుంది. ఈ గేమ్‌లో ముందుగా టాస్ గెలిచిన అభ్యర్థి తనకు నచ్చిన బోసీ బాల్ రంగును ఎంచుకోవాలి. తరువాత 'పలినా' (టార్గెట్ బాల్) అనే తెల్ల బాల్‌కు సాధ్యమైనంత చేరువగా త్రో చేయాలి. తమకు కేటాయించిన నాలుగు బాల్స్‌ను ఇలా తెల్ల బాల్‌కు దగ్గరగా వేయాలి. ఎవరైతే అత్యంత చేరువగా వేస్తారో వాళ్లను విజేతగా ప్రకటిస్తారు.

● ఎం.సతీశ్, పెంటపాడు

స్ఫూర్తి

అమెరికాలో మన తుపాకుల రాణి

గన్స్, పిస్టల్స్, రైఫిల్స్... ఈ పేర్లు వినగానే అమ్మాయిలు ఉలిక్కిపడతారు. కానీ చండీగఢ్‌కు చెందిన అనహద్ సింగ్ కోహ్లీకి ఇవే క్రీడా వస్తువులు. స్వదేశంలో షూటింగ్ మీద పట్టు పెంచుకున్న ఈ 16 ఏళ్ల బాలిక, అమెరికాలో పతకాల పంట పండిస్తోంది. ఒలింపిక్స్‌లో పతకాల మీద గురి పెట్టిన అనహద్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి...



అమెరికాలో పుట్టిన అనహద్ మూడేళ్ల వయసులో తల్లితండ్రులతో భారత్‌లోని స్వస్థలం చండీగఢ్‌కు చేరుకుంది. అప్పటి నుంచి గత మూడేళ్ల వరకూ అక్కడే ఉండిపోయిన అనహద్, త్రినేత్ర షూటింగ్ అకాడమీలో కోచ్, అర్పిత్ ఠాకూర్ ఆధ్వర్యంలో షూటింగ్‌లో శిక్షణ పొందింది. ఆ తర్వాత 2022లో అమెరికాకు వెళ్లిపోయి, స్వదేశంలో తీసుకున్న శిక్షణ సహాయంతో, అమెరికాలోని లఫాయిట్ గన్ క్లబ్‌లో షూటింగ్ నైపుణ్యాలను పెంచుకోగలిగే అర్హత సాధించింది. 1948లో వర్జీనియాలోని గ్రాఫ్టన్‌లో నెలకొల్పిన 28 ఎకరాల విస్తీర్ణంలోని ఈ గన్ క్లబ్‌కు దేశవ్యాప్తంగా మంచి పేరుంది. ఇక్కడ తీసుకున్న శిక్షణతో, సాల్వో ఓపెన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె స్వర్ణ పతకాన్ని గెలుచుకోగలిగింది. "అమెరికాలో నేనెన్ని పతకాలను గెలుచుకున్నప్పటికీ, సాల్వో ఓపెన్ మెడల్ గెలుచుకోవడం నాకెంతో సంతృప్తినిచ్చింది. అమెరికాలో షూటింగ్ ప్రతిభను, మెలకువలను మెరుగుపరుచుకోవడం నాకొక గొప్ప అనుభవం" అంటూ ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది.

అమ్మ స్ఫూర్తితో...

శిమ్లాలో అనహద్ తాతయ్యకు తుపాకుల దుకాణం ఉండేది. అలాగే అనహద్ తల్లికి కూడా పిస్టల్‌ను షూట్ చేయడం తెలుసు. తుపాకీ పేల్చే తల్లిని చూసిన అనహద్ క్రమేపీ తుపాకుల మీద ఇష్టాన్ని పెంచుకుంది. అలాగే తాతయ్య దుకాణంలో కనిపించే పిస్టల్స్, గన్స్‌తో ప్రేమలో పడిపోయింది. అలా అనహద్, బాల్యంలో సంగ్రూర్‌లో స్టాండింగ్ 60 షాట్ ప్రెసిషన్ ఎయిర్ రైఫిల్ లేదా త్రీ పొజిషన్ ఎయిర్ రైఫిల్, స్మాల్ బోర్ పాయింట్ 22 షూటింగ్ పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టింది. ఆ పోటీల గురించి గుర్తు చేసుకుంటూ.. "పిస్టల్ ఉపయోగించే ఆలోచనే నన్నెంతో ఆకర్షించింది. ఆ దృశ్యాలు ఇప్పటికీ నా కళ్ల ముందు మెదులుతూ ఉంటాయి. షూటింగ్‌లో మా అమ్మను ఆదర్శంగా తీసుకోడానికి అదొక కారణం" అని చెప్పుకొచ్చింది. అనహద్ కుటుంబంలో ఆమెకూ, ఆమె తల్లికీ మినహా మరెవరికీ తుపాకీల పట్ల ఆసక్తి లేదు. వాళ్ల కుటుంబంలో ఏ ఒక్కరూ షూటింగ్ క్రీడలో పాలుపంచుకోలేదు. ఆ విషయం గురించి మాట్లాడుతూ.. "ఇది ప్రణాళికాబద్ధంగా ఎంచుకున్న క్రీడ కాదు. ఇదంతా యాధృచ్ఛికంగా జరిగిపోయింది. పంజాబ్ సందర్శించినప్పుడు, ఆసక్తికొద్దీ అకాడమీలో కొన్ని షాట్స్ పేల్చాను. ఆ సమయంలో అక్కడున్న కోచ్, నాకు ఆ క్రీడ నేర్పించమని నాన్నను అడిగారు. అంతే, అప్పటి నుంచీ నాకు వెనక్కి తిరిగి చూసుకోవలసిన అవసరం రాలేదు. ప్రస్తుతం అమెరికాలో జూనియర్ రిజర్వ్ ఆఫీసర్స్ ట్రైనింగ్ కార్ప్స్‌కు చెందిన నేను, అలబామాలోని ఆనిస్టన్‌లో జరిగిన యుస్ నేవీ జెఆర్ఓటిసి జాతీయ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించాను. సాల్వో ఓపెన్ షూటింగ్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్నాను. ముున్ముందు ఈ క్రీడలో ఇంతకంటే మెరుగ్గా రాణిస్తాననే ఆశిస్తున్నా" అంటోంది.

షూటర్ లేదా పైలట్

మూడేళ్ల వయసులో భారత్‌కు తిరిగొచ్చి, పదేళ్ల పాటు షూటింగ్ నేర్చుకుని అమెరికాలోని వర్జీనియాకు తిరిగెళ్లిపోయిన అనహద్.. "భారత్‌లో కోచ్ అర్పిత్‌లాగే, ఇక్కడ యుఎస్ నేవీ వెటరన్, జేసన్, కోచ్, మైక్‌ల ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాను. నిజానికి భారత్‌లోనే ఈ క్రీడలో పైకి ఎదగాలనుకున్నాను. కానీ నేను అమెరికాలోనే పుట్టాను. కాబట్టి ఇక్కడికే తిరిగొచ్చేశాను" అంటూ వివరిస్తోంది. అమెరికాలో షూటర్లు నిలబడి తుపాకీ పేల్చడం కష్టంగా భావిస్తారు. కానీ పడుకుని, మోకాళ్ల మీద కూర్చుని తుపాకీ పేల్చడం కంటే నిలబడి పేల్చడమే తనకు సులువనిపిస్తోందని అంటోందామె. "అందరు క్రీడాకారుల్లాగే నాక్కూడా ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించాలని ఉంది. భౌతికంగా నేను అమెరికన్‌నే అయినా నా మనసంతా భారతీయమే! ప్రస్తుతం అమెరికాలోని జూనియర్ ఒలింపిక్స్ అగ్ర 30 షూటర్లలో నేను నాల్గో ర్యాంకును పొందాను. ముున్ముందు భారత్ గర్వించదగిన షూటర్‌గా ఎదగాలని అనుకుంటున్నాను" అని అంటోంది అనహిద్. ప్రస్తుతం నేవీ నేషన్స్‌లో నాల్గవ స్థానంలో ఉన్న అనహద్, షూటర్‌గా ఎదుగుతాననీ లేదంటే, యుఎస్ఎ సైన్యంలో షూటర్‌గా లేదా కమర్షియల్ పైలట్‌గా ఎదుగుతాననీ అంటోంది. "షూటింగ్ నా తొలి ప్రేమ. గన్స్, పిస్టల్స్, రైఫిల్స్ నన్నెంతో ఆకట్టుకుంటూ ఉంటాయి. కాబట్టి ఈ క్రీడలో ఎదగడం కోసం శాయశక్తులా కృషి చేస్తాను. లేదంటే, కమర్షియల్ పైలట్‌గా మారతాను" అని అంటోంది.

వంటకు ఏ నూనె వాడాలి..?

మనం ఇంట్లో రకరకాల వేపుళ్లతోపాటు పూరీ, వడ, పకోడీ లాంటి అల్పాహార వంటలు చేస్తూ ఉంటాం. వీటికి ఎక్కువగా నూనెను వినియోగించాల్సి ఉంటుంది. బజార్లో దొరికే నూనెలన్నింటినీ వంటకు ఉపయోగించడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. వంటకు ఏ నూనె ఆరోగ్యకరమో తెలుసుకుందాం...



- సమోసాలు, బజ్జీలు లాంటి డీప్ ఫ్రై వంటకాలు చేయడానికి పల్లీల నూనెను ఉపయోగించాలి. ఈ నూనెకు అత్యధిక స్మోక్ పాయింట్ ఉంటుంది. అంటే ఎక్కువగా వేడిచేసినప్పటికీ ఈ నూనె త్వరగా విచ్ఛిన్నం కాదు. దానిలోని పోషకాలు నశించవు. అలాగే హానికారక పదార్థాలు ఉత్పత్తి కావు. రైస్ బ్రాన్ ఆయిల్, అవకాడో ఆయిల్ కూడా ఈ కోవలోకే వస్తాయి.
- రోజువారీ చేసే కూరలు, పచ్చళ్ల కోసం ఆవ నూనెను వాడడం మంచిది. ఇది పసుపు, నలుపు రంగుల్లో లభిస్తుంది. రెండూ ఆరోగ్యానికి మంచివే. ఈ నూనెలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు, న్యూట్రియెంట్స్ యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. దీన్ని వాడడం వల్ల వంటకాలకు మంచి రుచి, సువాసన చేకూరుతాయి.
- బజార్లో దొరికే రకరకాల రిఫైన్డ్ నూనెలు, పామాయిల్ లాంటి వాటిని వంటకు ఉపయోగించకూడదు. వీటిని ఎక్కువగా ప్రాసెస్ చేస్తూ ఉంటారు. కాబట్టి వీటివల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది. గుండె జబ్బులు, జీర్ణ సంబంధిత వ్యాధులు, పలు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.

గమనిక

మంగళవారం 'డాక్టర్' పేజీలో 'మనలో 40 మందికి క్యాన్సర్' అనే శీర్షికతో వచ్చిన వార్తలో- '40 శాతం మంది వారి జీవితంలో క్యాన్సర్ బారిన పడుతూ ఉంటారు' అని పొరపాటున ప్రచురితమయింది.

రాజ్యసభలోనూ పాస్


క్రీడా బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: చారిత్రక జాతీయ క్రీడా పాలన బిల్లుకు ఉభయ సభల ఆమోదం లభించింది. లోక్‌సభలో నెగ్గిన 24 గంటల తర్వాత రాజ్యసభలో కూడా బిల్లు పాసైంది. రాష్ట్రపతి ఆమోదంతో త్వరలో చట్టరూపం దాల్చనుంది. జాతీయ డోపింగ్ నిరోధక సవరణ బిల్లుకు కూడా పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణకు నిరసనగా విపక్షాలు వాకౌట్ చేసిన సమయంలో కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ బిల్లును మంగళవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. '20 దేశాల్లో క్రీడా చట్టాలున్నాయి. భారత్‌ను 21వ దేశంగా నిలపమని కోరుతున్నా'నని సభలో చర్చ సందర్భంగా మాండవీయ వ్యాఖ్యానించారు. కొత్త బిల్లు కారణంగా పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. అంతేకానీ ప్రభుత్వ నియంత్రణ, జోక్యం ఏమాత్రం ఉండవని స్పష్టం చేశారు. అయితే, ప్రభుత్వం బలప్రదర్శనతో బిల్లును పాస్ చేసుకొందని కాంగ్రెస్ పార్టీ నేత జైరాం రమేష్ విమర్శించారు. ఇది బీసీసీఐకి మేలు చేసేలా ఉందని ఎక్స్‌లో పోస్టు చేశారు.

సరైన దిశగా..

క్రీడా బిల్లును భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, ఎంపీ పీటీ ఉష స్వాగతించింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్ బిడ్ వేసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో సరైన దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొంది. ఈ క్షణం కోసమే తాను ఎదురుచూస్తున్నట్టు సభలో తెలిపింది. దేశ క్రీడా రంగంలో నూతన బిల్లు ఓ మైలురాయి అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కే ప్రశంసించాడు.

ఏజీఎం వరకు పదవిలో బిన్నీ..



బీసీసీఐ అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ సెప్టెంబరు వరకు ఆ పదవిలో కొనసాగనున్నాడు. గతనెలలోనే బిన్నీకి 70 ఏళ్లు నిండాయి. అయితే, కొత్త క్రీడా బిల్లులో 75 ఏళ్ల వరకు వెసులుబాటు కల్పించారు. దీంతో సెప్టెంబరులో జరిగే వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) వరకు అతడి పదవికి ఢోకా లేదు. ఒకవేళ బోర్డు పెద్దల ఆశీస్సులుంటే మరోసారి కూడా అధ్యక్షుడిగా కొనసాగే అవకాశం ఉందని బోర్డు వర్గాలు తెలిపాయి. 2022 అక్టోబరులో సౌరభ్ గంగూలీ స్థానంలో బిన్నీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాడు.



గిల్ రాకతో.. సంజూకు చోటెక్కడ?

టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఆసియాకప్ టీ20 జట్టులో చోటు దక్కడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. దీంతో అతను ఏడాది విరామం తర్వాత పొట్టి ఫార్మాట్ ఆడబోతుండడంతో పాటు జట్టు వైస్ కెప్టెన్‌గానూ మారే అవకాశం ఉంది. అయితే, తన కెరీర్‌లో ఆడిన 21 మ్యాచ్‌ల్లో గిల్ ఓపెనర్‌గానే బరిలోకి దిగాడు. దీంతో ఆసియాకప్‌లోనూ అతను అభిషేక్ శర్మకు జతగా ఇన్నింగ్స్ ఆరంభించవచ్చు. అదే జరిగితే ఇప్పటిదాకా ఓపెనర్‌గా ఆడుతున్న సంజూ శాంసన్ పరిస్థితి ఏమిటన్న చర్చ మొదలైంది. భారత్ తరఫున 14 టీ20ల్లో టాపార్డర్‌లో బరిలోకి దిగిన శాంసన్ 182.20 స్ట్రయిక్ రేట్‌తో 512 పరుగులు సాధించాడు. అంతేకాకుండా ఓ క్యాలెండర్ ఏడాదిలో భారత్ తరఫున మూడు సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. ఇవన్నీ అతను ఓపెనర్‌గా సాధించినవే. ఇలాంటి నేపథ్యంలో శాంసన్‌ను మరో స్థానంలో ఆడించడం ఎంతమేరకు సబబనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

మూడో స్థానం తప్పదా?

శాంసన్ కెరీర్‌లో భారత్ తరఫున మూడు టీ20ల్లో మాత్రమే వన్‌డౌన్‌లో దిగాడు. అయితే ఓవరాల్‌గా ఈ ఫార్మాట్‌లో అతడికి మూడో స్థానంలో 133 ఇన్నింగ్స్ ఆడిన అనుభవముంది. 3 సెంచరీలతో 4,136 పరుగులు సాధించాడు. అందుకే ఆసియాకప్‌లో గిల్, అభిషేక్‌తో ఓపెనింగ్ చేయిస్తే ఆ తర్వాత స్థానంలో శాంసన్‌ను ఆడించడం ఉత్తమం. లేని పక్షంలో అతడికి బెర్త్ కష్టమే అవుతుంది. సహజంగా కెప్టెన్ సూర్యకుమార్ నెంబర్ 4లో వస్తుంటాడు. తిలక్, హార్దిక్ ఆ తర్వాత వస్తారు కాబట్టి శాంసన్‌కు ఓపెనర్‌గా కాకుంటే వన్‌డౌన్ స్థానమే సరిపోతుంది. ఇక, ఈ టోర్నీ కోసం శాంసన్ తన సన్నాహకాలను ఆరంభించాడు. మంగళవారం తిరువనంతపురంలోని ఓ స్టేడియంలో కేరళ పోలీసులతో కలిసి ప్రాక్టీస్ చేసిన ఫోటోను ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

నాలుగోసారి ఐసీసీ అవార్డు



శుభ్‌మన్ రికార్డు

న్యూఢిల్లీ: ఇటీవలి ఇంగ్లండ్ పర్యటనలో పరుగుల వరద పారించిన టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. జులై నెలకుగాను గిల్ ఈ అవార్డును అందుకోనున్నాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్‌లను అధిగమించి గిల్ ఈ పురస్కారాన్ని దక్కించుకున్నాడు. ఇక, ఈ అవార్డుకు ఎంపికవడం గిల్‌కిది నాలుగోసారి. ఈ క్రమంలో అత్యధికసార్లు అవార్డు గెలుచుకున్న తొలి క్రికెటర్‌గా గిల్ సరికొత్త రికార్డు సృష్టించాడు.

కారు కొన్నాడు కానీ..

ఆకాశ్‌కు రవాణా శాఖ నోటీస్



లఖ్‌నవూ: భారత పేసర్ ఆకాశ్‌దీప్ ఎంతో ఇష్టపడి కొనుక్కున్న ఫార్చ్యూనర్ కారు కారణంగా వివాదంలో చిక్కుకున్నాడు. హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్ లేకుండానే ఆ వాహనాన్ని తిప్పుతున్నందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ అతడికి నోటీస్ జారీ చేసింది. నిబంధనల ప్రకారం ప్రతీ కొత్త వాహనం హై సెక్యూరిటీ నెంబర్‌ప్లేట్‌తోనే బయటికి రావాలి. మరోవైపు కారును రిజిస్ట్రేషన్ లేకుండానే అప్పగించినందుకు డీలర్ సన్నీ మోటార్స్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయడంతో పాటు నెలరోజుల నిషేధం విధించింది.

హారికకు తొలి గెలుపు

'చెన్నై' చెస్‌లో అర్జున్‌కు డ్రా

చెన్నై: చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్‌లో ద్రోణవల్లి హారిక తొలి గెలుపును నమోదు చేయగా.. అర్జున్ ఇరిగేసికి మరో డ్రా ఎదురైంది. మంగళవారం జరిగిన ఓపెన్ ఆరో రౌండ్‌లో విన్సెంట్ కీమర్ (జర్మనీ)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. నిహాల్ సరీన్, ప్రణవ్ పరాజయం పాలయ్యారు. ఆరు రౌండ్లు ముగిసే సరికి అర్జున్ 3.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. చాలెంజర్స్ విభాగంలో సహచర జీఎం వైశాలిపై హారిక నెగ్గింది. ఆరు రౌండ్లలో హారికకు ఇదే మొదటి విజయం కావడం విశేషం.

బిహార్ క్రికెట్ సంఘం అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ నాగేశ్వర రావు

న్యూఢిల్లీ: రిటైర్డ్ జడ్జి లావు నాగేశ్వర రావును బిహార్ క్రికెట్ సంఘం (బీసీఏ) అంబుడ్స్‌మన్‌గా సుప్రీం కోర్టు నియమించింది. బీసీఏలోని కొందరు ఆఫీస్ బేరర్లు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణల కేసుపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఆ రాష్ట్ర సంఘంలో క్రికెట్ కార్యకలాపాలు సవ్యంగా సాగేందుకు వీలుగా నాగేశ్వర రావు నియామకంపై ఆదేశాలు జారీ చేస్తున్నట్టు తెలిపింది. గతంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం కూడా అవినీతి సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు క్రికెట్ కార్యకలాపాల నిర్వహణ కోసం నాగేశ్వర రావు నేతృత్వంలో ఏకసభ్య కమిటీని సుప్రీం కోర్టు నియమించిన సంగతి తెలిసిందే.

బ్రేవిస్ మెరుపు శతకం

● రెండో టీ20లో ఆసీస్‌పై దక్షిణాఫ్రికా గెలుపు



డార్విన్ (ఆస్ట్రేలియా): టీ20 ఫార్మాట్‌లో ఆస్ట్రేలియా జైత్రయాత్రకు బ్రేక్ పడింది. మంగళవారం జరిగిన రెండో టీ20లో యువ బ్యాటర్ డివాల్డ్ బ్రేవిస్ (56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 125 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. దీంతో ఆసీస్‌పై 53 పరుగులతో దక్షిణాఫ్రికా ఘనవిజయం సాధించింది. అలాగే ఆరు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలవగా, ఆసీస్‌కు తొమ్మిది వరుస టీ20 విజయాల తర్వాత ఇదే తొలి ఓటమి. అటు సఫారీలు కూడా ఆరు మ్యాచ్‌ల తర్వాత ఆసీస్‌పై నెగ్గారు. ముందుగా దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 218/7 స్కోరు సాధించింది. 41 బంతుల్లోనే శతకం బాదిన బ్రేవిస్ తమ జట్టు తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. అంతేగాక టీ20ల్లో సఫారీల తరఫున పలు రికార్డులను నెలకొల్పాడు. ఛేదనలో ఆసీస్ 17.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. టిమ్ డేవిడ్ (50) మాత్రమే రాణించాడు. బాష్, మఫాకలకు మూడేసి వికెట్లు దక్కాయి.

దీప్తి @ 2

ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్



దుబాయ్: టీమిండియా స్టార్ దీప్తి శర్మ ఐసీసీ మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో బౌలర్‌గా అగ్రస్థానానికి చేరేందుకు అడుగు దూరంలో నిలిచింది. మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో దీప్తి ఓ స్థానం మెరుగుపరచుకొని 732 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌కు ఎగబాకింది. ఇక, ఆస్ట్రేలియాకు చెందిన అనబెల్ సదర్లాండ్ (736) నెంబర్ వన్‌గా నిలిచింది. ఆల్‌రౌండర్లలో దీప్తి శర్మ మూడో ర్యాంక్‌లో నిలిచింది. హేలీ మాథ్యూస్ టాప్ ఆల్‌రౌండర్‌గా ఉంది. బ్యాటర్ల జాబితాలో స్మృతీ మంధాన నెంబర్‌వన్ నుంచి రెండో ర్యాంక్‌కు పడిపోయింది. నాట్ సివర్ బ్రంట్ (ఇంగ్లండ్) టాప్ బ్యాటర్‌గా చోటు దక్కించుకుంది.

'అమరావతి' అదుర్స్

ఆంధ్ర ప్రీమియర్ లీగ్

విశాఖపట్నం-స్పోర్ట్స్(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో అమరావతి రాయల్స్ వరుస విజయాలతో దూసుకెళ్తోంది. మంగళవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భీమవరం బుల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్లతో గెలిచింది. తొలుత భీమవరం జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లకు 191 పరుగులు చేసింది. ఓపెనర్లు హిమకర్ (81), రేవంత్‌రెడ్డి (69) తొలి వికెట్‌కు 137 రన్స్ జోడించారు. ఛేదనలో అమరావతి 19.4 ఓవర్లలో 193/7 స్కోరు చేసి నెగ్గింది. రాహుల్ అర్ధ సెంచరీ (52) చేయగా, కెప్టెన్ విహారి (37), విజయ్ (36 నాటౌట్) రాణించారు. తపస్వి 4 వికెట్లు తీశాడు.

హనీష్ సెంచరీ.. లయన్స్ పంజా

మరో మ్యాచ్‌లో సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు 8 వికెట్లతో విజయవాడ సన్‌షైనర్స్‌ను ఓడించింది. తొలుత విజయవాడ 20 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. అనంతరం సింహాద్రి 17.1 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని (186) ఛేదించింది. హనీష్ రెడ్డి సెంచరీ (60 బంతుల్లో 104 పరుగులు) చేశాడు.

ప్రేయసితో రొనాల్డో నిశ్చితార్థం





రియాద్: ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తన చిరకాల ప్రేయసి జార్జినా రోడ్రిగ్వెజ్‌తో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఈ విషయాన్ని జార్జినా సోషల్ మీడియా ద్వారా మంగళవారం ప్రకటించింది. నిశ్చితార్థం సందర్భంగా రొనాల్డో తనకు తొడిగిన ఉంగరం ఫొటోను 31 ఏళ్ల జార్జినా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. తొలిసారిగా 2016లో మాడ్రిడ్‌లోని ఓ షాప్‌లో కలుసుకున్న వీరిద్దరు.. అప్పటినుంచి కలిసే ఉంటున్నారు. కానీ, ఇన్నాళ్లకు తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించారు. రొనాల్డో ద్వారా జార్జినా ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. కాగా, 40 ఏళ్ల రొనాల్డోకు మరో ముగ్గురు సంతానం ఉన్నారు. వీరిలో ఒకరు రొనాల్డో మొదటి భార్యకు జన్మించగా.. మరో ఇద్దరిని రొనాల్డో సరోగసి ద్వారా కన్నాడు. మొత్తం ఐదుగురు పిల్లలు రొనాల్డో, జార్జినా వద్దే పెరుగుతున్నారు.

బిజినెస్

ఆర్‌సీ ప్లాస్టో నుంచి ట్యాంక్ స్టాండ్



హైదరాబాద్: వాటర్ స్టోరేజీ సొల్యూషన్స్ సంస్థ ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ లిమిటెడ్.. మార్కెట్లోకి ప్లాస్టో ట్యాంక్ స్టాండ్‌ను తీసుకువచ్చింది. వాటర్ ట్యాంకుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఈ స్టాండ్‌లను డిజైన్ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. సాంప్రదాయ సిమెంట్ స్టాండ్స్‌తో ట్యాంక్ పగిలిపోవటం, నీరు లీకేజీ కావటంతో పాటు ట్యాంక్ చుట్టుపక్కల చెత్తా చెదారం పేరుకుపోతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వంద శాతం ఫుడ్ గ్రేడ్ ప్లాస్టిక్‌తో ప్లాస్టో ట్యాంక్ స్టాండ్‌ను డిజైన్ చేసినట్లు తెలిపింది. ఏడు అంగుళాల ఎత్తుతో కూడిన ఈ స్టాండ్‌తో ట్యాంక్ కింది భాగంపై ఎలాంటి ఒత్తిడి పడదని పేర్కొంది. అంతేకాకుండా ట్యాంక్ చుట్టుపక్కల శుభ్రంగా ఉంచవచ్చని తెలిపింది. పదేళ్ల వారంటీతో కూడిన ఈ స్టాండ్ దేశవ్యాప్తంగా ఉన్న ప్లాస్టో డీలర్ల వద్ద అందుబాటులో ఉంటుందని ఆర్‌సీ ప్లాస్టో వెల్లడించింది.

తగ్గిన నాట్కో లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.480 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం లాభం రూ.668 కోట్లతో పోల్చితే 28 శాతం క్షీణించింది. అమెరికా ఉత్పత్తుల పోర్టుఫోలియోపై ధరల ఒత్తిడి, ఆర్ అండ్ డీ వ్యయాలు గణనీయంగా పెరగటం కంపెనీ పనితీరుపై ప్రభావం చూపించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.1,410 కోట్ల నుంచి రూ.1,390 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో కంపెనీ ఏపీఐ వ్యాపారం రూ.52.6 కోట్లుగా ఉండగా దేశీయ ఫార్ములేషన్స్ వ్యాపారం రూ.107 కోట్లు, ఫార్ములేషన్స్ ఎగుమతులు రూ.1,126.50 కోట్లుగా ఉన్నాయి. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ బోర్డు రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.



అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల్లో అంబానీలదే హవా

రూ.28 లక్షల కోట్లతో అగ్రస్థానం.. దేశ జీడీపీలో 12 శాతానికి సమానం

అదానీ గ్రూప్ రూ.14 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో పోలిస్తే డబుల్..

జాబితాలో 14 తెలుగు కుటుంబ వ్యాపారాలు.. బార్‌క్లేస్-హురున్ సంయుక్త నివేదిక విడుదల

అత్యంత విలువైన 300 ఫ్యామిలీ బిజినెస్‌ల మొత్తం విలువ రూ.134 లక్షల కోట్లు

ముంబై: ఈ ఏడాదికి గాను దేశంలోని తొలి తరం పారిశ్రామికవేత్తలు, వారసులకు చెందిన అత్యంత విలువైన కుటుంబ వ్యాపారాల జాబితా మంగళవారం విడుదలైంది. బార్‌క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్, హురున్ ఇండియా సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదిక ప్రకారం.. వారసుల నిర్వహణలోని విలువైన వ్యాపారాల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ కుటుంబానిదే అగ్రస్థానం. అంబానీ కుటుంబ వ్యాపార విలువ రూ.28.23 లక్షల కోట్లు. తొలి తరం కుటుంబ వ్యాపారాల్లో నం.1గా ఉన్న అదానీ గ్రూప్ విలువ రూ.14.01 లక్షల కోట్లతో పోలిస్తే రెండింతలు ఇది. అంతేకాదు, దేశ జీడీపీలో దాదాపు 12 శాతానికి సమానం. ఈ లిస్ట్‌లో అంబానీకి అగ్ర స్థానం లభించడం ఇది రెండోసారి. గత ఏడాదితో పోలిస్తే, ఈ కుటుంబ వ్యాపార విలువ 10 శాతం పెరిగిందని బార్‌క్లేస్-హురున్ రిపోర్టు వెల్లడించింది. ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన కుమార మంగళం బిర్లా కుటుంబం రూ.6.47 లక్షల కోట్ల విలువతో రెండో స్థానంలో ఉండగా.. జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌కు చెందిన జిందాల్ ఫ్యామిలీ రూ.5.71 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉంది. ఈ టాప్-3 కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ రూ.40.4 లక్షల కోట్లు. ఫిలిప్పీన్స్ జీడీపీకి సమానమిది. నివేదికలోని మరిన్ని విషయాలు..

● తొలి తరం కుటుంబ వ్యాపారాల్లో అదానీ గ్రూప్‌నకు చెందిన గౌతమ్ అదానీ ఫ్యామిలీ వరుసగా రెండోసారి నం.1గా నిలిచింది. సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పూనావాలా కుటుంబం రూ.2.3 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో రెండో స్థానంలో ఉంది.

● తెలుగు వారి విషయానికొస్తే.. తొలితరం, మలి తరం నిర్వహణలోని 14 కుటుంబాల వ్యాపారాలకు ఈ జాబితాలో చోటు దక్కింది. మలి తరం విభాగంలో 9, తొలి తరం నిర్వహణలో 5 కుటుంబ వ్యాపారాలున్నాయి. మలి తరం సారథ్య వ్యాపారాల్లో డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన ఫ్యామిలీ, తొలి తరం నాయకుల్లో దివీస్ లేబొరేటరీస్‌కు చెందిన మురళి దివి కుటుంబం అగ్రస్థానాల్లో ఉన్నాయి.

మలి తరం నాయకుల నిర్వహణలోని తెలుగు కుటుంబ వ్యాపారాలు

ర్యాంక్	కుటుంబం	కంపెనీ	విలువ (రూ.కోట్లు)
22	సతీశ్ రెడ్డి, జీవీ ప్రసాద్	డాక్టర్ రెడ్డీస్	1,07,200
104	ప్రసాద్, అశ్విన్ దేవినేని	నవ లిమిటెడ్	17,200
115	శ్రీనివాస్ రెడ్డి, కశ్యప్ రెడ్డి	మేఘ సర్వో డ్రైవ్	14,900
116	ఏ రంగ రాజు	ఎన్‌సీసీ	14,500
121	మహిమ దాట్ల	బయోలాజికల్-ఈ	13,100
143	అల్లూరి ఇంద్ర కుమార్	అవంతి ఫీడ్స్	10,000
157	కేశవ్ రెడ్డి	అరాజెన్ లైఫ్‌సైన్సెస్	8,400
205	రాజు ఫ్యామిలీ	ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్	4,400
243	గుప్తా ఫ్యామిలీ	డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్	3,200
తొలితరం తెలుగు కుటుంబ వ్యాపారాలు			
3	మురళీ దివి	దివీస్ లేబొరేటరీస్	1,80,000
5	ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	1,04,200
6	గ్రంధి మల్లికార్జున రావు	జీఎంఆర్ గ్రూప్	98,300
7	పీపీ రెడ్డి ఫ్యామిలీ	మేఘా ఇంజనీరింగ్	85,300
20	బొల్లినేని భాస్కర్ రావు	కిమ్స్ హాస్పిటల్స్	27,000

● ఈ లిస్ట్‌లోని అత్యంత విలువైన 300 కుటుంబాల సంపద 1.6 లక్షల కోట్ల డాలర్ల (రూ.134 లక్షల కోట్లు) పైమాటే. దేశ జీడీపీలో ఇది 40 శాతానికి సమానం. టర్కీ, ఫిన్లాండ్ దేశాల మొత్తం జీడీపీ కంటే కూడా అధికం. గడిచిన ఏడాది కాలంలో ఈ 300 కుటుంబ వ్యాపారాలు రోజుకు రూ.7,100 కోట్ల సంపదను సృష్టించాయి.

● ఈ 300 వ్యాపారాలు దేశంలో 20 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. అంటే, బహ్రెయిన్ మొత్తం జనాభా కంటే అధికం. కాగా, ఈ కంపెనీలు మొత్తం రూ.1.8 లక్షల కోట్ల పన్నులు చెల్లించాయి. గతసారి వసూలైన మొత్తం కార్పొరేట్ పన్నుల్లో 15 శాతానికి సమానమిది.

● ఈ లిస్ట్‌లోని 74 శాతం కంపెనీలు స్టాక్ మార్కెట్లో నమోదైనవే. రూ.85,800 కోట్ల విలువతో హల్దీరామ్ దేశంలో అత్యంత విలువైన అన్ లిస్టెడ్ కంపెనీగా ఉంది. ఈసారి జాబితాలోని 22 కంపెనీలకు మహిళలు సారథులుగా ఉన్నారు.

● జాబితాలోని కుటుంబ వ్యాపారాల మొత్తం సంపదలో టాప్-10 కంపెనీల వాటాయే దాదాపు 50 శాతం.

● రూ.1.58 లక్షల కోట్ల నెట్‌వర్త్‌తో వాడియా కుటుంబం జాబితాలో అత్యంత సుదీర్ఘ వ్యాపార చరిత్ర కలిగి ఉంది.

ఫార్మా లాజిస్టిక్స్ కోసం సెల్సియస్ ప్లస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టెక్నాలజీ ఆధారిత లాజిస్టిక్స్ సేవలందిస్తున్న సెల్సియస్ కంపెనీ.. ఫార్మా రంగానికి అవసరమైన లాజిస్టిక్స్ అందించడం కోసం సెల్సియస్ ప్లస్ విభాగాన్ని ప్రారంభించింది. సాధారణ లాజిస్టిక్స్‌కి భిన్నంగా ఫార్మా రంగానికి ఉష్ణోగ్రత నియంత్రణ, సకాలంలో గమ్యానికి వస్తువులు చేర్చడం వంటి ప్రత్యేక అవసరాలుంటాయని, అవన్నీ అందించగల సమర్థవంతమైన రవాణా విభాగాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతోనే ఫార్మా ప్లస్‌ను ప్రారంభించామని కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ స్వరూప్ బోస్ తెలిపారు. ఈ విభాగంపై తాము రూ.50 కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలిపారు. 18 నెలల కాలంలో రూ.100 కోట్ల వార్షిక రికరింగ్ ఆదాయం సాధించాలనుకుంటున్నట్లు చెప్పారు.

అపోలో లాభం రూ. 433 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ కన్సాలిడేటెడ్ నికర లాభం 42 శాతం వృద్ధి చెంది రూ.433 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.305 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 15 శాతం వృద్ధితో రూ.5,086 కోట్ల నుంచి రూ.5,842 కోట్లకు పెరిగింది. కీలకమైన హెల్త్‌కేర్ సర్వీసులు, డయాగ్నోస్టిక్స్, డిజిటల్ హెల్త్ వ్యాపారాలు మంచి పనితీరును కనబరచటం ఎంతగానో కలిసి వచ్చిందని అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	114
వరంగల్	100	గుంటూరు	119
కరీంనగర్	100	ఒంగోలు	119
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	93
కర్నూలు	100	నెల్లూరు	98
విశాఖపట్నం	108	అనంతపురం	98
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,400 ▼	92,950 ▼	1,25,000 ▼
విజయవాడ	1,02,800 ▼	96,800 ▼	1,16,600 ▼
విశాఖపట్నం	1,03,040 ▲	93,750 ▼	1,25,000 ▼
రాజమండ్రి	1,01,400 ▼	92,950 ▼	1,17,000 ▼
ప్రొద్దుటూరు	1,00,250 ▼	92,230 ▼	1,17,000 ▼
ముంబై	99,670 ▼	91,298 ▼	1,13,313 ▼

అదానీలపై మోదీ సర్కారు ప్రేమ

సమన్లు అందించడంలో అలసత్వం..అమెరికా ఎస్ఈసీ

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ సర్కారు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన దగ్గరి బంధువు సాగర్ అదానీలపై అలవిమాలిన ప్రేమ చూపిస్తోందని అమెరికా స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్ఈసీ) పరోక్షంగా ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్‌తో సహా కొన్ని రాష్ట్రాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టుల కోసం వీరు ముడుపులు చెల్లించినట్టు వచ్చిన ఆరోపణలపై ఈ ఏడాది ఫిబ్రవరిలో తాము జారీ చేసిన సమన్లను.. మోదీ సర్కారు ఇప్పటికీ వారికి అందజేయలేదని న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు న్యాయమూర్తి జేమ్స్ ఆర్ చో కి ఎస్ఈసీ తెలిపింది. గత ఏడాది నవంబరులో అదానీలపై తాము నమోదు చేసిన కేసుకు సంబంధించిన సమన్లను భారత్‌లో ఉంటున్న అదానీలకు అందజేయాలంటే భారత ప్రభుత్వ సహాయం తప్పనిసరని పేర్కొంది. వీరికి సమన్లు అందజేయమని ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి భారత ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖను కోరుతున్నా ఇప్పటి వరకు ఉలుకూపలుకు లేదని ఎస్ఈసీ కోర్టుకు తెలిపింది.

యూనియన్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): యూనియన్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) మరో సరికొత్త పథకాన్ని ప్రారంభిస్తోంది. 'యూనియన్ డైవర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ ఎఫ్ఓఎఫ్' పేరుతో ప్రారంభిస్తున్న ఈ పథకం సబ్‌స్క్రిప్షన్ వచ్చే నెల 1 నుంచి 15 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ పథకం ద్వారా సమీకరించే నిధుల్లో 80 నుంచి 90 శాతాన్ని లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ ఈక్విటీ పథకాల్లో మదుపు చేయబోతున్నట్టు యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఎండీ, సీఈఓ మధు నాయర్ చెప్పారు. దేశంలో ఒక మ్యూచువల్ ఫండ్ సంస్థ ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్)లో ఈ తరహా పథకాన్ని ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారన్నారు. ఈ పథకంలో పెట్టే పెట్టుబడులను రెండేళ్లకు పైగా ఉంచుకుంటే వచ్చే లాభాలకు దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) కింద 12.5 శాతం మాత్రమే పన్ను వర్తిస్తుందన్నారు.

8 ఏళ్ల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: కూరగాయలు, తృణ ధాన్యాలు సహా పలు ఆహార వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా జూలై నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 8 ఏళ్ల కనిష్ఠ స్థాయి 1.55 శాతానికి దిగి వచ్చింది. ఇది జూన్ నెలలో 2.1% ఉండగా గత ఏడాది జూలైలో 3.6% ఉంది. 2017 జూన్‌లో నమోదైన కనిష్ఠ ద్రవ్యోల్బణం 1.46% తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే.

బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం మళ్లీ నష్టాల్లో ముగిశాయి. రోజంతా తీవ్ర ఊగిసలాటలకు లోనైన సెన్సెక్స్ చివరికి 368.49 పాయింట్ల నష్టంతో 80,235.59 వద్ద స్థిరపడింది. 80,997 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని, 80,164 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసిన సూచీ.. మొత్తంగా 833 పాయింట్ల శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 97.65 పాయింట్లు కోల్పోయి 24,487.40 వద్ద క్లోజైంది.

అర్ధరాత్రి కుండపోత వాన



శ్రీశైలం డ్యాం నాలుగు గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న నీరు

- కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతిభారీ వర్షాలు
- మిగిలిన కోస్తా జిల్లాల్లో భారీ వానలు
- నేడు అల్పపీడనం.. వాయుగుండంగా మారే చాన్స్
- రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు
- శ్రీశైలానికి భారీగా వరద
- 4 గేట్ల ద్వారా నీటి విడుదల

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఉపరితల ఆవర్తనాలు, ద్రోణి ప్రభావంతో మంగళవారం అర్ధరాత్రి రాష్ట్రవ్యాప్తంగా వర్షంకురిసింది. కృష్ణా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అతి భారీ, మిగిలిన కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. చాలాచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. కృష్ణా జిల్లా నాగాయలంకలో 128, బాపట్ల జిల్లా చీరాలలో 121, గుంటూరు జిల్లా పొన్నూరులో 120 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 30 చోట్ల 50 మిల్లీమీటర్లకు మించి వర్షం పడింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బుధవారం పశ్చిమ మధ్య దానికి ఆనుకుని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత రెండు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది వాయుగుండగా మారుతుందని కొన్ని మోడల్స్ పేర్కొన్నాయి. బుధవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. కోస్తా తీరం వెంబడి గాలులు వీస్తుండడం, సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. కోస్తాలో 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

అనంతలో ఉద్యాన పంటలకు నష్టం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచి ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి. కొన్ని చోట్ల నీటి ఉధృతికి కూరగాయల నారు, పంట కొట్టుకుపోయింది. ఉల్లి, మిరప, అరటి, టమోటా, బీర పంటలకు సుమారు రూ.64 లక్షల నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఈ సీజన్‌లో శ్రీశైలం నుంచి మూడోసారి నీటి విడుదల

ఎగువ నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద వస్తోంది. దీంతో జలాశయం నిండుకుండను తలపిస్తోంది. జూరాల, శుంకేసుల, హంద్రీ ల నుంచి మొత్తం 1,57,373 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో అధికారులు మంగళవారం శ్రీశైలం 4 గేట్లను ఎత్తి 1,08,628 క్యూసెక్కులు.. కుడి, ఎడమ గట్టు జల ఉత్పాదన ద్వారా 65,689 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. తెలంగాణలోని కల్వకుర్తికి 800 క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 883 అడుగులకు చేరింది. డ్యాంలో 204.3520 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ సీజన్‌లో మూడోసారి శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశారు.

'సాంఘిక సంక్షేమం'లో విప్లవాత్మక మార్పులు!

- వసతి గృహాల అభివృద్ధికి 300 కోట్లు
- విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- వసతులు, ప్రమాణాల పెంపుపై దృష్టి
- ప్రాంతీయ సదస్సులో అధికారులకు మంత్రి డోలా ఆదేశం




అమరావతి/విజయవాడ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే సాంఘిక సంక్షేమ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని హాస్టళ్ల స్థితిగతులపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. 1,051 హాస్టళ్లలో ప్రస్తుతం 1,12,200 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు, నూతన భవనాల నిర్మాణానికి రూ.107 కోట్లు, మెరుగైన వసతులు కల్పించేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.50 కోట్లు మంజూరైనట్లు వివరించారు. హాస్టల్ విద్యార్థులకు మెరుగైన వసతి, శుభ్రమైన పౌష్టికాహారం అందించడంతో పాటు వారిలో విద్యా ప్రమాణాలను పెంచి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం సూచనల మేరకు సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు నాణ్యమైన బియ్యం అందిస్తున్నామని, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులందరికీ అవసరమైన వస్తు సామగ్రిని సమకూర్చుతున్నామని పేర్కొన్నారు.

లక్ష్యాన్ని నీరుగారిస్తే కఠిన చర్యలు

పేద విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం కోట్ల రూపాయలను మంజూరు చేస్తోందని, ఈ లక్ష్యాన్ని నీరుగార్చేలా ప్రవర్తించే ఉద్యోగులను ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేలా విద్యార్థులకు వసతులు కల్పించి, విద్యా ప్రమాణాలు పెంచాలని, ఈ బాధ్యతను క్షేత్రస్థాయిలోని హెచ్‌డబ్ల్యూవోలు సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అనంతరం హాస్టళ్ల స్థితిగతులపై జిల్లాల వారీగా సమీక్ష చేశారు. ఇటీవల కొన్ని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఆరా తీశారు. విచారణ జరిపి నిజానిజాలు వెల్లడిస్తామన్నారు. రానున్న రోజుల్లో హాస్టళ్లను ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిర్వహణ సక్రమంగా లేకపోతే వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. త్వరలో విశాఖపట్నం, తిరుపతిల్లో కూడా ప్రాంతీయ వర్క్‌షాపులు నిర్వహిస్తామని తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.మల్లికార్జుననాయక్ మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్లకు సూచించారు. ఏఎస్‌డబ్ల్యూవోలు తమ పరిధిలోని హాస్టళ్లను నెలకు రెండుసార్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి, ఆయా జిల్లాలకు చెందిన అధికారులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ప్రపంచానికి తెలియాల్సిన కథ



సత్యదేవ్ కథానాయకుడిగా 'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' ఫేమ్ వెంకటేశ్ మహా తెరకెక్కిస్తున్న చిత్రం 'రావుబహదూర్'. మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి, అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్ర నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్ రాజవంశం నేపథ్యంలో సాగే సైకలాజికల్ డ్రామాగా సినిమా ఉండనుంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేశ్ మహా మాట్లాడుతూ "ప్రపంచానికి తెలియాల్సిన తెలుగువారి కథ ఇది' అని అన్నారు. 'ఓ నటుడిగా ఇలాంటి పాత్రను పోషిస్తుండడం అదృష్టంగా భావిస్తున్నాను' అని హీరో సత్యదేవ్ అన్నారు. ఈ నెల 15న టీజర్‌ను విడుదల చేయనున్నారు మేకర్స్. వచ్చే ఏడాది వేసవికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రజనీకాంత్ కూలీ.. సింగపూర్‌లో సెలవులు



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా, నాగార్జున విలన్‌గా నటించిన 'కూలీ' చిత్రం విడుదలకు అంతా సిద్ధమైంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా మరికొన్ని గంటల్లోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ అంచనాలతో రూపుదిద్దుకున్న ఈ సినిమా కోసం ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. రజనీకాంత్ సినిమా అంటే మనదేశంలోనే కాదు విదేశాల్లో సైతం ఎంతో క్రేజ్ ఉంది. సింగపూర్‌లోని ఓ సంస్థ తమ దగ్గర పని చేసే తమిళ ఉద్యోగులకు 'కూలీ' విడుదల రోజున వేతనంతో కూడిన సెలవు ఇవ్వడం విశేషం. మరో సంస్థ ఇంకో అడుగు ముందుకు వేసి సెలవుతో పాటు 'కూలీ' సినిమా టికెట్, థియేటర్‌లో స్నాక్స్ కొనుక్కోవడం కోసం 30 సింగపూర్ డాలర్లు ఇవ్వడం ఇంకా విశేషం. అలాగే 'కూలీ' సినిమా చూడడం కోసం ఎస్‌బీ మార్ట్ సంస్థ అధినేత కృష్ణప్రకాశ్ నంబియార్ తన షాపు గురువారం ఉదయం ఏడు గంటల నుంచి పదకొండున్నర వరకూ మూసి ఉంటుందని ముందే బోర్డు పెట్టేశారు. రజనీకాంత్ ఫ్యాన్ ఫాలోయింగ్ అలా ఉంటుంది మరి!

ఆయనను పారితోషికంతో కొనలేం

- త్రివిక్రమ్ శ్రీనివాస్



'సినీ పరిశ్రమలో ఆర్.నారాయణ మూర్తిది సుదీర్ఘ ప్రయాణం. కథాలోచన నుంచి సినిమాని ప్రేక్షకుడి వద్దకు తీసుకెళ్లే వరకూ ఆయన ఒక్కరే శ్రమిస్తారు. తాను తీసే ప్రతి సినిమాలోనూ ఏదో ఒక ప్రయోజనం ఉండాలనుకుంటారు. ఓ సినిమాలోని పాత్రకు నారాయణమూర్తిని అనుకున్నా. కానీ, పారితోషికంతో ఆయనను కొనలేం అని ఎవరో చెప్పారు' అని అన్నారు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. నారాయణ మూర్తి కొత్త చిత్రం 'యూనివర్సిటీ పేపర్ లీక్' చిత్రాన్ని ప్రసాద్ ల్యాబ్స్‌లో త్రివిక్రమ్ చూశారు. అనంతరం మాట్లాడుతూ 'ఈ చిత్రంలోని అంశాలు వెంటనే ఉత్తేజపరచవు. అయినప్పటికీ పట్టువిడవకుండా నడిపించారు. నిజాయతీతో పనిచేశారు. అది ఆయన సొంతం. దాని కోసమే నేను వచ్చాను. రాజీపడకుండా బతకడం అందరికీ సాధ్యం కాదు. నేను చాలా సార్లు రాజీపడ్డా' అని అన్నారు. ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'నాకు, త్రివిక్రమ్‌కు మధ్య ఎలాంటి ఆబ్లిగేషన్స్ లేవు. నా పట్ల, నా సినిమా పట్ల ఆయనకు అభిమానం ఉంది. 'యూనివర్సిటీ పేపర్ లీక్' చూసి దాన్ని ప్రేక్షకులకు చేరువయ్యేలా చేయాలని కోరా. నా విజ్ఞప్తిని మన్నించి, సినిమాను చూసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని అన్నారు.

ధనుష్ మంచి మిత్రుడు మాత్రమే..

- మృణాల్ ఠాకూర్



తమిళ హీరో ధనుష్‌తో హీరోయిన్ మృణాల్ ఠాకూర్ రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై స్పందించారు మృణాల్. ధనుష్ తనకు కేవలం మంచి మిత్రుడు మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే, 'సన్నాఫ్ సర్దార్ 2' స్ర్కీనింగ్‌కు ధనుష్, అజయ్ దేవగణ్ కోరిక మేరకు వచ్చారని తెలిపారు. కాగా, ధనుష్, మృణాల్ ఇటీవల పలు సందర్భాల్లో కలసి కనిపించడంతో ఈ ఊహాగానాలు ఊపందుకున్నాయి.

ఇలాంటి చిత్రాలు మరెన్నో రావాలి



సముద్ర శివిక, సుప్రియ, నవీన్ మట్టా, రోహిల్, ఆదిల్, రూపేశ్ కీలక పాత్రధారులుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అన్నపూర్ణ తల్లి బువమ్మ'. సురేశ్ లంకపల్లి దర్శకత్వంలో సిరాజ్, ఖాదర్ గోరి నిర్మిస్తున్నారు. చిత్ర షూటింగ్ పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 'అన్నపూర్ణమ్మ అయిన డొక్కా సీతమ్మ గురించి ఇంతకు ముందు ఎవరికీ పెద్దగా తెలియదు. పవన్ కల్యాణ్ వల్ల ఆమె పేరు ఇప్పుడు అందరికీ తెలిసింది. ఇలాంటి ఆదర్శవంతమైన చిత్రాలు నేటి సమాజానికి అవసరం' అని అన్నారు. డొక్కా సీతమ్మ పాత్రధారి శివిక మాట్లాడుతూ 'నా తొలి చిత్రమిది. అద్భుతమైన పాత్ర ఇచ్చారు. న్యాయం చేశాననే అనుకుంటున్నా' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు సురేశ్ లంకలపల్లి, నిర్మాతలు సిరాజ్, ఖాదర్ గోరి, రాధికాదిపతి దాస్ ప్రభు, సాయి విజయేందర్ సింగ్ తదితరులు మాట్లాడారు.

ఒక రోజు ఆలస్యంగా భేటీ

టాలీవుడ్‌లో సినీ కార్మికుల వేతనాలపై నెలకొన్న వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమస్యకు పరిష్కారం కోసం నిర్మాతలు, సినీ కార్మికులు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ఇరు వర్గాలు భేటీ కావాల్సి ఉండగా, నిర్మాతలు అందుబాటులో లేకపోవడంతో సమావేశం జరగలేదు. ఈ సందర్భంగా తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఓ లేఖను విడుదల చేసింది. 'వేతనాల పెంపునకు, పని పరిస్థితులపై చర్చించేందుకు బుధవారం మధ్యాహ్నం ఫెడరేషన్ నాయకులు ఫిల్మ్ ఛాంబర్‌కు రావాలని కోరుతున్నాం. కో ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ వీర శంకర్ ఆధ్వర్యంలో నిర్మాతల మండలి ప్రతినిధులతో ఫెడరేషన్ నాయకులు చర్చించనున్నారు' అని పేర్కొంది.

న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం: వల్లభనేని అనిల్

వేతనాల వివాదం ముగిసి, బుధవారం న్యాయం జరుగుతుందని ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వేతనాలు పెంచాలని కోరుతూ తొమ్మిదో రోజు చిత్రీకరణలు ఆపాం. బుధవారం మధ్యాహ్నం జరిగే సమావేశంలో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. చిన్న నిర్మాతల గురించి, వర్కింగ్ కండిషన్లపై చర్చించనున్నాం. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను సినీహబ్‌గా మార్చాలనుకుంటున్న తరుణంలో సమ్మె మంచిది కాదని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి సూచించారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోమన్నారు. ఆ దిశగానే చర్చలు జరుపుతాం' అని అన్నారు.

ఇంతే ఇవ్వాలి అనడం సబబు కాదు: రాహుల్ సంకృత్యాన్

తెలుగు చిత్ర పరిశ్రమలో సినీ కార్మికుల వేతనాలపై తాజాగా, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ స్పందించారు. 'ప్రతి ఏడాదీ బిజినెస్ మారిపోతుంటుంది. అలా సినిమా బడ్జెట్ మారిపోతున్న క్రమంలో ఇంతమందిని తీసుకోవాలి, ఇంతే ఇవ్వాలి అనడం సబబు కాదు. తన శక్తి మేర తన టీమ్‌ను సిద్ధం చేసుకునే స్వేచ్ఛ నిర్మాతకు ఉండాలి. ఎందుకంటే ఇక్కడ రిస్క్ అంతా ప్రొడ్యూసర్‌దే. ఆ విధానంలో పనిచేయాలా వద్దా అనేది వ్యక్తిగత నిర్ణయం. అలాగే, పెరిగిన ధరల దృష్ట్యా కార్మికులకు వేతన పెంపును కోరే హక్కు ఉంది. దానికి స్పందిస్తూ రూ.2000 కన్నా తక్కువ తీసుకుంటున్న కార్మికులకు వేతనం పెంచే నిర్ణయం తీసుకోవడం హర్షణీయం' అని పేర్కొన్నారు.

అవన్నీ సినిమాకు సంబంధం లేనివి

- కాంతార నిర్మాత



కన్నడ చిత్రం 'కాంతార' పాన్ ఇండియా స్థాయిలో ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. కేవలం రూ.15 కోట్లతో నిర్మిస్తే రూ.450 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. దీనికి సీక్వెల్‌గా 'కాంతార: చాప్టర్ 1' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు రిషబ్ శెట్టి. అయితే ఈ చిత్రం షూటింగ్ మొదలైనప్పటి నుంచి వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏదైనా శాపం కారణంగా ఈ ప్రమాదాలు జరుగుతున్నాయేమో అంటూ కన్నడ ఇండస్ట్రీలో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత చలువే గౌడ క్లారిటీ ఇచ్చారు. సెట్‌లో ఒకే ఒక అగ్ని ప్రమాదం జరిగిందని, మిగతావన్నీ సినిమాకు సంబంధం లేనివేనని స్పష్టం చేశారు. 'కాంతార: చాప్టర్ 1' ప్రకటన చేసే ముందే మా టీమ్ అంతా పంజుర్లిని కలసి దేవుడి నిర్ణయం ఎలా ఉంటుంది? అని అడిగాం. 'కొన్ని అవరోధాలు ఏర్పడతాయి. అయినా మీరు ఈ కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు అని చెప్పారు' అని ఆయన పేర్కొన్నారు.

43 మంది కొత్తవారితో కల్ట్ కమర్షియల్



'ఏ స్టార్ ఈజ్ బార్న్' చిత్రం టైటిల్‌ను 'మ్యానిప్యులేటర్'గా మార్చి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు దర్శకుడు వీజే సాగర్. కల్యాణ్, ప్రియా పాల్, సోఫియా ఖాన్. ఊహా రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను సీనియర్ దర్శకుడు బి.గోపాల్ ఆవిష్కరించారు. సినిమా విజయం సాధించాలంటూ ఆయన యూనిట్ సభ్యులకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సాగర్ మాట్లాడుతూ 'ఈ సినిమాతో 43 మంది కొత్త నటీనటుల్ని పరిచయం చేస్తున్నాం. నేటి యువతను దృష్టిలో పెట్టుకుని తీసిన కల్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఇది' అని చెప్పారు. రవిసాగర్, వీజే సాగర్ ఈ చిత్రానికి నిర్మాణసారధులు.

ఆశాలకు తీపికబురు

» గ్రాట్యుటీ చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు తీపికబురు చెప్పింది. ఆశాలు దీర్ఘకాలంగా చేస్తున్న కొన్ని డిమాండ్లను అంగీకరించింది. పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచడమే కాకుండా.. వారికి గ్రాట్యుటీ ఇచ్చేందుకు కూడా ఆమోదం తెలిపింది. వారికి ఆరు నెలలపాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరుకు ఓకే చెప్పింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆశాలు పనిచేసిన కాలానికి సంవత్సరానికి రూ.5 వేలు చొప్పున పదవీ విరమణ చేసే నాటికి గరిష్ఠంగా రూ.1.50 లక్షలు గ్రాట్యుటీగా చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆశాలకు గ్రాట్యుటీ చెల్లించే రాష్ట్రంగా ఏపీ నిలవనుంది. ఇది ఆర్థిక భారంతో కూడిన అంశమైనప్పటికీ తమ ప్రధాన డిమాండ్లను ఆమోదించిన సీఎం చంద్రబాబుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

యూపీహెచ్‌సీలకు అద్దె నుంచి విముక్తి..!

» రాష్ట్రవ్యాప్తంగా 30 భవనాల నిర్మాణానికి ఆమోదం

ఇన్నాళ్లూ అద్దె భవనాలతో నెట్టుకొస్తున్న 30 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు (యూపీహెచ్‌సీ) సొంత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో నూతన భవనానికి రూ.కోటి చొప్పున మొత్తం రూ.30 కోట్లతో ఈ నిర్మాణాలు చేపట్టేందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. రాష్ట్రంలోని 560 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతులపై మంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు.

15 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం!

» 2026 జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే లక్ష్యం: సీఎస్

వచ్చే ఏడాది జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. దీనిలో భాగంగా 15 నుంచి అమరావతి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమం విజయవంతంగా అమలు జరిగేలా చూడాలని సీఎస్ ఆదేశించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో వివిధశాఖల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కోసం చేపట్టిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

కృష్ణా కలెక్టర్ ప్రొసీడింగ్స్‌పై హైకోర్టు స్టే

» దేవస్థానం భూమి గ్రామ పంచాయతీకి అప్పగింత వ్యవహారం

కృష్ణా జిల్లా, ఉయ్యూరు మండలం, సాయిపురంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి చెందిన 8.70 ఎకరాల ఊర చెరువు(కోనేరు) భూమిని సాయిపురం గ్రామపంచాయితీకి తిరిగి అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌పై హైకోర్టు నాలుగు వారాలపాటు స్టే విధించింది. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణ మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ ఆరోపణలపై వివరాలు సమర్పించండి

» సిట్ అధికారులకు హైకోర్టు ఆదేశం

తన భర్త ఫోన్‌లోని సమాచారాన్ని సిట్ అధికారులు మీడియాకు లీక్ చేశారంటూ మద్యం కేసు నిందితుడు వెంకటేష్‌నాయుడు సతీమణి మహిత చేసిన ఆరోపణలపై వివరాలు సమర్పించాలని సిట్ అధికారులకు హైకోర్టు ఆదేశించింది. విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు.

కాంట్రాక్టర్ల సమస్యలపై హైపవర్ కమిటీ వేయాలి

తాడేపల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీ వేయాలని ఎస్‌ఏబీసీఏ కాంట్రాక్టర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.విజయకుమార్, ఇతర ప్రతినిధులు కోరారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కాంట్రాక్టు పనులు చేస్తున్నప్పటికీ వాటికి సంబంధించిన బిల్లులు రావడం లేదన్నారు. కాంట్రాక్టర్లు బిల్లు సమర్పించిన 14 రోజుల్లోపు చెల్లింపులు జరిగేలా చూడాలని, ఇంకా పలు డిమాండ్లు చేశారు.

సకాలంలో యూరియా అందించండి: టీడీపీ

న్యూఢిల్లీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు యూరియా సకాలంలో అందించాలని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డాను టీడీపీ ఎంపీలు కోరారు. మంగళవారం ఢిల్లీలో నడ్డాను తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఎంపీలు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

కొత్తగా 7.43 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు

» ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు: మంత్రి కొండపల్లి

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది కాలంలోనే కొత్తగా 7,43,826 ఎంఎస్ఎంఈ యూనిట్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,500 ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతపడ్డాయంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, ఉపాధి అభివృద్ధి విధానం-4.0లో భాగంగా 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' కాన్సెప్ట్‌తో పలు ప్రోత్సాహకాలు అందిస్తోందని తెలిపారు.

లిక్కర్ కేసులో బెయిల్ తీర్పు వాయిదా

» చెవిరెడ్డికి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు

విజయవాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల బెయిల్ పిటిషన్లపై తీర్పును ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్ రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప తమకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. లిక్కర్ కేసులో నిందితుడిగా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డికి వైద్య పరీక్షల కోసం జైలు అధికారులు మంగళవారం విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. జ్వరంతో బాధపడుతున్న చెవిరెడ్డికి వైద్యులు షుగర్, బీపీ పరీక్షలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలకు సంబంధించిన రక్త పరీక్షలు చేశారు.

'సృష్టి' కేసులు సిట్‌కు బదిలీ

» నమ్రతగా పేరు మార్చుకున్న డాక్టర్ నీరజ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ కేంద్రం మోసాలపై నమోదైన తొమ్మిది కేసులను ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు బదిలీ చేసినట్లు ఉత్తర మండలం డీసీపీ రష్మీ పెరుమాళ్ వెల్లడించారు. పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో ఈ కేసులను సిట్‌కు బదిలీ చేశామన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసిన 9 కేసుల్లో 25 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పలు వివరాలను వెల్లడించారు. ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతపై 2010-20 మధ్యకాలంలో తెలుగు రాష్ట్రాల్లో 15 కేసులు నమోదైనట్లు తెలిపారు. కాగా, డాక్టర్ నమ్రత అసలు పేరు నీరజ. ఆమె మూడున్నర దశాబ్దాల క్రితం విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివినట్లు సమాచారం. ఒకవేళ పోలీసు కేసులు నమోదైతే.. అసలు పేరుతో విదేశాలకు పారిపోవచ్చని ఆమె స్కెచ్ వేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

'ఖజానా'లో కాల్పులు

» చందానగర్‌లో పట్టపగలే రెచ్చిపోయిన దోపిడీ దొంగలు

హైదరాబాద్ సిటీ/చందానగర్, అగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. చందానగర్‌లోని ఖజానా జువెలరీలో బీభత్సం సృష్టించారు. దుకాణం తెరిచిన కొద్దిసేపటికే తుపాకులతో లోపలికి దూసుకొచ్చి.. బంగారు నగలున్న లాకర్ తాళాలు ఇవ్వాలంటూ సిబ్బందిని బెదిరించారు. ఇవ్వనందుకు సిబ్బందిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి.. చేతికి దొరికిన వెండి ఆభరణాలతో ఉడాయించారు. వారి కాల్పుల్లో దుకాణం సిబ్బందిలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బంది సమాచారం మేరకు.. సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి సహా స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు.

మలినాలతో మందు

(మొదటి పేజీ తరువాయి)

పాటించకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ మద్యం లక్ష్యంగా తయారుచేయడమే ఇందుకు కారణం. నిపుణులు, అధికారవర్గాల సమాచారం మేరకు జగన్ ప్రభుత్వంలో మద్యం తయారీలో నిబంధనలు పాటించలేదు. జే బ్రాండ్లలో కంటికి కనిపించని లెక్కలేనన్ని ప్రమాదకర రసాయనాలు కలిశాయి. ఆ బ్రాండ్ల మద్యాన్ని నిర్దేశిత స్థాయిలో శుద్ధి చేయకుండానే హడావిడిగా ప్రజల్లోకి వదిలేశారు. 'శుద్ధి చేస్తే ఖర్చు పెరుగుతుంది, సమయం వృథా అవుతుంది' అనే కోణంలో ఆలోచించిన అప్పటి మద్యం కంపెనీలు నిబంధనలు తుంగలో తొక్కి మద్యాన్ని తయారు చేశాయి. మన రాష్ట్రంలో ఎక్కువ మంది తాగే మద్యాన్ని గ్రెయిన్(నూకలు, మొక్కజొన్న)తో తయారు చేస్తారు. గ్రెయిన్‌ను పిండి చేసి ఆ తర్వాత ద్రవ పదార్థంగా మార్చి ఫర్మంటేషన్ (పులిసేలా చేయడం) ప్రక్రియ ప్రారంభిస్తారు. ఆ తర్వాత అందులో ఒక రకమైన బ్యాక్టీరియా ఈస్ట్‌ను కలుపుతారు. దాని నుంచి క్రమంగా రెక్టిఫైడ్ స్పిరిట్ వస్తుంది. ఆ స్పిరిట్‌ను ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్(ఈఎన్ఏ)గా మార్చడం మరో ప్రక్రియ. మొదట తయారు చేసిన స్పిరిట్ కూడా ఆల్కహాలే అయినా అందులో చాలా మలినాలు మిగిలిపోయి ఉంటాయి. అందుకే మద్యం తయారు చేయడం కోసం దానిని ఇంకా శుద్ధిచేసి 68 శాతం ఓవర్ ప్రూఫ్ వరకూ తీసుకొస్తారు. అప్పటి నుంచి దానిని 24 గంటల పాటు నిల్వ చేయాలి. ఆ తర్వాత ఆ ఈఎన్ఏను లేబొరేటరీలకు పంపి, నిర్దేశిత స్థాయిలో శుద్ధి చేసినట్లు నిర్ధారిస్తే మద్యం ఉత్పత్తి ప్రారంభించాలి. కానీ వైసీపీ ప్రభుత్వంలో అనేక బ్రాండ్లు ఈ నిబంధనలను పాటించలేదు.

ఎప్పటి నుంచో మార్కెట్‌లో ఉన్న బ్రాండ్లు ప్రమాణాలు సక్రమంగానే పాటించాయి. కానీ కొత్తగా వచ్చిన జే బ్రాండ్లు ఈ నిబంధనలను గాలికొదిలేశాయి. నిబంధనల ప్రకారం శుద్ధి చేస్తే ఖర్చు పెరుగుతుంది. ఉదాహరణకు ఒక లీటరు ఈఎన్ఏతో 12 క్వార్టర్ సీసాలు తయారు చేయొచ్చు. అదే ఈఎన్ఏ స్థాయి వరకూ శుద్ధి చేయకుండా రెక్టిఫైడ్ స్పిరిట్‌తోనే మద్యం ఉత్పత్తి చేస్తే 15 బాటిళ్లకు పైగా తయారవుతుంది. కానీ అలా శుద్ధి చేయకుండా తయారు చేస్తే అది తాగినవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఎవరెలా పోతే తమకేంటి అనుకున్న మద్యం కంపెనీలు అలా ప్యూరిఫికేషన్‌ను గాలి కొదిలేసి స్పిరిట్‌తోనే మద్యం తయారు చేశాయి. అలాగే ఈఎన్ఏ 24 గంటలు నిల్వ ఉంచాలనే నిబంధనను కూడా పాటించలేదు. వీలైనంత ఎక్కువ మద్యాన్ని తయారు చేసి అమ్మడం ద్వారా ఎక్కువ లాభాలు పొందాలనే అత్యాశతో ఈఎన్ఏను ఒక్క రోజు కూడా నిల్వ ఉంచకుండా మద్యం తయారు చేసి మార్కెట్‌లోకి వదిలారు.

జే బ్రాండ్లను అప్పట్లో చెన్నైలోని ఎస్‌జీఎస్ ల్యాబ్‌లో పరిశీలించగా అనేక ప్రమాదకర రసాయనాలు వాటిలో ఉన్నట్లు గుర్తించారు. బెంజోక్వినోన్, స్కోపారోన్, డైమితోక్సినా మిక్ యాసిడ్, పైరోగలాల్, వొల్కెనిన్, కాప్రొనలాక్టమ్ లాంటి రసాయనాలున్నాయని తేలింది. వాటివల్ల శ్వాసక్రియ పెరగడం, నాడీ వ్యవస్థ పనితీరు అకస్మాత్తుగా వేగవంతం కావడం, తల తిరగడం, కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు, అతిసారం, మానసిక గందరగోళం, బీపీ పడిపోవడం, చర్మంపై దురద లాంటి అనారోగ్య సమస్యలు వస్తాయని ల్యాబ్ వెల్లడించింది.



ఎక్కువ మోతాదులో విష రసాయనాలు

మద్యం స్కాంలో కమీషన్లు తీసుకోవడం ఒకెత్తు అయితే, ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి మరీ వ్యాపారం చేయడం ఇంకా దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. మెడిసిన్ ఉత్పత్తిచేసేందుకు ఫార్మా కంపెనీలు ఉపయోగించే రెక్టిఫైడ్ స్పిరిట్‌నూ (ఇథైల్ ఆల్కహాల్) మద్యం తయారీకి వాడినట్లు తెలుస్తోంది. ఇది అనేక రకాలుగా ఉంటుంది. కొన్ని రకాల మందులు తయారుచేసేందుకు వంద శాతం స్ట్రెంథ్ ఉండే స్పిరిట్ వినియోగిస్తారు. దీనిని ఫార్మా పరిశ్రమలు విదేశాల నుంచి కూడా దిగుమతి చేసుకుంటున్నాయి. కొన్ని రకాల మందుల కోసం మద్యం తయారీకి వినియోగించే ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్(ఈఎన్ఏ)ను వాడతారు. మరికొన్ని చోట్ల మద్యం తయారీ స్థాయి వరకూ శుద్ధి చేయని స్పిరిట్(ఇంప్యూరిటీ స్పిరిట్)ను మెడిసిన్ తయారీ ప్రక్రియలో వాడతారు. ఫార్మా కంపెనీలకు కూడా డిస్టిలరీల్లో ఈఎన్ఏ తయారుచేసే ప్రైమరీ యూనిట్లే స్పిరిట్‌ను సరఫరా చేస్తాయి. ఇందులో ప్యూరిటీ స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. నిర్దేశిత ప్రమాణాలతో ఉన్న ఈఎన్ఏతో పోలిస్తే ఈ ఇంప్యూరిటీ స్పిరిట్ తక్కువ రేటుకు దొరకడంతో దానితోనే మద్యం తయారు చేసినట్లు సమాచారం. సాధారణంగా మద్యంలో శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే రసాయనాలుంటాయి. అందుకే మందు తాగడం ప్రమాదకరం అని మద్యం సీసాలపైనే ఉంటుంది. అయితే ఒకస్థాయి వరకూ అలాంటి ప్రతికూల ప్రభావం చూపే రసాయనాలు ఉంటే కొంతవరకు ఫరవాలేదు. అయితే జే బ్రాండ్లలో పరిమితికి మించి ఉండటంతో స్లో పాయిజన్‌గా మారి ప్రమాదాన్ని పెంచింది. ఆయింట్‌మెంట్, టించర్‌లో వాడే రసాయనాలు కూడా మద్యంలో కనిపించాయని మరొక వాదన వినిపిస్తోంది.

తాగినా ఎక్కనిది అందుకే....

నాసిరకం స్పిరిట్‌తో మద్యం తయారుచేయడం ద్వారా ప్రజల ప్రాణాలతో ఆడుకుంటే... నీళ్ల తరహా మద్యం అమ్మి మరొక రూపంలో దోపిడీ చేశారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం నాలుగు లీటర్ల ఈఎన్ఏతో ఒక కేసు మద్యం ఉత్పత్తి చేయాలి. కానీ జే బ్రాండ్లలో కొన్ని ఆ నిబంధనలు పాటించకుండా రెండున్నర, మూడు లీటర్ల ఈఎన్ఏతోనే కేసు మద్యం తయారుచేశారు. అలాంటి మద్యం ఎంత తాగినా మత్తు ఎక్కదు. దీంతో ఒక సీసా తాగేవారు రెండు సీసాలు కొనుక్కుని తాగాల్సి వచ్చింది. దీనివల్ల అనారోగ్య సమస్యలు లేకపోయినా ప్రజల జేబుకు చిల్లు పెట్టారు. వైసీపీ హయాంలో ఈఎన్ఏ లీటరు రూ.50గా ఉంది. ఒక కేసు మద్యం తయారీకి నాలుగు లీటర్లు అంటే రూ.200 వెచ్చించాలి. కానీ అంత వెచ్చించకుండా తక్కువ ఈఎన్ఏతోనే మద్యం తయారుచేసి మార్కెట్‌లోకి వదిలారు.

3, 4 నెలల్లోనే దుష్పరిణామాలు



ఈ మధ్యకాలంలో మద్యం కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఎక్కువ మంది కాలేయం సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నారు. మద్యంలో ఆల్కాహాల్ శాతం నిర్దేశిత స్థాయిలో లేకపోతేనే ఈ సమస్యలు వస్తాయి. ఇలాంటి మద్యాన్ని తాగితే మూడు నాలుగు నెలల్లో కాలేయం, కిడ్నీ, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రతికూలత ఏర్పడుతుంది. శరీరంలో కాలేయం చాలా కీలకం. ఇది దెబ్బతింటే విటమిన్స్, మినరల్స్, ఐరన్, రక్తంలో ప్లేట్‌లెట్ల పునరుత్పత్తి తగ్గిపోతుంది. ఇది కొన్నిసార్లు ప్రాణాపాయ స్థితికి దారితీస్తుంది. కాలేయాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకొస్తేనే వారి ఆరోగ్యం బాగుపడుతుంది.

- డాక్టర్ వాసుదేవ్, జనరల్ మెడిసిన్, అసోసియేట్ ప్రొఫెసర్, విమ్స్, విశాఖపట్నం

కాలేయం, పాంక్రియాసిస్‌కు ముప్పు

గత రెండు మూడేళ్లుగా యువకులు ఎక్కువగా మద్యం సంబంధిత వ్యాధులతో ఆస్పత్రికి వస్తున్నారు. కాలేయం, పాంక్రియాసిస్ అవయవాలు దెబ్బతింటున్నాయి. నాసిరకం మద్యం ఎక్కువ మోతాదులో తాగడం వల్ల ఈ రెండు అవయవాలు ప్రభావితం అవుతున్నాయి. పాంక్రియాసిస్ దెబ్బతినడం వల్ల చిన్న వయసులోనే షుగర్ వ్యాధిన పడుతున్నారు. ఇలాంటి రోగులతో మాట్లాడినప్పుడు తక్కువ ధరకు దొరికే మద్యం తాగుతున్నట్టు చెబుతున్నారు. గత మూడేళ్లలో కొత్తగా మద్యానికి అలవాటైన వారిలో ఈ తరహా రోగాలు పెరిగాయి.

- డాక్టర్ సీహెచ్ అభినవ్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, సెంటిని హాస్పిటల్, విజయవాడ

పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచింది: లోకేశ్

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందంటూ రాష్ట్ర మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 30 ఏళ్ల తర్వాత అక్కడి ప్రజలంతా నిర్భయంగా బయటకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్న పులివెందుల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ మూర్ఖత్వానికి మరణం లేదని మరోసారి రుజువైందన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు నిర్వహించడం, భయపెట్టి ఏకగ్రీవం చేసుకోవడం కాదన్న విషయాన్ని వైసీపీ తెలుసుకోవాలని ఓ ప్రకటనలో సూచించారు.

గెలిచి చరిత్ర సృష్టించబోతునున్నాం: పల్లా

పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపొంది చరిత్ర సృష్టించబోతోందని ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. అక్కడ సుమారు 30 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయని, ఇది రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన పరిణామంగా నిలుస్తుందని చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గతంలో నామినేషన్ వేయాలన్నా ప్రాణభయం ఉండేదని.. ఈసారి అభ్యర్థులు స్వేచ్ఛగా పోటీ చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండు జడ్పీటీసీ స్థానాల్లో 11 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. ఇది వైసీపీ లక్కీ నంబరని ఎద్దేవాచేశారు. ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ టీడీపీకి వత్తాసు పలుకుతున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారని, ఆమె వారి హయాంలోనే నియమితులయ్యారన్న విషయాన్ని గుర్తుచేశారు.

నేడు సర్టిఫికెట్ల పరిశీలనకు రండి!

» గ్రూప్-1 స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు ఏపీపీఎస్సీ హడావిడి పిలుపు

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడా కోటా గ్రూప్-1 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అంశంపై ఏపీపీఎస్సీ మంగళవారం హడావిడిగా ప్రకటన విడుదల చేసింది. ఏపీపీఎస్సీ ఇటీవల నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు.. బుధవారం ఉదయం 11 గంటలకు స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలనకు విజయవాడలోని శాప్ కార్యాలయానికి రావాలని పేర్కొంది. దీంతో 37 మంది అభ్యర్థులు ఎట్టి పరిస్థితుల్లో హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు రాకుంటే వారి అభ్యర్థిత్వం కోల్పోతారని హెచ్చరించింది.

21 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు

అమరావతి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మూడు శాఖల్లో 21 క్యారీ ఫార్వార్డ్ (గతంలో మిలిగిపోయిన) పోస్టుల భర్తీ కోసం ఏపీపీఎస్సీ మంగళవారం వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేసింది. ఈనెల 13 నుంచి సెప్టెంబరు 2వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

శాప్ పేరుతో ఫేక్ కాల్స్ నమ్మొద్దు!

» డీఎస్సీ అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలి

విజయవాడ(స్పోర్ట్స్), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నుంచి చేస్తున్నామంటూ కొన్ని నకిలీ ఫోన్ కాల్స్ వస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ చైర్మన్ రవినాయుడు, ఎండీ అజయ్ జైన్ సూచించారు. అలాంటి కాల్స్‌పై సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో 3 శాతం స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద 421 ఉపాధ్యాయ ఉద్యోగుల భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రాథమిక తాత్కాలిక ప్రాధాన్యతా జాబితా ఇప్పటికే విడుదలైందని వారు తెలిపారు. శాప్ నుంచి మాట్లాడుతున్నామని, పోస్టింగ్ కోసం 'ఫార్మాలిటీస్' ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కొంతమంది ఫోన్లు చేసి అడుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. డీఎస్సీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, శాప్ నుంచి ఎవరికీ, ఎలాంటి ఫోన్లు రావని స్పష్టం చేశారు.

పులివెందులకు ఓట్ల స్వాతంత్ర్యం



» 4 దశాబ్దాల తరువాత స్వేచ్ఛగా పోలింగ్
» ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న యంత్రాంగం
» ఓటర్లలో ధైర్యంనింపుతూ ముందస్తు చర్యలు
» జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో 76.44 % పోలింగ్
» ఒంటిమిట్టలో ఉద్రిక్తతలు..81.53% పోలింగ్

కడప, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పులివెందులలో ఏ ఎన్నిక జరిగినా రక్తం చిందించాల్సిందే. అయితే ఈసారి చరిత్ర మారింది. జడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా స్వేచ్ఛగా ఓటు వేసుకునే అరుదైన అవకాశం నాలుగు దశాబ్దాల తర్వాత తొలిసారి పులివెందుల వాసులకు లభించింది. పులివెందుల ఉప ఎన్నికలను టీడీపీ, వైసీపీ ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయో అధికార యంత్రాంగం కూడా అంతే పట్టుదలగా తీసుకోవడంతో చెదురుమదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కడప జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు మంగళవారం ఉప ఎన్నికలు జరిగాయి. పులివెందుల టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పోటీ చేయగా, వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. పోలింగ్ సన్నాహాల్లో అధికార యంత్రాంగం చివరివరకు అప్రమత్తంగా వ్యవహరించింది. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్ సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించారు. నామినేషన్ల అనంతరం పులివెందుల లో టీడీపీ, వైసీపీల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో పులివెందులలో పోలింగ్ రోజున 700 మందితో బందోబస్తు నిర్వహించారు. డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్‌కుమార్ భద్రతను పర్యవేక్షించారు. డ్రోన్ కెమెరాలు, ఫాల్కన్‌తో నిఘా, చెక్‌పోస్టులవద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు. ఎంపీ అవినాశ్‌రెడ్డిని, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని పోలింగ్‌కు ముందే అరెస్టు చేశారు. అవినాశ్‌రెడ్డి వైసీపీ కార్యాలయంలో ఉండగా, ప్రశాంత ఎన్నికల కోసం ప్రివెంట్ యాక్ట్ కింద అరెస్టు చేస్తున్నామని చెప్పారు. అయితే ఆయన పోలీసు వాహనం ఎక్కేందుకు ససేమిరా అంటూ అడ్డం తిరిగారు. చివరికి పోలీసులు బలవంతంగా ఆయనను వాహనంలోకి ఎక్కించి ఎర్రగుంట్లకు తరలించారు. ఇక ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసి ఆర్‌కే వ్యాలీకి తరలించారు. పులివెందుల జడ్పీటీసీ పరిధిలో మొత్తం 10,600 ఓట్లు ఉండగా 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటలకే పోలింగ్ మొదలైంది. చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా సాగింది. ఎర్రిపల్లెలో పోలింగ్ ప్రారంభం కాకముందే టీడీపీ, వైసీపీ మధ్య ఘర్షణ సాగింది. ఓటు వేసేందుకు వస్తున్న టీడీపీ కార్యకర్తల వాహనంపై వైసీపీ మూకలు రాళ్ల దాడి చేశాయి. ఎర్రబల్లెలో కూడా టీడీపీ, వైసీపీ మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగిం.ది. అయితే పోలీసులు రంగప్రవేశం చేసి ఘర్షణను సద్దుమణిగేలా చేశారు.

అవినాశ్, రాంగోపాల్‌రెడ్డి అరెస్టు..

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను పోలీసులు వైసీపీకి చెందిన ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలను అరెస్టు చేశారు. అవినాశ్‌రెడ్డిని ఎర్రగుంట్లకు తరలించారు. ఆ తర్వాత విడుదల చేశారు. ఆయన అక్కడ జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇంటికి వెళ్లి తిరిగి మధ్యాహ్నానికే పులివెందులలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పోలింగ్ బూత్ వద్దకు అవినాశ్‌రెడ్డి వస్తారని ప్రచారం సాగింది. దీంతో డీఐజీ కోయ ప్రవీణ్ నేరుగా ఎంపీ కార్యాలయానికి వెళ్లారు.ఆయనతోపాటు డీఎస్పీ మురళీనాయక్ ఉన్నారు. అక్కడ వైసీపీ కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మద్యం మత్తులో దూషిస్తుండడంతో... డీఎస్పీ మురళీనాయక్ తీవ్రస్వరం వినిపించారు. "మీరు వైసీపీ కార్యకర్తలైతే..నాది ఖాకీ యూనిఫాం.. కాల్చిపారేస్తా" అంటూ వార్నింగ్ ఇచ్చారు.

వైసీపీ హ్యాండ్సప్

పులివెందుల అంటే వైసీపీ గడ్డ అంటూ ప్రచారం చేసుకునేవారు. జడ్పీటీసీ ఎన్నికల్లో సీన్ మొత్తం రివర్స్ అయింది. నామినేషన్ల ముందు వరకు కూడా టీడీపీ బలహీనంగానే ఉంది. అయితే ఆ మండల వాసులను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని కూటమి హామీ ఇవ్వడం, పలువురు వైసీపీ ముఖ్య నేతలు చేరడంతో టీడీపీ బలం పుంజుకుంది. ఎర్రిపల్లె, ఎర్రబల్లె, అచ్చివెల్లి బూత్‌లలో పోలింగ్ ప్రారంభం కాకముందు చిన్నపాటి ఘర్షణలు మాత్రమే జరిగాయి. అయితే వైసీపీకి ఏజంట్లే కరువయ్యారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి కూడా.. పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పుడు "మనకు చేయాల్సినంత డామేజీ చేశారు. మనకు టైం వస్తుంది, అప్పుడు చూపిద్దాం, మౌనంగా ఉండండి" అంటూ నిర్వేదంగా కార్యకర్తలను శాంతింపజేశారు. కాగా, ఉప ఎన్నికల్లో వైసీపీ నుంచి గుమ్మళ్ల హేమంత్‌రెడ్డి పోటీ చేశారు. ఈయనకు తుమ్మళ్లపల్లె 1వ బూత్‌లో సీరియల్ నంబర్ 538గా ఓటు నమోదైంది. అయితే ఆయన అక్కడ ఓటు వేయలేదు. పులివెందులలో మొత్తం 10,600 ఓట్లు ఉండగా.. ఉపఎన్నికలో 76.44% ఓటింగ్ నమోదైంది. గురువారం ఓట్లు లెక్కించి, ఫలితాలు ప్రకటిస్తారు.

ఇన్నేళ్లకు ప్రశాంతంగా ఓటు వేశాం



"మాది ఎర్రిపల్లె గ్రామం. ఈరోజు ప్రశాంతంగా నా ఓటు వేసుకున్నాను. ఇప్పటివరకు ఇంత ప్రశాంతంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసుకోవడం చాలా అరుదు. ఏదైన గొడవ జరిగితే ఓటు వేయకపోతే ఏం అవుతుందిలే...అనుకొని ఓటు వేసేవారం కాదు. కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఓటువేశాను."

- సూర్యశేఖర్‌రెడ్డి, ఎర్రిపల్లె గ్రామం

తొలిసారి ఓటు వేశా..



"ఇప్పటి వరకు ఓటు వేయలేదు. ఈ రోజు మొదటిసారి ఓటు వేశాను. అచ్చవెల్లి పోలింగ్‌కేంద్రం పరిధిలోని కానేపల్లె గ్రామానికి వచ్చి ఓటు వేశాను. గొడవలు జరిగితే గతంలో ఓటు వేయడానికి వెళ్లేదానిని కాదు. ఈ గ్రామం నుంచి ఆ గ్రామానికి వెళ్లి ఓటు ఏం వేస్తాంలే అని ఊరుకునేదానిని. కానీ ఆ పరిస్థితి లేకపోవడంతో ఓటు వేశాను.

- షమీన, కానేపల్లె

గొడవలు లేకుండా ఎన్నికలు



"ఓట్లంటేనే ఏదొక గొడవ. కానీ ఈ రోజు మా వీధిలో ఓటు వేసే చోట ఎలాంటి గొడవలూ లేవు. నేను ఓటు వేసేందుకు ఇక్కడకు వచ్చాను. నా ఓటు నేను ప్రశాంతంగా వేసుకున్నాను."

- కోరా శకుంతలమ్మ, ఓటర్, ఆర్.తుమ్మలపల్లె

ఉద్రిక్తతల మధ్య ఒంటిమిట్ట ఉపఎన్నిక

రాయచోటి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఉద్రిక్తతల మధ్య మంగళవారం కడప జిల్లా ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్ని పోలింగ్ కేంద్రాల్లో తిరుగుతూ కొన్నిచోట్ల టీడీపీ ఏజెంట్లను బెదిరించారు. ఈ సమాచారం అందుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని టీడీపీ ఏజెంట్లకు ధైర్యం చెప్పారు. వైసీపీ మూకలకు వార్నింగ్ ఇచ్చారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చిన్నకొత్తపల్లె పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చిన టీడీపీ సానుభూతిపరులను వైసీపీ ఏజెంట్లు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం అందుకుని అక్కడికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెళ్లారు. మంత్రి రావడంతో టీడీపీ సానుభూతిపరులు తమను ఇబ్బంది పెడుతున్న వైసీపీ ఏజెంట్లపైకి తిరగబడ్డారు. సాలాబాదు బూత్‌లో వైసీపీ నాయకులు ఏకపక్షంగా ఓటింగ్ చేసుకుంటున్నట్లసమాచారం రావడంతో అక్కడికి మంత్రి చేరుకుని అడ్డు చెప్పారు. మంత్రి అనుచరులు ఓటింగ్‌ను అడ్డుకున్నారు. మంటపంపల్లె పోలింగ్ కేంద్రంలో టీడీపీకి పట్టు ఉంది. అయితే ఇక్కడ వైసీపీ ఏజెంట్లు ఓటింగ్ మందకొడిగా సాగేలా చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో మంత్రి మండిపల్లె అక్కడికి చేరుకుని పోలింగ్ అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా వైసీపీ, టీడీపీ నాయకులకు కొద్దిపాటి ఘర్షణ జరిగింది. ఒంటిమిట్టలో పోలింగ్ 81.53 శాతంగా నమోదైంది.



ఒంటిమిట్టలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో వాగ్వాదం చేస్తున్న వైసీపీ నాయకులు రవీంద్రనాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల తదితరులు



సౌదీ అరేబియాలోని టీడీపీ మహిళా నాయకురాలు గడ్డం శిల్ప, సౌదీలోని ప్రముఖ తెలుగు ప్రవాసీ సంఘం సాటా సెంట్రల్ నాయకుడు ముజమ్మిల్ షేక్ మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. గల్ఫ్ దేశాల్లోని ప్రవాసీయుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎంను అభినందించారు.
- ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

"పెద్ద ప్రాజెక్టులను సీబీఎన్ మాత్రమే సమర్థంగా చేయగలుగుతారని ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కూడా చెప్పారు. విశ్వసనీయత దెబ్బతినకుండా చూడాలి."
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

రైతుల గోడు వినండి

(మొదటి పేజీ తరువాయి)

ఇసుక నిల్వల్ని కూడా గత పాలకులు ఎత్తుకెళ్లారని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఆ ఇసుకను భర్తీ చేయాలని మైనింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో రాజధాని నిర్మాణ పనుల పురోగతి సహా వివిధ సంస్థలకు చేసిన భూకేటాయింపుల అంశాలపై సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

రికార్డు టైమ్‌లో నిర్మాణం

రికార్డ్ టైమ్‌లో రాజధాని అమరావతి నిర్మాణ పనులు పూర్తి కావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువుకంటే ఆరు మాసాల ముందే పనుల్ని పూర్తిచేయాలని సూచించారు. ప్రపంచంలో అత్యుత్తమ నివాస నగరంగా అమరావతి నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. రాజధాని ఎల్పీఎస్ లేఅవుట్లలో అభివృద్ధి పనుల పురోగతి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, ఉద్యోగులు, న్యాయమూర్తుల నివాస భవనాలు, రహదారులు, డక్టులు లాంటి ట్రంక్ ఇన్‌ఫ్రా, వరద నియంత్రణ పనులు జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. రాజధానిలో ప్రస్తుతం రూ.50,552 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచామని, 74 పనులు ప్రారంభమయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. కాంట్రాక్టు సంస్థలు ఆయా పనుల్ని పరుగులు పెట్టించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అయితే, నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని తేల్చిచెప్పారు. రాజధానిలో చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష చేస్తానని సీఎం అన్నారు. రియల్ టైమ్‌లో పనుల పురోగతిని కూడా పర్యవేక్షిస్తామన్నారు. ఆటోపైలట్ మోడ్‌లో పనులు జరగాలని సూచించారు.

వేగంగా అనుమతులు

రాజధానిలో కార్యాలయాల నిర్మాణాలు చేపట్టనున్న వివిధ సంస్థలకు అనుమతులు వేగంగా ఇవ్వాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. బిట్స్ పిలానీ, ఎక్స్ ఎల్ఆర్ఐ తదితర సంస్థలకు త్వరితగతిన భూమిని కేటాయించాలని సూచించారు. అలాగే, ఇప్పటి వరకు రాజధాని ప్రాంతంలో భూములిచ్చిన 72 సంస్థలు ఏ మేరకు నిర్మాణాలు చేపడుతున్నాయో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ, పర్యాటక ప్రాజెక్టులు, ఎయిర్‌పోర్టు, బయోటెక్నాలజీ, విద్యాసంస్థలు, ఆసుపత్రులు ఇలా వివిధ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు.

గాలి నాణ్యతకు ప్రాధాన్యం

కేవలం భవనాల అభివృద్ధితో మాత్రమే రాజధాని నగరం పూర్తి కాదని, ఆర్థిక కార్యకలాపాలు కూడా పెద్దఎత్తున రావాల్సి ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. నిర్మాణాలను పూర్తిచేసి రాజధాని నగరంగా విజిబిలిటీ వస్తే పెట్టుబడిదారులు వచ్చి ఆర్థికంగా పరిపుష్టం అవుతుందన్నారు. దేశంలోని అత్యుత్తమ 10రియల్ ఎస్టేట్ కంపెనీలను కూడా ఆహ్వానించి ఇక్కడ ప్రాజెక్టులు చేపట్టేందుకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. రాజధాని నగరాన్ని గ్రీన్ ఎనర్జీ కారిడార్‌గా మార్చేందుకు విద్యుత్ వాహనాల(ఈవీ)ను ప్రోత్సహించాలన్నారు. సీడ్ క్యాపిటల్, క్యాపిటల్ సిటీ, క్యాపిటల్ ఏరియా ప్రాంతాల్లో గాలి నాణ్యత ఎలా ఉందో కూడా నమోదు చేసి వివరాలు ప్రదర్శించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

విజన్‌తోనే అభివృద్ధి వెలుగులు

- విద్యుత్‌లేని ఊరి నుంచి వచ్చా
- రాష్ట్రంలో సంస్కరణలు తెచ్చా: చంద్రబాబు



యంగ్ ప్రొఫెషనల్స్‌తో జరిగిన సమావేశానికి హాజరైన ప్రతినిధులు, మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): "విద్యుత్ లేని ఊరు నుంచి వచ్చా. ఉమ్మడి రాష్ట్రంలోనే విద్యుత్ సంస్కరణలు తెచ్చాను" అని సీఎం చంద్రబాబు అన్నారు. నిత్య విద్యార్థిగా ఉంటూ అభివృద్ధి గురించి నిరంతరం ఆలోచించడం వల్లే ఇది సాధ్యమైందని చెప్పారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా నియోజకవర్గాల వారీగా రూపొందించిన విజన్ డాక్యుమెంట్లకు అనుగుణంగా పనిచేసేందుకు నియమితులైన 'యంగ్ ప్రొఫెషనల్స్'కు ప్రణాళికశాఖ వారం రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. శిక్షణ ముగించుకున్న యంగ్ ప్రొఫెషనల్స్‌తో సీఎం చంద్రబాబు మంగళవారం భేటీ అయ్యారు. సీఎం మాట్లాడుతూ.. "నియోజకవర్గానికో యంగ్ ప్రొఫెషనల్‌ను నియమించడం కొత్త విధానం. నేను తొలిసారి సీఎం కాగానే ప్రాధాన్యతాంశాలను గుర్తించి. వాటికి అనుగుణంగా ప్లాన్ చేసుకున్నా. యంగ్ ప్రొఫెషనల్స్ కూడా వారికి కేటాయించిన నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి. స్థానికంగా ఉండే ఎమ్మెల్యే సహా మిగిలిన వారితో సంప్రదింపులు జరిపి నియోజకవర్గాల అభివృద్ధికి ప్లాన్ చేయాలి. ప్రజలకు ఏది మంచో చెప్పాలి. సరైన విధానాలు అవలంబించకపోతే ఎలాంటి పరిణామాలువస్తాయో ప్రజలకు వివరించాలి" అన్నారు.

ఈ రోజు మంచి జరిగింది: 'ప్రతి నియోజకవర్గానికీ ఓ బలం ఉంటుంది. సహజ వనరులు ఉంటాయి. వాటిని యంగ్ ప్రొఫెషనల్స్ గుర్తించి అధ్యయనం చేయాలి. ఆ వనరుల ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రభుత్వం అప్పజెప్పిన బాధ్యత ఒత్తిడిగా ఉందని భావించొద్దు. కష్టంతో కాకుండా ఇష్టంతో పనిచేయాలి. నియోజకవర్గంలో 9 మంది సభ్యులతో కలిసి యంగ్ ప్రొఫెషనల్స్ పనిచేయాలి. క్షేత్రస్థాయికి వెళ్లిన యంగ్ ప్రొఫెషనల్స్ ప్రభుత్వానికి, సీఎంగా నాకూ బలంగా ఉండాలి' అని సీఎం అన్నారు. కాగా, 'ఈ రోజు ఏపీకి సెమీకండక్టర్ యూనిట్‌ను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఇది మంచి పరిణామం. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఎకో సిస్టం ఏర్పడటానికి కేంద్రం తీసుకున్న నిర్ణయం దోహదపడుతుంది' అని చంద్రబాబు అన్నారు. అనంతరం, శిక్షణ ముగించుకున్న 175 యంగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రణాళికశాఖ ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి కేశవ్, పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు, అధికారులు పాల్గొన్నారు.

భూములిచ్చినా కష్టాలే!

రాజధానిలో ల్యాండ్‌పూలింగ్ జరిగి పదేళ్లు
ఇనామ్, గ్రామకంఠం రైతులకు ఈనాటికీ ప్లాట్లు లేవు..కౌలూ లేదు

- అసైన్డ్ రైతులకు అసైన్డ్‌లోనే ప్లాట్లు
- రిజిస్ట్రేషన్.. అమ్మకాలు.. అన్నింటా చిక్కులు
- నాన్చుతున్న సీఆర్‌డీఏ.. రైతుల్లో ఆందోళన
- 'ఆంధ్రజ్యోతి'తో బాధితుల మొర
- ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని విన్నపం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అమరావతిలో రాజధాని నిర్మిస్తామని ప్రభుత్వం చెబితే రైతులు మూడు పంటలు పండే 33వేల ఎకరాల భూములను సీఆర్‌డీఏకు అప్పగించారు. ఇందులో పట్టా భూములతోపాటు ఇనాం (దేవదాయ), గ్రామకంఠం, అసైన్డ్ భూములను ల్యాండ్‌పూలింగ్‌లో తీసుకున్నారు. దేవదాయశాఖకు సంబంధించిన దాదాపు 1017 ఎకరాలు సేకరించారు. మరో 187 ఎకరాలు దేవదాయశాఖతో వివాదం ఉన్న భూములు. వీటిని ఇనామ్ భూములుగా చూస్తున్నారు. ఇవి కాకుండా మరో 600 ఎకరాలు ఇనామ్ భూములున్నాయి. మరో 350 ఎకరాల్లో గ్రామకంఠం భూములున్నాయి. ఇవి రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. పట్టా భూములు తీసుకున్నందుకు రైతులకు నివాస, వాణిజ్య అవసరాలకోసం 2016లోనే రిటర్నబుల్‌ప్లాట్లు కేటాయించారు. దేవదాయశాఖతో వివాదం ఉన్న 187 ఎకరాల ఇనాం భూములను సీఆర్‌డీఏ సెటిల్ చేసింది. అంటే, ఆ భూములకు గాను దేవదాయశాఖకు పరిహారం చెల్లించింది. కానీ, ఆ భూములపై హక్కులు ఉన్న రైతులకు ఈ నాటికీ ప్లాట్లు కేటాయించలేదు. దాదాపు 275 మంది రైతులకు కౌలు ఇవ్వడం లేదు. ఇవికాకుండా రాజధాని గ్రామాల్లోనే మరో 600 ఎకరాల ఇనామ్ భూములున్నాయి. వాటిని ఈ రోజు వరకు సెటిల్ చేయలేదు. ఆ భూములపై హక్కులున్న రైతులకు ఇటు ప్లాట్లు ఇవ్వలేదు. కౌలు చెల్లించడం లేదు. వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగుకు భూమిలేకపోవడంతోపాటు కౌలురాక జీవనోపాధిని కూడా కోల్పోయి రోడ్డున పడ్డారు.

ఏం పాపం చేశాం?

పేరుకే రాజధాని రైతులు. కానీ, ఇనామ్ భూములు కలిగి ఉన్నందుకు ప్లాట్లకు, కౌలుకు వారు నోచుకోవడం లేదు. తాము ఏం పాపం చేశామని ఈ రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఈ సమస్య గురించి సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు అనేక దఫాలుగా హామీలిచ్చినా నేటికీ పరిష్కారం కాలేదు. గ్రామకంఠం భూములను కూడా సీఆర్‌డీఏ పూర్తిగా తీసుకుంది. కానీ, రైతులకు ఆ మేరకు కౌలు, పరిహారం ఇవ్వడం లేదు. ప్లాట్లు అరకొరా కేటాయించారు. తమకు హక్కున్న మేరకు భూమిని పరిశీలించి కౌలు ఇవ్వాలని గ్రామకంఠం భూములున్న 175 మంది రైతులు సీఆర్‌డీఏ ఆఫీసుకు రోజువారీగా తిరుగుతున్నారు. నిజానికి గ్రామకంఠం భూముల సెటిల్‌మెంట్‌లో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ల్యాండ్ పూలింగ్‌లో గ్రామకంఠాల మినహాయింపులో అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని నెక్కల్లుకు చెందిన రైతు శ్రీనివాస్ తీవ్ర ఆరోపణ చేశారు, "గ్రామకంఠాల మినహాయింపులో కొందరికి మేలు, మరి కొందరికి అన్యాయం జరిగింది. అధికారులు ఉద్దేశపూర్వకంగా తప్పులు చేశారు. 50 సెంట్ల గ్రామకంఠం స్థలంలో 30 సెంట్లు పశువుల పాక, మరో 20 సెంట్లలో గడ్డివాములు ఉంటే, అధికారులు కేవలం పశువులపాక ఉన్న విస్తీర్ణాన్నే చూపించారు. గడ్డివాములున్న 20 సెంట్ల స్థలాన్ని గ్రామకంఠం నుంచి తొలగించారు. పలుకుబడి ఉన్నవాళ్లకు మేలు జరిగింది. బక్కరైతులను దెబ్బకొట్టారు" అని శ్రీనివాస్ చెప్పారు. ఇదిలా ఉంటే, దేవదాయశాఖ భూమితో ఇనామ్ వివాదం ఉన్న భూములు 187 ఎకరాలు. వీటిని కూడా పూలింగ్‌లో తీసుకున్నారు. ఆ భూమికి సంబంధించిన పరిహారం దేవదాయశాఖకు చెల్లించారు. కానీ రైతులకు ప్లాట్లు కేటాయించలేదని, కౌలు ఇవ్వడం లేదని మందడానికి చెందిన రైతు కృష్ణమూర్తి 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని సీఆర్‌డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా స్పందించడం లేదని చెప్పారు.



ఆ 800 మంది రైతుల పరిస్థితేంటి?

జగన్ ప్రభుత్వం అమరావతిని దెబ్బతీయాలని చూసిన సంగతి తెలిసిందే. ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందనే పేరిట అనేక కేసులు పెట్టారు. ఇందులో 800 మంది రైతులకు సంబంధించిన సమస్యలున్నాయి. వారికి ఇప్పటి వరకు కౌలు మంజూరుకాలేదు. బ్యాంక్ ఖాతాల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పుగా ఉందనే కారణంతో మరికొందరు రైతుల ఖాతాల్లో కౌలు జమకావడం లేదు. సీఆర్‌డీఏ రైతులకు కేటాయించిన కొన్ని ప్లాట్లు వీధిపోటుతో ఉన్నాయి. మరి కొన్ని గ్రామాల్లో రైతులకు శ్మశానాల పక్కనే ప్లాట్లు కేటాయించారు. వాటిని మార్చాలని రైతులు కోరుతున్నారు. విలువైన భూములు ఇచ్చి శ్మశానాల పక్కన ఇచ్చే ప్లాట్లు తీసుకోవాలా? అని రాయపూడికే చెందిన రైతు లక్ష్మణరావు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వం పిలుపునివ్వగానే రాజధానిలో రైతులు తమ భూములిచ్చారు. సీఆర్‌డీఏ జరిపిన ల్యాండ్ పూలింగ్‌లో పట్టాదారులకు మాత్రమే న్యాయం దక్కింది. ఇనాం, గ్రామకంఠం లబ్ధిదారులకు మేలన్నది ఇంకా అందని ద్రాక్షగానే ఉండిపోయింది. వారికి ప్లాట్లు ఇవ్వలేదు. కౌలు అన్నదే లేదు. అసైన్డ్ రైతులకు అసైన్డ్ భూముల్లోనే ప్లాట్లు ఇవ్వడంతో అవసరానికి అమ్ముకోలేకపోతున్నారు. భూములు ఇచ్చిన రైతులకు పదేళ్లుగా దక్కుతున్న న్యాయం ఇదేనా? అన్న ప్రశ్న అమరావతిలోని 29 గ్రామాల ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. అమరావతి రైతుల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' వార్తలు ప్రచురిస్తోంది. వాటికి స్పందించిన రైతులు తమకూ సమస్యలున్నాయంటూ 'ఆంధ్రజ్యోతి'కి మొరపెట్టుకుంటున్నారు.

బాబే మాకు న్యాయం చేయాలి

"భూములిచ్చిన మాకు కొన్ని సెంటిమెంట్లు ఉంటాయి. ఏరికోరి వీధి పోటున్న స్థలాలు కొనుగోలు చేయం. ఒకవేళ అలాంటి ప్లాట్లు ఉన్నా ఇంటి నిర్మాణాలు చేయం. అలాంటిది మాకు 80 శాతం వీధిపోటు ఉన్న ప్లాట్లు కేటాయించారు. వాటిని మార్చాలని కోరుతున్నాం. కొందరు రైతులకు శ్మశానాల పక్కనే ప్లాట్లు ఇచ్చారు. సీఆర్‌డీఏ అధికారులు ఏ విషయాన్నీ సీరియస్‌గా తీసుకోవడం లేదు. కాబట్టి మేం నమ్మిన చంద్రబాబే మా సమస్యలపై స్పందించాలి. మాకు సీఎం ఓ పరిష్కారం చూపాలి"
- లక్ష్మణరావు, రాయపూడి రైతు

అసైన్డ్ భూముల్లో ప్లాట్లు కేటాయింపు

అసైన్డ్ భూములున్న రైతులు సీఆర్‌డీఏ పరిధిలో సరికొత్త సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారి భూములను కూడా ల్యాండ్‌పూలింగ్‌లో తీసుకున్నారు. ఎకరాకు 800గజాలు చొప్పున రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చారు. అయితే ఈ ప్లాట్లు కూడా అసైన్డ్ భూముల్లోనే ఉన్నాయి. ఇలాంటి ప్లాట్లు తీసుకున్న రైతులు తమ పేరిట భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఇతరులకు అమ్ముకోలేకపోతున్నారు. రిజిస్ట్రేషన్లు జరగడం లేదని మందడానికే చెందిన రైతు వెంకటరమణ 'ఆంధ్రజ్యోతి' దృష్టికి తీసుకొచ్చారు. 'పట్టా, ఇనాం, గ్రామకంఠంతోపాటు అసైన్డ్ భూములను కూడా ల్యాండ్‌పూలింగ్‌లో తీసుకున్నారు. రైతులకు అసైన్డ్ భూములు తీసుకున్నందుకు అసైన్డ్ ప్లాట్లనే ఇచ్చారు. వాటిని ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నాం. భూములన్నీ సీఆర్‌డీఏ వశమయ్యాక, తమకిచ్చిన భూములపై ఇలాంటి షరతులు పెట్టడం ఎంత వరకు న్యాయం?' అని వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాఉంటే రాజధానికి పట్టా భూములిచ్చిన రైతులకు భూసేకరణ చేయాల్సిన భూముల్లో ప్లాట్లు కేటాయించారని రైతులు చెబుతున్నారు.



మహిళలకు ఉచిత బస్సుపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రవాణా శాఖ అధికారులు

మహిళా ప్రయాణికుల పట్ల
మర్యాద!

- వారి భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- ఆర్టీసీ అధికారులకు సీఎం దిశానిర్దేశం

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు కూటమి ప్రభుత్వం అందిస్తోన్న ఉచిత ప్రయాణం (స్త్రీ శక్తి) అమలులో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా జాగ్రత్త పడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశాలిచ్చారు. మహిళా ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. రద్దీ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని, ముఖ్యంగా మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శుక్రవారం నుంచి ఏపీఎస్ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుపై మంగళవారం ఆర్టీసీ అధికారులతో సీఎం సమీక్షించారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు, యువతులు, థర్డ్ జెండర్లు ఉచిత ప్రయాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్ కార్డు చూపించి కండక్టర్ జారీ చేసే జీరో ఫేర్ టికెట్‌తో ప్రయాణించవచ్చు. స్త్రీ శక్తి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు పూర్తి చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సులతో మొదలు పెట్టి, అవసరం మేరకు భవిష్యత్తులో కొత్త బస్సులు సమకూర్చుకోనున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. డ్రైవర్ల కొరత ఉండటంతో ఆన్ కాల్ డ్రైవర్లను నియమించుకుంటామని తెలిపారు. 'స్త్రీ శక్తి అమలులో ఎదురయ్యే సమస్యల్ని ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేయండి. బస్ స్టేషన్లన్నీ శుభ్రంగా ఉంచాలి. బస్సులు బ్రేక్ డౌన్ రాకుండా చూసుకోవాలి. జీరో ఫేర్ టికెట్లు సిద్ధం చేసుకోండి' అని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. మరోవైపు ఆటో డ్రైవర్లకు కేంద్ర ప్రభుత్వం అందిస్తోన్న పథకాలేంటి? వాటితో కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా సహకారం అందించేందుకు సమగ్రంగా అధ్యయనం చేయాలని రవాణా శాఖ అధికారుల సమీక్షలో సీఎం ఆదేశించారు.

ఇక పార్టీపై ఫోకస్!

నేడు టీడీపీ కేంద్ర కార్యాలయానికి బాబు, లోకేశ్

- సంస్థాగత నిర్మాణంపై రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో చర్చలు
- 'సుపరిపాలనలో తొలి అడుగు'పై సమీక్ష
- సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లేందుకు వినూత్న కార్యక్రమం
- 'మీకోసం.. మీతో' రూపకల్పనపై కసరత్తు

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఇక నుంచి పార్టీ కార్యకలాపాలపై దృష్టి సారించనున్నారు. వారిద్దరూ బుధవారం మధ్యాహ్నం 2.30కి టీడీపీ కేంద్ర కార్యాలయానికి వస్తున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పార్టీ కార్యకలాపాలపై సుదీర్ఘ సమీక్ష నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి తర్వాత పొలిట్‌బ్యూరో సమావేశాలకు.. పార్టీ చేపట్టే కార్యక్రమాలపై నేతలకు దిశా నిర్దేశం చేసేందుకు మాత్రమే వీరు పార్టీ కార్యాలయానికి వచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు, లోకేశ్.. సీఎంగా, మంత్రిగా పూర్తిగా ప్రభుత్వ వ్యవహారాలపైనే దృష్టి సారించడంతో సంస్థాగత పదవుల భర్తీ, నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. మహానాడు పూర్తయి మూడు నెలలైనా సంస్థాగత ప్రక్రియ కొలిక్కి రాకపోవడం.. అటు నామినేటెడ్ పదవుల భర్తీ కూడా సాగుతుండడంతో టీడీపీ శ్రేణుల్లో ఒకింత అసంతృప్తి నెలకొంది. ఇది తెలిసి ఇక పార్టీపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. మంగళవారం పల్లా శ్రీనివాసరావు, టీడీ జనార్దన్ తదితరులతో సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై చర్చించారు. ఇప్పటి వరకు క్లస్టర్, యూనిట్, బూత్(సీయూబీ) స్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు ఎన్నికల ప్రక్రియ ఎంత వరకు వచ్చిందో వివరాలు సమర్పించాలని ఆదేశించారు. సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో ఎక్కడ ఇబ్బంది వస్తోంది.. ఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు, పార్టీ నేతలకు సమన్వయం లోపించిందనే సమగ్ర వివరాలు తీసుకురావాలని పల్లాను ఆదేశించినట్లు సమాచారం. దీంతోపాటు నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యానికి కారణాలను కూడా బుధవారం నాటి భేటీలో చంద్రబాబు చర్చించనున్నారు. నామినేటెడ్ పదవుల కోసం ఇప్పటి వరకు పేర్లు పంపని ఎమ్మెల్యేలెవరో తనకు తెలియజేయాలని కూడా సూచించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగిన తీరును ఆయన సమీక్షించనున్నారు. ఏ ఎమ్మెల్యే ఎన్ని రోజులపాటు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఎమ్మెల్యేలు లేని చోట్ల ఏయే నేతలు పాలుపంచుకున్నారు.. ఎన్ని రోజులు పాల్గొన్నారనే వివరాలను కూడా తీసుకురావాలని పల్లాను కోరారు.

ఢిల్లీ బీసీ సభకు టీడీపీ మద్దతు

విజయవాడ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీకి బీసీలే వెన్నుముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి యలగాల నూకాలమ్మ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ మంగళవారం అమరావతిలో సీఎంను కలిశారు. బీసీల హక్కుల సాధనకోసం ఈ నెల 18, 19 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించే ఉద్యమానికి మద్దతివ్వాలని వారు సీఎంను కోరారు. మంత్రులు, ఎంపీలను కార్యక్రమానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన చంద్రబాబు.. బీసీల హక్కుల సాధనకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ వెంకట రమణరాజు, రాష్ట్ర కన్వీనర్ తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా జనంలోకి..

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ ముందుకెళ్తోందని.. కానీ వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వెనుకబడుతున్నారని చంద్రబాబు పలు సందర్భాల్లో అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేసే మంచిని జనంలోకి తీసుకెళ్లేందుకు 'మీకోసం.. మీతో' అనే కార్యక్రమానికి రూపకల్పన చేసేందుకు టీడీపీ పెద్దలు సిద్ధమవుతున్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి భిన్నంగా దీనికి రూపకల్పన చేయాలన్నది వారి ఆలోచన. అదెలా ఉండాలన్న అంశంపై బుధవారం చర్చించనున్నారు. ఈ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటుపైనా చంద్రబాబు దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.

మూడు సార్లే పదవిపైనా చర్చ

గ్రామ, మండల స్థాయిలో వరుసగా మూడు సార్లు పదవులు చేపట్టిన వారిని ఆ పదవిలో కొనసాగించకూడదన్న నిర్ణయంపై కూడా పార్టీ నేతలతో చంద్రబాబు, లోకేశ్ చర్చించనున్నారు. ఈ నిర్ణయం ద్వారా వైసీపీ హయాంలో పార్టీ కోసం పోరాడిన వారికి పదవులు దక్కకుండా పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయాల్సి వస్తే పదవులు కోల్పోయేవారికి ఇతర పదవులు తప్పనిసరిగా దక్కేలా చూడాలని, దానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో చర్చించనున్నారు.

మరో 31 నామినేటెడ్ పదవులు భర్తీ

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మరో విడత నామినేటెడ్ పదవులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. తాజాగా 31 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ కూటమి ప్రభుత్వం మంగళవారం జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో అమరావతి బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)కి ఒక పదవి దక్కింది. ఈ ఏడాది మేలో భర్తీ చేసిన నామినేటెడ్ పదవుల్లో అమరావతి జేఏసీకి రెండు పదవులు ఇచ్చారు. ప్రస్తుతం భర్తీ చేసిన 31 పదవుల్లో టీడీపీకి 25, జనసేనకి 3, బీజేపీకి 2, అమరావతి బహుజన జేఏసీకి ఒకటి దక్కాయి. సామాజిక వర్గాల వారీగా చూస్తే.. బీసీలకు అత్యధికంగా 18 పదవులు దక్కాయి. ఎస్సీలకు నాలుగు, మైనార్టీలకు రెండు, ఎస్టీలకు ఒకటి కేటాయించారు. గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల తర్వాత తొలి విడతగా సెప్టెంబరు 24న నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. తొలి విడతలో 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. 2024 నవంబరులో 59 కార్పొరేషన్లకు, 2025 మే 11న మరో 22 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. తాజా నియామకాలతో కలిపి ఇప్పటివరకు 132 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినట్లయింది.

కార్పొరేషన్ చైర్మన్ల వివరాలు ఇవీ..

కార్పొరేషన్ చైర్మన్ పేరు	నియోజకవర్గం, పార్టీ
1. షెడ్యూల్డ్ కులాల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్	ఆకెపోగు ప్రభాకర్ (కోడుమూరు- టీడీపీ)
2. రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు	పోతుల బాలకోటయ్య (నందిగామ- బహుజన జేఏసీ)
3. కమ్మ కార్పొరేషన్	నాదెండ్ల బ్రహ్మం చౌదరి (గురజాల- టీడీపీ)
4. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ లిమిటెడ్	బుచ్చి రాంప్రసాద్ (గుంటూరు వెస్ట్- టీడీపీ)
5. ముదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	సీఎస్ త్యాగరాజన్ (చిత్తూరు- టీడీపీ)
6. బొందిలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	డి.విక్రమ్ సింగ్ (కర్నూలు- టీడీపీ)
7. హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్	దాసరి శ్రీనివాసులు (తిరుపతి- బీజేపీ)
8. వడ్డీ అభివృద్ధి కార్పొరేషన్	గుంటసల వెంకటలక్ష్మి (దెందులూరు- జనసేన)
9. ఆరెకటిక/కటిక/ఆరే-సూర్యవంశీ సంక్షేమ, అభివృద్ధి సంఘం	హరికృష్ణారావు హనుమంతకరి (తాడిపత్రి- టీడీపీ)
10. విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	కమ్మరి పార్వతి (పాణ్యం- టీడీపీ)
11. కుంచిటి, వక్కలిగ, వక్కలిగర, కుంచిటిగ సంక్షేమ, అభివృద్ధి సంఘం	లక్ష్మీనారాయణ (మడకశిర- టీడీపీ)
12. ఏపీ నగరాలు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	మరుపిల్ల తిరుమలేశ్వరరావు (విజయవాడ వెస్ట్- టీడీపీ)
13. ఏపీ పాల-ఏకరి, ఏకిల, వ్యాకుల, ఏకిరి, నాయనివారు, పాలెగారు, తోలగారి, కవలి సంక్షేమ, అభివృద్ధి సంఘం	నాగేశ్వరనాయుడు కందూరి (రాయచోటి- టీడీపీ)
14. నూర్‌బాషా/దూదేకుల కార్పొరేషన్	నాగుల్ మీరా కాసునూరి (విజయవాడ వెస్ట్- టీడీపీ)
15. కురాకుల, పొందర సంక్షేమ, అభివృద్ధి సంఘం	నరసింహులు దామోదర (నరసన్నపేట- టీడీపీ)
16. వికలాంగులు, వృద్ధ పౌరుల సహాయ కార్పొరేషన్	నారాయణస్వామి (రాప్తాడు- టీడీపీ)
17. కనీస వేతన సలహా బోర్డు	పెళ్లకూరు శ్రీనివాసుల రెడ్డి (కోవూరు- టీడీపీ)
18. మాంసం అభివృద్ధి కార్పొరేషన్	ప్రకాశ్ నాయుడు (సింగనమల- టీడీపీ)
19. తెలుగు, సంస్కృత అకాడమీ	ఆర్డీ విల్సన్ (నెల్లూరు సిటీ- బీజేపీ)
20. సగర/ఉప్పర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	ఆర్ వెంకటరమణప్ప (పెనుకొండ- టీడీపీ)
21. నాగవంశం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	ఎరుబోతు రమణారావు (విజయవాడ సెంట్రల్- టీడీపీ)
22. కళింగ కోమటి/కళింగ వైశ్య సంక్షేమ, అభివృద్ధి సంఘం	రమేశ్ మొదలవలస (ఆముదాలవలస- టీడీపీ)
23. సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ	రవి మందలపు (రాజమండ్రి సిటీ- టీడీపీ)
24. వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్	రెడ్డి అనంతకుమారి (కొత్తపేట- టీడీపీ)
25. బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్	శ్రీధర్ బొమ్మన (సూళ్లూరుపేట టీడీపీ)
26. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఓయూడీఏ)	షేక్ రియాజ్ (ఒంగోలు- జనసేన)
27. జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ	వంపూరు గంగులయ్య (పాడేరు- జనసేన)
28. వీరశైవ లింగాయత, లింగబలిజ సంక్షేమ, అభివృద్ధి సంఘం	స్వప్న (అనంతపురం అర్బన్- టీడీపీ)
29. కృష్ణ బలిజ/పూసల సహకార ఆర్థిక కార్పొరేషన్ లిమిటెడ్	త్రిమూర్తులు గంట (భీమవరం- టీడీపీ)
30. జంగం సంక్షేమ, అభివృద్ధి సంఘం కార్పొరేషన్	వి.చంద్రశేఖర్ (పీలేరు- టీడీపీ)
31. దాసరి సంక్షేమ, అభివృద్ధి సంఘం	వెంకట రత్నాజీ పొత్నూరు (శృంగవరపుకోట- టీడీపీ)

యావజ్జీవ ఖైదీ శ్రీకాంత్ పెరోల్ రద్దు

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రభుత్వం ఉలికిపాటు
- మధ్యాహ్నం జీవో జారీ.. సాయంత్రానికి జైలుకు
- నిబంధనలను ఉల్లంఘించినవారెవరు?
- నిఘా వర్గాల ఆరా.. సర్కారుకు నివేదన

అమరావతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో అతడు యావజ్జీవ ఖైదీ.. జైలు నుంచి పారిపోయిన చరిత్ర కూడా ఉంది.. 2 పోలీసు స్టేషన్లలో రౌడీషీట్లు కూడా తెరిచారు. పెరోల్ ఇవ్వడానికి 2 జిల్లాల ఎస్పీలు ససేమిరా అన్నారు. హోం శాఖ సంయుక్త కార్యదర్శి సైతం తిరస్కరించారు. అయినా.. నిబంధనలకు విరుద్ధంగా సదరు ఖైదీ అవిలేలి శ్రీకాంత్ పెరోల్ పొందడంపై 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంతో పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. కేంద్రం గత ఏడాది తీసుకొచ్చిన బీఎన్ఎస్ చట్టాల్లోని నిబంధనల మేరకు విడుదలైన జీవోను ఇదే ప్రభుత్వంలో ఉల్లంఘించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. శ్రీకాంత్ పెరోల్ రద్దుచేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ మంగళవారం మధ్యాహ్నం ఉత్తర్వులు జారీ చేశారు. సాయంత్రానికి పోలీసులు అతడిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. వాస్తవానికి హత్య కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ జైలు నుంచి పరారైన శ్రీకాంత్‌కు పెరోల్ లభించదని నెల్లూరు జైలు సూపరింటెండెంట్ ప్రభుత్వానికి నివేదించారు. అతడి నేర చరిత్ర, రౌడీ షీట్లను దృష్టిలో పెట్టుకుని తిరుపతి, నెల్లూరు జిల్లాల ఎస్పీలు సైతం పెరోల్ దరఖాస్తుపై 'నాట్ రెకమెండెడ్' అని రాశారు. అయినా గత నెల 30న శ్రీకాంత్‌కు 30రోజుల పాటు పెరోల్ ఇచ్చారు. ప్రభుత్వంలోని కొందరు పెద్దల సహకారంతో శ్రీకాంత్ ప్రియురాలు ఈ పెరోల్ మంజూరు చేయించినట్లు సమాచారం. దీనిపై మంగళవారం 'ఎవరి కోసం ఈ పెరోల్' అంటూ 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎక్కడ పొరపాటు జరిగింది.. ఎవరి సిఫారసు మేరకు నిబంధనలు ఉల్లంఘించి ఈ పనిచేశారు.. తదితర విషయాలపై నిఘా వర్గాలు ఆరా తీసి ప్రభుత్వానికి సమాచారం ఇచ్చాయి. అనంతరం కొన్ని గంటల్లోనే పెరోల్ రద్దు చేస్తూ జీవో జారీ అయింది. దరిమిలా గూడూరులో ఉన్న శ్రీకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని నెల్లూరు జైలుకు తరలించారు.


ఏ పని కోసం ఈ పెరోల్?

సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

మరుగుదొడ్డిలో 16 అడుగుల కింగ్ కోబ్రా

కురుపాం/కురుపాం రూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా.. కురుపాం మండలం కిచ్చాడ గ్రామంలో మంగళవారం ఓ ఇంటి పెరటిలోని మరుగుదొడ్డిలో కింగ్‌కోబ్రా కనిపించింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో కురుపాం ఫారెస్ట్ రేంజర్ గంగరాజు విశాఖపట్నం నుంచి వన్యప్రాణుల సంరక్షణ సభ్యులను రప్పించారు. తూర్పు కనుమ వన్యప్రాణి సంరక్షణ సభ్యుడు కంటిమహంతి మూర్తి ఆధ్వర్యంలో ముగ్గురు ఫారెస్ట్ సిబ్బంది చాకచక్యంగా కింగ్ కోబ్రాను పట్టుకుని.. సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ విష సర్పం సుమారు 16 అడుగులు ఉంటుందని వారు తెలిపారు.



జగన్ మార్క్ ట్రాప్!

ఆ ఉచ్చులో కొందరు టీడీపీ నేతలు

- మద్యం స్కామ్‌లో ప్రభుత్వ వ్యూహంపై సోషల్ మీడియాలో అడ్డగోలు దాడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఓ నేరానికి పన్నిన కుట్రలోనూ, దాని అమలులోనూ భాగస్వాములైన వారు అప్రూవర్‌గా మారి కేసు లోగుట్టు రట్టయ్యేందుకు సహకరించడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలా అప్రూవర్‌గా మారిన వారి సహకారంతో కుట్ర కోణాన్ని పోలీసులు ఛేదిస్తుంటారు. నేరాల్లో భాగస్వాములైన వారు అప్రూవర్లుగా మారకూడదని, లోగుట్టు బయటపెట్టకూడదని తెరచాటు కుట్రదారులు సహజంగానే కోరుకుంటారు. రూ.3,500 కోట్ల విలువ చేసే ఏపీ మద్యం కుంభకోణం కేసు కూడా ఈ కోవకు చెందినదే. లిక్కర్ ముడుపుల దందాలో మూలవిరాట్ ఎవరంటే అన్ని వేళ్లూ తాడేపల్లి ప్యాలెస్‌వైపే చూపుతున్నాయి. మాజీ సీఎం జగన్ పేరును ప్రత్యేక దర్యాప్తు బృందం చార్జిషీట్లోనూ ప్రస్తావించింది. అసలు సూత్రధారి ప్రమేయంపై పక్కా ఆధారాలు, సాక్ష్యాలు లభించాలంటే.. మద్యం స్కాంలో ఆది నుంచీ చివరి వరకు పనిచేసిన ఉన్నతాధికారులు వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ మరిన్ని విషయాలు బయటపెట్టాలి. దర్యాప్తు బృందానికి వారు సహకరించాలి. అలా సహకరించాలంటే తమను అరెస్టు చేయకూడదని.. జైల్లో పెట్టకూడదని వారు కోరుకోవడం సహజమే. వారిని కూడా మిగతా నిందితుల మాదిరిగానే జైల్లో నిర్బంధిస్తే కేసు ముందుకు సాగదు. వాస్తవానికి ఒక కేసులో ఎవరైనా అప్రూవర్‌గా మారాలంటే అప్పటికే అరెస్టు అయి ఉండటం.. లేదా వారికి ముందస్తు బెయిల్ వచ్చి ఉండటం అనేది న్యాయపరమైన ఆవశ్యకత. దీనిని దృష్టిలో ఉంచుకునే ఇటు పోలీసులు, అటు ప్రభుత్వ న్యాయవాద బృందం నిర్దిష్టమైన వ్యూహప్రతివ్యూహాలు అనుసరిస్తుంటాయి. అవన్నీ నలుగురికీ చెప్పిచేసేవి కావు. అసలు కుట్రదారును కలుగులో నుంచి బయటకు తీసుకొచ్చేదాకా ఆ వ్యూహాలను బహిర్గతం చేయరు. కానీ వాటిని ముందుగానే గ్రహించి ప్రత్యర్థులను దెబ్బతీయడంలో జగన్‌ది అందెవేసిన చెయ్యి. అక్రమాస్తుల కేసు నుంచి తన చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు వరకు ఇదే కనబడుతోంది. ఇప్పుడు మద్యం స్కాంలో కూడా తన పేరు బయటకు రాకుండా, తన అరెస్టుకు దారితీయకుండా తెరచాటు మంత్రాంగం నడుపుతున్నారు. వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌ను అప్రూవర్లుగా మార్చుకునేందుకు సిట్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఆయన పావులు కదుపుతున్నారు. ఆ అధికారులిద్దరిపైనా ఒత్తిడి తేవడం ఒక ఎత్తయితే.. దర్యాప్తు సంస్థను, ప్రభుత్వ లీగల్ టీంను తప్పుదారి పట్టించడం మరో ఎత్తు. జగన్ ఇలాంటివాటిలో ఆరితేరారు. ఈ లోగుట్టు తెలియక.. ప్రభుత్వం, పోలీసులు, లీగల్ టీం.. ఆ ఇద్దరు అధికారుల ముందస్తు బెయిల్‌కు సహకరిస్తున్నారంటూ టీడీపీకే చెందిన కొందరు నేతలు సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారు. ఏకంగా అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌ను టార్గెట్ చేస్తున్నారు. ముందస్తు బెయిల్ కోసం వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ఏసీబీ కోర్టులో దాఖలుచేసిన పిటిషన్లపై మంగళవారం వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి 18న తీర్పు వెలువరించనున్నారు. ముందస్తు బెయిల్‌కు సిట్, ప్రభుత్వం తరఫు న్యాయవాదులు అభ్యంతరం తెలుపలేదు. వారిని అప్రూవర్లుగా మార్చుకోవడానికి ఇది ఉపకరిస్తుందన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇది తెలియకో.. జగన్ ప్రభావానికి లోనయ్యో.. కొందరు టీడీపీ నేతలు.. సిట్, న్యాయవాదులకు వ్యతిరేకంగా అడ్డగోలు పోస్టింగులు పెడుతున్నారు. దీంతో ఇది కుడి తలనొప్పి అంటూ వారు నిట్టూరుస్తున్నారు. జగన్ కోరుకుంటున్నదీ ఇదే.

టీడీపీ నేతలే ఎందుకు..?

లిక్కర్ కేసులో ఆ ఇద్దరు అధికారులకు సిట్, లీగల్ టీం సహకరిస్తున్నాయని వైసీపీ, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు ఆరోపణలు చేస్తే విలువ ఉండదు. ఎవరూ పెద్దగా పట్టించుకోరు కూడా. అవే ఆరోపణలు అధికార పార్టీ నేతలతో చేయిస్తే..? సోషల్ మీడియా వేదికగా డిబేట్లు పెట్టి అల్లరి చేయిస్తే..? దర్యాప్తు అధికారులు, లీగల్ బృందంపై విమర్శలు చేయిస్తే..? కేసు పక్కదారి పడుతుంది. అసలు విషయం పక్కకు వెళ్లి, కొసరు విషయాలపైనే చర్చ జరుగుతుంది. ఇదే సమయంలో లిక్కర్ కేసులో మూలవిరాట్.. అరెస్టు తన దాకా రాకుండా జాగ్రత్తపడవచ్చు. ఇప్పుడు అచ్చం ఇదే జరుగుతోందని అధికార వర్గాలు అంటున్నాయి. జగన్ వ్యూహాత్మకంగా టీడీపీ నేతలను ట్రాప్ చేశారని చెబుతున్నాయి.

వారు నోరు విప్పకూడదు!!

నిజానికి లిక్కర్ కేసులో కీలక నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లను సిట్ ఇప్పటివరకు అరెస్టు చేయలేదు. కానీ అనేక దఫాలు పిలిచి విచారణ జరిపింది. వారిచ్చిన సమాచారం ఆధారంగానే కేసులో ఇంత పురోగతి సాధించింది. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహా 12 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రమేయం.. గత ఎన్నికల్లో లిక్కర్ ముడుపుల సొమ్ము ఖర్చు పెట్టడం, లంచాల సొమ్ముతో భారీగా బంగారం కొనుగోలు చేయడం.. ఇంకా దేశవిదేశాల్లో మైనింగ్ వ్యాపారాల నిర్వహణ వంటి అనేక అంశాలను వెలుగులోకి తెచ్చింది. నానాటికీ ఈ కేసు పెద్దదవుతుండడంతో తాము అప్రూవర్లుగా మారితే శిక్ష తగ్గవచ్చని వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ అనుకున్నారు. ఆ మేరకు న్యాయపరమైన ప్రక్రియ ముగించేందుకు వారు సిద్ధమయ్యారు. అప్పటికే విచారణలో జగన్ పేరు చెప్పొద్దని వారికి బెదిరింపులు వెళ్లాయి. సిట్‌కు సహకరించవద్దని, తమతో అబద్ధాలు చెప్పిస్తున్నారని కోర్టులో వెల్లడించాలని కూడా ఒత్తిళ్లు తెచ్చారు. అవేవీ ఫలించకపోవడంతో, వారి ముందస్తు బెయిల్‌ను సిట్ అభ్యంతరపెట్టకపోవడంపై టీడీపీ వారే ఆరోపణలు చేసేలా చేసి కేసు తన మెడకు చుట్టుకోకుండా చూసుకునే కుతంత్రానికి జగన్ తెర తీశారు.

వివేకా కేసులో అలా..

మద్యం కేసులో వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ ముందస్తు బెయిల్ దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన.. సిట్, ప్రభుత్వ న్యాయవాదులు వారికి సహకరిస్తున్నాయని అనుకోవడం సముచితం కాదని అధికార వర్గాలు అంటున్నాయి. ఒక్కసారి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏం జరిగిందో తెలుసుకుంటే అసలు విషయం బోధపడుతుందని చెబుతున్నాయి. ఆ కేసులో దస్తగిరి (ఏ-4) కీలక నిందితుడు. అతడిని సీబీఐ అరెస్టు చేసినప్పుడు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అదే సమయంలో అప్రూవర్‌గా మారతానని సీబీఐకి సమాచారం ఇచ్చాడు. దీంతో అతడి బెయిల్‌కు దర్యాప్తు సంస్థ అడ్డుచెప్పలేదు. ఇదే కేసులో ఉన్న ఇతర నిందితులు గంగిరెడ్డి, మరి కొందరు అభ్యంతరం తెలిపారు. దస్తగిరిని అప్రూవర్‌గా అనుమతించొద్దని కోరుతూనే.. సీబీఐపై అనేక తీవ్ర ఆరోపణలు చేశారు. దస్తగిరి అప్రూవర్ పిటిషన్‌ను కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించారు. వారి వాదనను న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ తోసిపుచ్చారు. 'దస్తగిరి అప్రూవర్‌గా మారితే కేసు విచారణకు ఉపకరిస్తుందని సీబీఐ చెబుతోంది. జరిగిన నేరం(వివేకా హత్య)లో ఎవరి పాత్ర ఏమిటో దర్యాప్తు సంస్థ మరింత సవివరంగా కనిపెట్టగలదు. నిర్ధారించగలదు. సాక్ష్యాధారాలు సేకరించి కోర్టు ముందు ఉంచగలదు. అప్రూవర్‌గా మారినంత మాత్రాన అతడితో సీబీఐ కుమ్మక్కయినట్లు భావించడానికి వీల్లేదు' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. దస్తగిరి అప్రూవర్‌గా మారేందుకు కోర్టు అనుమతించింది. అతడికి బెయిల్ కూడా వచ్చింది. ఇక దస్తగిరి జైల్లో ఉన్నప్పుడు, ఆ తర్వాత బెయిల్‌పై బయటకొచ్చాక అనేక బెదిరింపులు, హెచ్చరికలు ఎదురయ్యాయి. అతడిపై దాడి చేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. తప్పుడు కేసులో జైలుకు కూడా పంపారు. తనకు రక్షణ కల్పించాలని కడప ఎస్పీని అనేక సందర్భాల్లో దస్తగిరి కోరాడు.

లిక్కర్ కేసులో ఇలా..

మద్యం కేసులో అక్రమార్కులకు ఆసాంతం సహకరించిన అధికారులు వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్. ముడుపుల పాలసీ రూపకల్పన కోసం ఎంపీ మిథున్‌రెడ్డి నిర్వహించిన తొలి సమావేశంలో పాల్గొనడం నుంచి ముడుపుల దందాను గత ఏడాది మే నెల వరకు అప్రతిహతంగా అమలు చేయడంలో అధికారులుగా వారి పాత్ర ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక లిక్కర్ స్కాంలో కేసు నమోదైంది. తొలుత వాసుదేవరెడ్డి, తర్వాత సత్యప్రసాద్‌ను సిట్ విచారించింది. వారు కీలక విషయాలు వెల్లడించిన తర్వాతే.. జగన్ ప్రభుత్వంలో లిక్కర్ మాఫియాను ఎలా నడిపించారు? ఎన్ని వేల కోట్లు దారి మళ్లించారో సిట్ కనిపెట్టగలిగింది. శిక్ష తప్పించుకోవడానికి ఇప్పుడు వారిద్దరూ అప్రూవర్లుగా మారడానికి ముందుకొచ్చారు. అదే సమయంలో ముందస్తు బెయిల్ కోరుకుంటున్నారు. అయితే మిగతా నిందితుల మాదిరిగానే వీరిని కూడా అరెస్టు చేసి జైల్లో పెట్టాలని ఈ స్కాంలోని తెరవెనుక సూత్రధారులు కోరుకుంటున్నారు. అదే జరిగితే వారు అప్రూవర్లుగా మారరని, తమతోనే ఉంటారన్నది వారి ఆలోచన. కానీ వారికి ముందస్తు బెయిల్ రావడానికి సహకరించి.. ఆనక అప్రూవర్ పిటిషన్లు వేయించాలన్నది ప్రభుత్వ లీగల్ బృందం భావన. చట్టపరంగా ఈ సాంకేతిక కోణం గురించి తెలియక కొందరు టీడీపీ నేతలు జగన్ విసిరిన వలలో చిక్కుకున్నారు. నిందితుల ముందస్తు బెయిల్‌కు సహకరిస్తున్నారంటూ అడ్డగోలు పోస్టులు పెడుతూ సమస్యను మరింత జటిలం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని.. పరోక్షంగా జగన్‌కు సహకరిస్తున్నారని అధికార వర్గాలు అంటున్నాయి.

ఓ తల్లి ప్రేమ 'పాశం'!

- మతిస్థిమితం కోల్పోయిన కొడుకు.. దిక్కుతోచక బంధించిన తల్లి
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఆరు నెలలకే భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో విష గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. వైద్యంతో అతడి ప్రాణాలు నిలబడ్డాయేగానీ మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో కనిపించిన వారినల్లా దూషించడం, దాడికి ప్రయత్నిస్తుండటంతో ఆందోళన చెందిన తల్లి.. దిక్కుతోచని పరిస్థితుల్లో కొడుకును సంకెళ్లతో బంధించి కాపాడుకుంటూ వస్తోంది. వృద్ధాప్యంలో తనను చూసుకోవాల్సిన కొడుక్కి.. అన్నీ తానే అయి.. వేళకు కడుపు నింపుతూ, మలమూత్ర విసర్జనకు సాయపడుతూ.. చంటి బిడ్డను చూసుకుంటున్నట్లు చూసుకుంటోంది. కటిక పేదరికంలో ఉన్న ఆమె.. తన కొడుకు వైద్యం కోసం దాతలు కరుణించాలని కన్నీళ్లతో వేడుకుంటోంది. శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం ఉగ్గిరెడ్డిపల్లికి చెందిన సరోజమ్మ కొడుకు రమేష్‌కు కర్ణాటకకు చెందిన గీతతో 8ఏళ్ల క్రితం క్రితం వివాహమైంది. ఆరు నెలలకే భార్య పుట్టింటికి వెళ్లిపోగా, విష గుళికలు మింగాడు. తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛన్, రేషన్ బియ్యమే ఇప్పుడు వారికి ఆసరా. దాతలు ఆర్థిక సాయాన్ని 'గుత్తా సరోజమ్మ, ఆంధ్ర ప్రగతి బ్యాంకు, ఖాతా నంబరు: 91006229142, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఏపీజీబీ0001045'కు అందించవచ్చు. నేరుగా సంప్రదించేవారు 8897239340కు ఫోను చేయొచ్చు.


మతిస్థిమితం లేని కొడుకు రమేష్‌కు సేవలు చేస్తున్న తల్లి సరోజమ్మ

ఓ తండ్రి మరణశాసనం!

- కూతుర్ని చంపి, వధువుగా అలంకరించి తానూ ఉరివేసుకుని ఆత్మహత్య... తమిళనాడులో ఘటన

చెన్నై, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): తాడుతో ఆమె గొంతుకు ఉరి బిగించి చంపేశాడు.. మృతదేహానికి పట్టుచీర కట్టి, పూలదండలు వేసి, పెళ్లికూతురిలా ముస్తాబు చేసి చూసుకున్నాడు. తర్వాత అదే తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురికి పెళ్లి కావడంలేదని ఆవేదనతో ఓ తండ్రి చేసిన దారుణమిది. తమిళనాడులోని దిండుగల్ జిల్లాలో జరిగిన ఈ ఘటన స్థానికులను కంటతడిపెట్టించింది. కనక్కంపట్టికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పళనియప్పన్(55), విజయ దంపతులకు కార్తీక, ధనలక్ష్మి(23) అనే ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కార్తీకకు వివాహమైంది. చిన్న కుమార్తె ధనలక్ష్మికి వరుడి కోసం అన్వేషించారు. ఈ లోపు ఆమె అనారోగ్యం పాలైంది. దీంతో ఇక ఆమెకు పెళ్లికాదని పళనియప్పన్ కుమిలిపోయాడు. ఈ నెల 9న పళనియప్పన్ భార్య విజయ.. కుమారుడితో కలసి తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం ఆమె తిరుచెందూరు నుంచి భర్తకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది. చుట్టుపక్కల వారికి ఫోన్ చేసి ఇంటికి వెళ్లి చూడమని ఆమె కోరింది. పక్కింటివారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా.. పళనిస్వామి ఉరేసుకుని వేలాడుతుండటం, నేలపై ధనలక్ష్మి పెళ్లికుమార్తె అలంకరణతో శవంగా పడి ఉండటం కనిపించి దిగ్భ్రాంతి చెందారు. పోలీసుల విచారణలో ధనలక్ష్మికి వివాహం జరగలేదన్న కారణంగానే ఆమెను హతమార్చి, తాను ఉరివేసుకున్నాడని వెల్లడైంది.


పళనియప్పన్, కుమార్తె ధనలక్ష్మి

మూడేళ్లలో జరగాల్సిన పనులు 8 నెలల్లో పూర్తి

- 'అక్షరమే అండగా.. పరిష్కారం అజెండా' తోనే సాధ్యం: ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు

రాజమహేంద్రవరం/విజయనగరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' అనేది ఒక వినూత్న కార్యక్రమం. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని 9వ వార్డును ఎంచుకున్నారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. దీంతో ఒక్క వార్డులో 8 నెలల్లో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు తదితర 32 పనులు రూ.9.69 కోట్లతో పూర్తి చేశారు. అదనంగా వార్డులో పార్కుల అభివృద్ధికి రూ.2 కోట్లతో, వాటర్ సప్లై పనులు రూ.3 కోట్లతో, ఇతర పనులు రూ.2 కోట్లతో జరుగుతున్నాయి. వార్డులోని అందరూ 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతగా ఉండాల్సిన అవసరం ఉంది. వారి చొరవతో జరిగిన అభివృద్ధిని గుర్తు పెట్టుకోవాలి." అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఈ ఏడాది జనవరి 28, 29 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక 9వ వార్డులో ప్రజల సమస్యలను వారి సమక్షంలోనే మునిసిపల్ కార్పొరేషన్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. "ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ చక్కటి ఆలోచన, బాధ్యత కలిగిన వ్యక్తి. తప్పును ధైర్యంగా ప్రశ్నించగలిగిన శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. విలువలను నిలబెట్టడంలో రాధాకృష్ణ పోరాటం చేశారు. ఇప్పుడు సక్సెస్ మీట్ పెట్టిన ఐఎంఏ హాల్ రోడ్డు అధ్వానంగా ఉండేది. ఇప్పుడు సిమెంటు రోడ్డు వేయడంతో రూపురేఖలు మారిపోయాయి. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎప్పుడూ ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటుంది." అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ డీఈ శ్యామ్యూల్, ఎలక్ట్రికల్ డీఈ లోవరాజు, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది పాల్గొన్నారు.


తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని 9వ వార్డులో 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి ముందున్న పరిస్థితిని, కార్యక్రమం తర్వాత జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు



విజయనగరంలో పార్కు అభివృద్ధికి 35.85 లక్షలు

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరమే అండగా, పరిష్కారమే అజెండా' కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. విజయనగరంలోని గాంధీ పార్కుకు వీఎంఆర్‌డీఏ(విశాఖ మెట్రో పాలిటిన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) రూ.35.85 లక్షలు కేటాయించింది. ఈ సందర్భంగా పార్కులో 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్' మంగళవారం విజయోత్సవ సభ నిర్వహించింది. ఈ ఏడాది జనవరి 8న గాంధీ పార్కులో 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్కులో ఉన్న కొన్ని సమస్యలను నగరపాలక సంస్థ అధికారులు అదే నెలలో పరిష్కరించగా, గాంధీపార్కు అభివృద్ధికి వీఎంఆర్‌డీఏ తాజాగా రూ.35.85 లక్షలు కేటాయించింది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టరు అంబేడ్కర్ మాట్లాడుతూ.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ సంస్థలు ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. తాము కూడా నిధులు కేటాయిస్తామని తెలిపారు.

ఏపీలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్(ఏఎస్ఐపీ) సంస్థ సెమీ కండక్టర్ యూనిట్‌ను స్థాపించేందుకు ఆమోదముద్ర వేసింది. ఈ సంస్థకు ఏటా 9.6 కోట్ల చిప్‌లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఈ యూనిట్‌ను రాష్ట్రంలో స్థాపించాలంటూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్ఐపీని ఆహ్వానిస్తూ లేఖ రాసింది. ఆ సంస్థ తెలిపిన సమ్మతిని కేంద్రానికి రాష్ట్రం వివరించింది. దీనికి కేంద్రం ఆమోదముద్రవేసింది. తిరుపతి ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో సెమీ కండక్టర్ యూనిట్‌ను స్థాపించేందుకు మార్గం సుగమమైంది. ప్రాథమికంగా రూ.468 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మతి తెలిపిన ఏఎస్ఐపీ.. క్రమంగా పెట్టుబడులను విస్తరిస్తూ రూ.1,500 కోట్లకు తీసుకువెళ్లే ఆలోచనలో ఉందని అధికారవర్గాలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపాయి.

రాయలసీమలో ఎలక్ట్రానిక్ క్లస్టర్..

విశాఖపట్నం, అమరావతిలో సాఫ్ట్‌వేర్ పెట్టుబడులకు ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. రాయలసీమలో ఎలక్ట్రానిక్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణను అమలు చేస్తోంది. 2014-19 మధ్య కాలంలోనే తిరుపతిని ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌గా ప్రకటించారు. తాజాగా ఏఎస్ఐపీ సెమీ కండక్టర్ యూనిట్ స్థాపనతో ఈ రంగంలో రాష్ట్రంలో పెట్టుబడులు మరింత జోరందుకోనున్నాయి. ఏఎస్ఐపీకి ఆహ్వానం పలుకుతూ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ కార్యదర్శి కాటంనేని భాస్కర్ రాసిన లేఖలో ఆ సంస్థకు ఇచ్చే రాయితీలను ప్రస్తావించారు. మూలధన పెట్టుబడిలో 25 శాతం రాయితీని ఇస్తారు. నామమాత్రం ధరకు భూమిని ఇస్తారు. ఐదేళ్ల పాటు విద్యుత్తును యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీకి అందిస్తారు. అలాగే ఐదేళ్ల పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీకి మినహాయింపునిస్తారు. టర్మ్‌లోన్ వడ్డీపై ఐదేళ్లపాటు సబ్సిడీ, ఎస్‌జీఎస్టీని పూర్తిగా ఐదేళ్లపాటు మినహాయిస్తారు.

సీఎం చంద్రబాబు హర్షం

రాష్ట్రానికి సెమీ కండక్టర్ యూనిట్‌ను కేటాయిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఫోన్ చేశారు. ప్రధాని మోదీకి, కేంద్రానికి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్న ఏఎస్ఐపీ టెక్నాలజీస్, దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కంపెనీ లిమిటెడ్‌కు సీఎం స్వాగతం పలికారు. మొబైల్స్, సెట్ టాప్ బాక్సులు, ఆటోమోటివ్ ఈసీయూ, గృహ వినియోగ ఎలక్ట్రానిక్స్ పరికరాలకు ఈ యూనిట్‌లో సెమీ కండక్టర్ల ఉత్పత్తి జరుగుతుందని వెల్లడించారు.

ప్రధాని మోదీకి లోకేశ్ ధన్యవాదాలు

రాష్ట్రానికి సెమీ కండక్టర్ తయారీ కేంద్రాన్ని మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి నారా లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కంపెనీ, ఏఎస్ఐపీ కలసి రాష్ట్రంలో ఏటా 9.6 కోట్ల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటవుతుందని చెప్పారు.

ఏపీ దిశ మారుతుంది: యామినీ శర్మ

సెమీ కండక్టర్ ప్రాజెక్ట్ రాష్ట్ర దిశను మార్చబోతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ చెప్పారు. ఫోన్‌లు, రక్షణ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏఐకు శక్తిని ఇచ్చే చిప్‌లు తయారవుతాయని, యువతకు ఉపాధి దొరుకుతుందన్నారు.

నాలుగు చోట్ల చిప్ ప్లాంట్లు

దేశీయంగా చిప్‌లను తయారు చేసే ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మద్దతునిస్తోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలో మంగళవారం తెలిపారు. మొత్తం రూ.4,594 కోట్లతో కొత్తగా 4సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వీటిని ఒడిశా, పంజాబ్, ఏపీలో ఏర్పాటు చేస్తామన్నారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రూ.2,066 కోట్లతో సిలికాన్ కార్బైడ్ సెమీకండక్టర్ ప్లాంట్, ఆంధ్రప్రదేశ్‌లో రూ.468 కోట్లతో చిప్ ప్యాకేజింగ్ ప్లాంట్‌ను అడ్వాన్స్ సిస్టమ్స్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. పంజాబ్‌లో సీడీఐఎల్ సంస్థ రూ. 117 కోట్లతో ఏటా 15.8 కోట్ల యూనిట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న యూనిట్‌ను ఏర్పాటు చేస్తుందని తెలిపారు.


నాయకులను నిలదీస్తున్న వైసీపీ కార్యకర్త కనకారావు

కేసులు మాకు.. ప్రసంగాలు మీకా?

- వైసీపీ నేతలను నిలదీసిన కార్యకర్త

ఏలూరురూరల్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల వైఖరిపై కార్యకర్తలు రగిలిపోతున్నారు. నాయకులు రెచ్చగొట్టేలా చేస్తున్న ప్రసంగాలపై తాజాగా ఓ కార్యకర్త తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేసులు మాకు ప్రసంగాలు మీకా?" అంటూ నిలదీశారు. మంగళవారం ఏలూరులో వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు హాజరయ్యారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సమయంలో దెందులూరు గ్రామానికి చెందిన కార్యకర్త కనకారావు ఆగ్రహంతో రగిలిపోయారు. "పార్టీ కోసం కష్టపడి పని చేస్తుంటే కనీసం మమ్మల్ని పట్టించుకోవడం లేదు." అన్నారు. మీరు చేస్తున్న ప్రసంగాలతో పోలీసులు మాపై కేసులు పెడుతున్నారని, అసలు దళితులకు పార్టీ ఏం చేస్తుందో చెప్పాలని కనకారావు ప్రశ్నించారు. "జగన్ హయాంలో ఏం జరిగింది?. దళితుల కోసం వైసీపీ ఏం చేసింది? ఏం చేస్తోందో చెప్పాలి." అని బిగ్గరగా అరడంతో కార్యకర్తలు అతనికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. వేదికపై ఉన్న నాయకులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. కార్యకర్త ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.